# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 344 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ ఆదివారం 18 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 344 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SUN 18 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## గురువు కోమటిరెడ్డి కోసం తలైనా ఇస్తా..

### కానీ నీళ్ల కోసం యుద్ధమే: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి




- ఏదుల నుంచి డిండికి నీటిని తరలించడాన్ని అంగీకరించేది లేదన్న అనిరుధ్ రెడ్డి
- పాలమూరు నీళ్ల కోసం గురువునైనా ఎదిరిస్తానని వ్యాఖ్య
- తనకు పాలమూరు ప్రయోజనాలే ముఖ్యమన్న అనిరుధ్

**హైదరాబాద్ పెన్ పవర్:**జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన రాజకీయ గురువైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోసం తన తలనైనా నరుక్కుంటానని... కానీ పాలమూరు ప్రాంత నీటి హక్కుల విషయంలో మాత్రం రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నీళ్ల కోసం అవసరమైతే గురువుతోనైనా యుద్ధం చేస్తానని, తన ప్రాంత ప్రయోజనాలే తనకు ముఖ్యమని తేల్చిచెప్పారు. జడ్చర్లలోని

- మిగతా 2లో

## తెలంగాణలో తీవ్ర కరవు, 315 మండలాల్లో

# కరవు ఛాయలు

- రాష్ట్రంలో 315 మండలాల్లో కరవు పరిస్థితులు నెలకొన్నట్టు గుర్తింపు
- కేంద్రం తక్షణమే సాయం చేయాలని కోరిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రాష్ట్రవ్యాప్తంగా 23 శాతం వర్షపాత లోటు, 13 లక్షల ఎకరాల్లో తగ్గిన సాగు
- పంట నష్టపోయిన రైతులకు రూ.1,986 కోట్ల సహాయ ప్యాకేజీ ప్రతిపాదన
- ప్రమాదకరంగా పడిపోయిన జలాశయాల నీటిమట్టాలు



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో కరవు పరిస్థితులు తీవ్ర రూపం దాల్చాయి. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం గణనీయంగా తగ్గడంతో 315 మండలాల్లో కరవు ఛాయలు అలుముకున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ధారించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రాన్ని తక్షణమే ఆదుకోవాలని, సూక్ష్మ సేద్యం (మైక్రో ఇరిగేషన్), మధ్యంతర పంట విత్తనాల పంపిణీకి అవసరమైన ఆర్థిక సాయం అందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వ్యవసాయ సంక్షోభాన్ని ఆయన కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. మద్దతు ధరతో మొక్కజొన్న, జొన్న తదితర పంటలను 100 శాతం కొనుగోలు చేయాలని, ధరల మద్దతు పథకం కింద ఉన్న 25 శాతం కొనుగోలు పరిమితిని ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. రసాయన ఎరువుల ధరలు, సబ్సిడీలను హేతుబద్ధీకరించడంతో పాటు, వ్యవసాయ కూలీలకు

- మిగతా 2లో

# విద్యుత్, నీటిని పొదుపుగా వాడండి

- ఎల్ నినో ప్రభావంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆందోళన
- విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి
- రాష్ట్రంలో 20,000 మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్
- గతంలో చలిగా ఉండే అక్టోబర్‌లోనూ ఇప్పుడు ఎండల తీవ్రత
- వాతావరణ మార్పుల వల్లే ఈ పరిస్థితి నెలకొందన్న భట్టి



**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారిన నేపథ్యంలో, ప్రజలు విద్యుత్తు, నీటిని అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సహజ వనరులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్' ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ సుమారు 20,000 మెగావాట్లకు చేరుకుందని, పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని వివరించారు. గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో చలి తీవ్రత అధికంగా ఉండేదని, అయితే ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల పరిస్థితులు పూర్తిగా భిన్నంగా మారాయని ఆయన పేర్కొన్నారు. "ఒకప్పుడు చలి నుంచి రక్షణ పొందేందుకు ప్రయత్నించేవాళ్లం, కానీ నేడు ఎండల తీవ్రత నుంచి మనల్ని మనం కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది" అని వ్యాఖ్యానించారు. వాతావరణంలో సంభవిస్తున్న ఈ అనూహ్య మార్పులే విద్యుత్, నీటి కొరతకు దారితీస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ సహజ వనరుల విలువను గుర్తించి, వాటిని పొదుపుగా వినియోగించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



## ఢిల్లీ నిరసనల వెనుక పెద్ద స్కెచ్

### బీజేపీ ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి

- ఢిల్లీ ఓటర్ల జాబితా నిరసనలపై బీజేపీ ఎంపీ కొండా సంచలన వ్యాఖ్యలు
- భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు ఎన్‌క్లేవ్‌ల సమస్యతో వివాదాన్ని ముడిపెట్టిన వైనం
- ప్రధాని మోదీకి వ్యతిరేకంగా 'రెజీమ్ ఛేంజ్' కుట్ర జరుగుతోందని ఆరోపణ
- ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే గతంలో చొరబాట్లను ప్రోత్సహించారన్న ఎంపీ
- విపక్షాల ఏకైక అజెండా ప్రధాని మోదీని ఓడించడమేనని విమర్శ

- మిగతా 2లో

## తెలంగాణ నీళ్లను తరలించే కుట్ర.. చంద్రబాబు ప్లాన్‌కు రేవంత్ సహకారం



- తెలంగాణలో కరవు పరిస్థితులకు ప్రభుత్వమే కారణమని ఆరోపణ
- దేవాదులలో 10 మోటార్లకు మూడు మాత్రమే నడుస్తున్నాయని విమర్శ
- గోదావరి జలాల తరలింపునకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఆరోపణ
- గోదావరి-కావేరి అనుసంధాన ప్రతిపాదనపై హరీశ్‌రావు అభ్యంతరం
- తెలంగాణ నీటి ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని విమర్శ

- మిగతా 2లో



## ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగం కుప్పకూలిపోయింది..

### కత్తులు, కర్రలతో మా వాళ్లను వెంటాడుతున్నారు

- రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్
- నామినేషన్ల ప్రక్రియలో టీడీపీ గూండాయిజం చేస్తోందని ఆరోపణ
- పోలీసుల సమక్షంలోనే ఎంపీలపై దాడులు జరిగాయని వెల్లడి
- చంద్రబాబు పాలనలో జంగిల్‌రాజ్ నడుస్తోందని విమర్శ

**హైదరాబాద్ పెన్ పవర్:**ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగం పూర్తిగా కుప్పకూలిపోయిందని, ప్రజాస్వామ్యాన్ని పట్టపగలే ఖూనీ చేస్తున్నారని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార తెలుగుదేశం పార్టీ హింసకు పాల్పడుతోందని ఆరోపిస్తూ, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా తక్షణమే రాష్ట్రపతి పాలన విధించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు.

- మిగతా 2లో

## దాండియా సంబరాల్లో అపశృతి: విద్యార్థిని దుర్మరణం..

# ఐదుగురి పరిస్థితి విషమం

- ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ దాండియా వేడుకల్లో భారీ ప్రమాదం
- లైటింగ్ స్టాండ్ విద్యార్థులపై కూలడంతో వనపర్తికి చెందిన సోనీ అనే విద్యార్థిని మృతి
- సుమారు 25 మంది విద్యార్థులకు గాయాలు.. ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం
- ఈదురుగాలుల కారణంగానే లైటింగ్ క్రేన్ అదుపుతప్పి కూలినట్లు ప్రాథమిక అంచనా
- ప్రమాదంపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశం



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లోని నాదర్‌గుల్ ప్రాంతంలో ఉన్న ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం రాత్రి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కాలేజీలో నిర్వహిస్తున్న 'సంగమం–2026' టెక్నికల్ మరియు కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన దాండియా వేడుకల్లో విషాదం నిండింది.

- మిగతా 2లో

## నేటి నుంచి వర్ష సూచన.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ



- ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలుల హెచ్చరిక
- ఉత్తర తమిళనాడు తీరంపై కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
- హైదరాబాద్ సహా అనేక జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని తెలిపింది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేసింది. ఉత్తర తమిళనాడు, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 4.5 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది.

- మిగతా 2లో

## సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేకు

# షరతులతో బెయిల్

- నిరసన యాత్రకు ముందు దీప్కేను అదుపులోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు
- బెయిల్ ఇచ్చిన మందిర్ మార్గ్ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు
- రూ. 50,000 వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని కోర్టు ఆదేశం
- ఏడాది పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించరాదని షరతు
- కన్నాట్ ప్లేస్‌లో నిరసన యాత్రకు అనుమతి నిరాకరించిన పోలీసులు



**పెన్ పవర్ డెస్క్:**కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేకు న్యూఢిల్లీలోని మందిర్ మార్గ్ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు శనివారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ. 50,000 వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని ఆదేశించిన న్యాయస్థానం, ఆయన విడుదలకు మార్గం సుగమం చేసింది. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 126, 170 ప్రకారం, ఏడాది పాటు శాంతిభద్రతలకు

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# రెయిన్ డేస్...

ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో రాబోయే రోజుల్లో వానలు పడతాయని వాతావరణ శాఖ వెల్లడించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో నేడు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో వానలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే తేలికపాటి వానలు పడతాయని, మోస్తరు వానలు తప్పించి భారీ వర్షాలు పడవని వాతావరణ శాఖ వెల్లడించింది. కొన్ని చోట్ల బలమైన ఈదురుగాలులు వీస్తాయని, గంటలకు నలభై నుంచి యాభై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. కొన్ని చోట్ల పిడుగులు పడే అవకాశముందని కూడా వాతావరణ శాఖ వెల్లడించింది. ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడతాయని వాతావరణ శాఖ పేర్కొంది. రానున్న నాలుగు రోజుల పాటు వానలు పడతాయని తెలిపింది.

**అక్కడకక్కడ తెలంగాణలో వానలు...**

తెలంగాణలో నేడు అక్కడక్కడ వానలు పడతాయని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులు వీస్తాయని, పిడుగులు పడతాయని చెప్పింది. కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన ఉరుములు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా పెద్దపల్లి, భూపాలపల్లి, సిద్దిపేట, వరంగల్, రంగారెడ్డి, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో వర్షాలు పడే సూచనలు ఉన్నాయని తెలిపింది. హైదరాబాద్ లోపగటి ఉష్ణోగ్రతలు కొంత ఎక్కువగా నమోదయినా, రాత్రి వేళ వాతావరణం చల్లబడే అవకాశముందని తెలిపింది. పగటిపూట ఉష్ణోగ్రతలు సుమారు 31 డిగ్రీల నుంచి 33 డిగ్రీల వరకు ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు.

**ఏపీలో ఉరుములు, మెరుపులతో ...**

ఆంధ్రప్రదేశ్ లో వాతావరణం పై అమరావతి వాతావరణ శాఖ కీలక అప్ డేట్ ఇచ్చింది. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమల్లోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. విజయనగరం, అల్లూరి సీతారామరాజు, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు లేదా పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. అమరావతి, విజయవాడ, తిరుపతి వంటి ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 30డిగ్రీల నుంచి 31 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ప్రధానంగా రైతులు, పశువుల కాపర్లు పొలాల్లోకి వెళ్లినప్పుడు చెట్ల కింద, విద్యుత్తు స్తంభాల కింద నిలబడవద్దని కూడా వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

# తెలంగాణలో తీవ్ర కరవు, 315 మండలాల్లో కరవు ఛాయలు

- మొదటి పేజి తరువాయి

ఉపాధి కల్పనలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.
ఇదే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన అనధికారిక క్యాబినెట్ సమావేశంలోనూ సుదీర్ఘంగా చర్చ జరిగింది. రాష్ట్రంలోని 315 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నాయని, వాటిలో 101 మండలాల్లో తీవ్ర కరవు, 214 మండలాల్లో ఓ మోస్తరు కరవు నెలకొందని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. పంట నష్టపోయిన రైతులకు అండగా నిలిచేందుకు రూ. 1,986.89 కోట్లతో కూడిన సహాయ ప్యాకేజీని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.
గణాంకాల ప్రకారం, జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 మధ్య రాష్ట్రంలో సాధారణంగా 740.6 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 615.5 మి.మీ. మాత్రమే నమోదైంది. అక్టోబర్ 15 నాటికి ఈ వర్షపాత లోటు 23 శాతానికి చేరింది. దీని ప్రభావంతో గత ఏడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం 13.22 లక్షల ఎకరాలు తగ్గి, 126.06 లక్షల ఎకరాలకు పరిమితమైంది. అత్యధికంగా నల్గొండ జిల్లాలో 3.58 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.
మరోవైపు, రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. 466 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గాను ప్రస్తుతం కేవలం 209.45 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. ఈ పరిస్థితుల్లో తాగునీటి అవసరాలకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, సాగునీటి విడుదలను పరిమితం చేయాలని అధికారులు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. కరవును అధికారికంగా ప్రకటించి, కేంద్రం నుంచి గరిష్ఠంగా సాయం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర నివేదికను సిద్ధం చేస్తోంది.

# ఢిల్లీ నిరసనల వెనుక పెద్ద స్కెచ్

ఢిల్లీలో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు (ఎ×=) వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనల వెనుక భారీ కుట్ర దాగి ఉందని తెలంగాణ బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఒకప్పుడు భారత్–బంగ్లాదేశ్ మధ్య దశాబ్దాలుగా నలిగిన సరిహద్దు ఎన్‌క్లేవ్‌ల సమస్యకు, ప్రస్తుత ఆందోళనలకు సంబంధం ఉందని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీని గద్దె దించాలనే ఏకైక లక్ష్యంతో విపక్షాలు, కొన్ని విదేశీ శక్తులు కలిసి పనిచేస్తున్నాయని ఆయన ఆరోపించారు.
ఈ అంశంపై ఆయన విడుదల చేసిన ఒక వీడియో ప్రస్తుతం విస్తృతంగా ప్రచారంలో ఉంది. 2015కు ముందు భారత్–బంగ్లాదేశ్ సరిహద్దు ప్రపంచంలోనే అత్యంత విచిత్రంగా ఉండేదని విశ్వేశ్వర్ రెడ్డి వివరించారు. "బంగ్లాదేశ్‌లో భారత్‌కు చెందిన 111 ఎన్‌క్లేవ్‌లు (చిన్న భూభాగాలు), భారత్‌లో బంగ్లాదేశ్‌కు చెందిన 51 ఎన్‌క్లేవ్‌లు ఉండేవి. ఈ ప్రాంతాల్లోని ప్రజలకు సరైన గుర్తింపు, పౌరసత్వం, ప్రభుత్వ సేవలు అందేవి కావు" అని ఆయన గుర్తుచేశారు. ప్రధాని మోదీ ప్రభుత్వం 2015లో చారిత్రక భూ సరిహద్దు ఒప్పందం ద్వారా ఈ సమస్యను పరిష్కరించిందని తెలిపారు.
అలాంటి అసంబద్ధమైన సరిహద్దుల వల్ల అక్రమ వలసలు పెరిగిపోయాయని, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కొన్ని పార్టీలు దీనిని ప్రోత్సహించాయని ఆయన ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, అసోంలో కాంగ్రెస్ పార్టీలు ఈ వలసలను ప్రోత్సహించాయని, దాని ప్రభావం హైదరాబాద్, ఢిల్లీ, బీహార్, ఒడిశా వరకు పాకిందని అన్నారు. ఇప్పుడు ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేస్తుంటే, అదే శక్తులు వ్యతిరేకిస్తున్నాయని విమర్శించారు.
"విపక్షాలకు నీట్, యూపీఐ, ఎన్నికల సంఘం వంటి అంశాలపై ఉమ్మడి అభిప్రాయం లేదు. వారి ఏకైక ఉమ్మడి లక్ష్యం ప్రధాని మోదీని ఓడించడం, అధికార మార్పు తీసుకురావడం" అని విశ్వేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఒక నేతకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక్కసారిగా లక్షలాది ఫాలోవర్లు పెరగడం నూటికి నూరు శాతం నకిలీ అని, డబ్బుతో సృష్టించినవేనని ఆయన ఆరోపించారు. దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేందుకు కరెన్సీ, చమురు వాణిజ్యం, ఐటీ, ఫార్మా రంగాలపై కూడా ఒత్తిడి తెస్తున్నారని, ప్రధాని మోదీ బలమైన నాయకత్వం వల్లే దేశం నిలదొక్కుకోగలుగుతోందని ఆయన అన్నారు.

# గురువు కోమటిరెడ్డి కోసం తలైనా ఇస్తా..
## కానీ నీళ్ల కోసం యుద్ధమే: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

- మొదటి పేజి తరువాయి

తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.
పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాల మధ్య నీటి కేటాయింపుల వివాదంపై ఆయన తన వైఖరిని స్పష్టం చేశారు. ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి ప్రాజెక్టుకు నీటిని తరలించే ప్రతిపాదనను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని అన్నారు. ముందుగా పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా పాలమూరుకు నీరందించాకే, దిండికి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.
గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులు కేవలం 60 శాతమే పూర్తయ్యాయని అనిరుధ్ రెడ్డి ఆరోపించారు. ఈ ప్రాజెక్టు పూర్తి కోసం జేఏసీ తలపెట్టిన జలదీక్షకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ప్రాజెక్టు సాధన కోసం పాలమూరు ఎమ్మెల్యేలంతా ఐక్యంగా పోరాడతామని చెప్పారు. అదే సమయంలో, ప్రతి అంశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అనవసరంగా లక్ష్యంగా చేసుకోవద్దని ఆయన హితవు పలికారు.

# తెలంగాణ నీళ్లను తరలించే కుట్ర..
## చంద్రబాబు ప్లాన్‌కు రేవంత్ సహకారం

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తూ తెలంగాణ సమాజానికి తీరని ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల్లో నీళ్లు లేకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఎల్‌నినో పేరుతో ప్రభుత్వం చేతులెత్తేస్తోందని మండిపడ్డారు. అత్యంత కీలకమైన సాగునీటి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే కారణమని ఆరోపించారు.
దేవాదుల ప్రాజెక్టులో 10 మోటార్లు అందుబాటులో ఉన్నప్పటికీ మూడు మాత్రమే నడిపిస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. తాము అభ్యంతరాలు వ్యక్తం చేసిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని అన్నారు. తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ వర్షపాతం నమోదైనా అక్కడ కరవు పరిస్థితులు, పంటల సాగుకు విరామం ప్రకటించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. తెలంగాణలో మాత్రం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. గోదావరి జలాలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. గోదావరి–కావేరి అనుసంధానం పేరుతో తెలంగాణ నీటిని తరలించే ప్రతిపాదనలకు రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారని విమర్శించారు.
గతంలో
గోదావరి–బనకచర్ల, గోదావరి–నల్లమలసాగర్ ప్రతిపాదనలు ముందుకు సాగలేదని, ఇప్పుడు గోదావరి–కావేరి అనుసంధానం పేరుతో కొత్త ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏపీ నేతలు ఇలాంటి ప్రతిపాదనలు చేయలేదని హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాతే ఏపీ పాలకులు కొత్త ప్రతిపాదనలను తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు.

# ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగం కుప్పకూలిపోయింది..
## కత్తులు, కర్రలతో మా వాళ్లను వెంటాడుతున్నారు

- మొదటి పేజి తరువాయి

ముఖ్యమంత్రి చంద్రబాబు తన పార్టీ కార్యకర్తలకు గూండా లైసెన్స్‌లు ఇచ్చి, వారికి అండగా పోలీసు యంత్రాంగాన్ని వాడుకుంటున్నారని జగన్ ఆరోపించారు. "రాజకీయ హింసావాదిగా తన చరిత్రను మరోసారి చాటుకుంటూ రాష్ట్రంలో జంగిల్‌రాజ్‌ను నడిపిస్తున్నారు. ప్రతిపక్ష అభ్యర్థులు కనీసం నామినేషన్లు కూడా వేయలేని దుస్థితి సృష్టించారు" అని జగన్ తన పోస్టులో పేర్కొన్నారు. వైసీపీ అభ్యర్థులను పోలీసుల సమక్షంలోనే కత్తులు, కర్రలతో వెంటాడుతున్నారని, నామినేషన్ పత్రాలను లాక్కుని చించివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్ధరాత్రి వేళ అభ్యర్థులను పోలీసులు అక్రమంగా ఎత్తుకెళుతున్నారని, ఇదే చంద్రబాబు మార్కు ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు. ఈ దాడుల్లో తమ పార్టీకి చెందిన ముగ్గురు ఎంపీలు కూడా బాధితులయ్యారని జగన్ తెలిపారు. అభ్యర్థులకు ప్రపోజర్లుగా వెళ్లిన ఎంపీలపై పోలీసుల సమక్షంలోనే దాడులు జరిగాయని, వారి చేతుల్లోంచి నామినేషన్ పత్రాలు లాక్కుని చించేశారని వివరించారు. "ఎంపీలకే రక్షణ లేని రాష్ట్రంలో సామాన్యుల పరిస్థితి ఏమిటి?" అని నిలదీశారు. కడప, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, రాయచోటి, పుంగనూరు, తిరుపతి, దర్శి, గురజాల సహా రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, ఇవి చంద్రబాబు పాలనలో ప్రజాస్వామ్యం ఎంతగా దిగజారిపోయిందో చూపుతున్నాయని అన్నారు. పులివెందులలో పోలీసులు జరిపిన కాల్పులు ప్రజాస్వామ్యంపై పేల్చిన తూటాలని, దీని వెనుక చంద్రబాబు కుట్ర ఉందని జగన్ ఆరోపించారు. నామినేషన్ వేయడానికి వచ్చిన వారిపై పోలీసులు ఎందుకు దాడి చేశారని, ఎందుకు కాల్పులు జరిపారని ప్రశ్నించారు. "నామినేషన్లు వేయనివ్వకుండా అడ్డుకోవడం ఎన్నికలా? ప్రతిపక్ష అభ్యర్థులను పోలీసులతో ఎత్తుకెళ్లడం ప్రజాస్వామ్యమా? ఎంపీలపైనే దాడులు చేయించడం రాజ్యాంగ పాలనా?" అని చంద్రబాబును ఉద్దేశించి జగన్ ప్రశ్నల వర్షం కురిపించారు.
రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసి ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న ఈ పరిస్థితుల్లో కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. "సూపర్ 6, సూపర్ 7ల మోసాలతో ప్రజలకు బాండ్లు ఇచ్చి మరీ మోసం చేసిన ఈ వెన్నుపోటు పార్టీ నుంచి ఇంతకన్నా ఏమి ఆశించగలం!" అని జగన్ తన పోస్టును ముగించారు.

# దాండియా సంబరాల్లో అపశృతి: విద్యార్థిని దుర్మరణం.. ఐదుగురి పరిస్థితి విషమం

- మొదటి పేజి తరువాయి

వేడుకల కోసం ఏర్పాటు చేసిన భారీ ఇనుప విద్యుత్ దీపాల స్టాండ్ ఒక్కసారిగా విద్యార్థులపై కుప్పకూలింది. ఈ ప్రమాదంలో వనపర్తి జిల్లాకు చెందిన బీటెక్ విద్యార్థిని సోనీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఆమెతో పాటు మరో 25 మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో మృతురాలి సోదరితో సహా ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన సిబ్బంది బాధితులను ఎల్‌బీ నగర్‌లోని కామినేని ఆసుపత్రికి, అలాగే అదభట్లలోని ఇతర ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. భారీ ఈదురుగాలుల కారణంగానే లైటింగ్ క్రేన్ అదుపుతప్పి కూలిపోయినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. స్టాండ్ కూలిన సమయంలో మంటలు
కూడా చెలరేగడంతో విద్యార్థులు ప్రాణభయంతో పరుగులు తీశారు. ఈ ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన విద్యార్థిని కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

# నేటి నుంచి వర్ష సూచన.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

- మొదటి పేజి తరువాయి

దీని ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. రేపు (అక్టోబర్ 18) హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం సహా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వర్షాల నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

# సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేకు షరతులతో బెయిల్

- మొదటి పేజి తరువాయి

విఘాతం కలిగించకూడదన్న షరతుకు ఆయన కట్టుబడి ఉండాల్సి ఉంటుంది.
ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో సీజేపీ తలపెట్టిన 'లెహ్రా దో తిరంగా' నిరసన యాత్రకు ముందు, శుక్రవారం ఢిల్లీ పోలీసులు ఆయనను ముందుజాగ్రత్త చర్యగా అదుపులోకి తీసుకున్నారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 126, 170 కింద ఆయనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ నిరసన యాత్రకు ముందు సుమారు 20 మందికి పైగా పోలీసులు దీప్కే నివాసానికి వెళ్లి ఆయనకు రెండు నోటీసులు అందజేశారు. కన్నాట్ ప్లేస్ పరిసరాల్లో ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించడం వల్ల తొక్కిసలాట జరిగే అవకాశం ఉందని, ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడే ప్రమాదం ఉన్నందున అక్కడ నిరసనలు చేపట్టరాదని ఒక నోటీసులో పేర్కొన్నారు. గతంలో సమర్పించిన బాండ్ షరతులను ఉల్లంఘిస్తున్నారని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ జారీ చేసిన రెండో నోటీసులో పోలీసులు హెచ్చరించారు.
అక్టోబర్ 10న కూడా దీప్కే, ఆయన సహచరులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను పోలీసులు ముందుజాగ్రత్తగా అదుపులోకి తీసుకున్నారు. ఏడాది పాటు శాంతియుతంగా
ఉంటామని హామీ ఇస్తూ, ఒక్కొక్కరు రూ. 50,000 పూచీకత్తు సమర్పించి వారు విడుదలయ్యారు. సీజేపీ శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌లో 'లెహ్రా దో తిరంగా' యాత్రను నిర్వహించాలని నిర్ణయించింది. అయితే, బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నందున, ఢిల్లీ పోలీసులు ఈ యాత్రకు అనుమతి నిరాకరించారు.

# కోల్‌కతా దుర్గాపూజలో పెను విషాదం.. తొక్కిసలాటలో 17 మంది భక్తులు మృతి..!



**హైదరాబాద్ పెన్ పవర్:** దసరా పండుగ వేళ వెస్ట్ బెంగాల్?లో తీవ్ర విషాద ఘటన చోటు చేసుకుంది. నార్త్ కోల్‌కతాలోని సర్బోజనిన్ చోర్‌బగాన్ దుర్గా మండపం దగ్గర తొక్కిసలాట జరిగి 17 మంది మరణించగా.. పలువురు భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. అధికారుల వివరాల ప్రకారం.. శనివారం (అక్టోబర్ 17) సాయంత్రం అమ్మవారి దర్శనం కోసం చోర్‌బగాన్ దుర్గా మండపానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సమయంలోనే భారీ వర్షం కురువడంతో మండపం బయట ఉన్న భక్తులు ఒక్కసారిగా లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో తొక్కిసలాట జరిగింది. ఈ క్రమంలోనే మండపంలోని కొంత భాగంగా కుప్పకూలి

-4లో

# పెన్ పవర్ తెలంగాణ రౌండప్

## హైదరాబాద్ లో క్రిప్టో కరెన్సీని క్యాష్ గా మారుస్తామని రూ.21 లక్షల మోసం..



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లో క్రిప్టో కరెన్సీ పేరుతో భారీ సైబర్ మోసం జరిగింది.క్రిప్టో కరెన్సీని క్యాష్ గా మారుస్తామంటూ బంజారాహిల్స్ కి చెందిన ఓ వ్యాపారిని రూ.21 లక్షలు మోసం చెసారు కేటుగాళ్లు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. బంజారాహిల్స్‌కు చెందిన వ్యాపారవేత్త షానవాజ్ దగ్గర పనిచేసే నాగ అమరేందర్ క్రిప్టో లావాదేవీలను పర్యవేక్షించేవాడు. ఈ నెల 11న రూ.25 లక్షల నగదుతో అమరేందర్‌ను నాంపల్లికి రప్పించి, బజార్‌ఘాట్‌లోని హిమాలయన్ హోటల్ సమీపంలో లావాదేవీల కోసం సమావేశమయ్యారు. ముందస్తు ప్రణాళికతో నిందితులు బాధితుల కళ్లలో పెప్పర్ స్ప్రే చల్లి దాడి చేసి నగదు బ్యాగుతో పరారయ్యారు. పెనుగులాటలో రూ.4 లక్షలు కిందపడిపోవడంతో మిగిలిన నగదును ఎత్తుకెళ్లారు.ఈ ఘటనలో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.11.50 లక్షల నగదు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి వెల్లడించారు. బషీర్‌బాగ్‌లోని డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కేసు వివరాలు తెలిపారు.ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టి ఈ నెల 17న సయ్యద్ ఐజాజ్, సయ్యద్ జకరియా అహ్మద్, సుమైర్ ఖాన్, విజేష్ కుమార్, ఫరాజ్ హుస్సేన్‌లను అరెస్టు చేశాయి. వీరిలో ఇద్దరు రౌడీషీటర్లు ఉన్నారు. ప్రధాన నిందితుడు హమీద్ అలియాస్ ఎస్‌డీ భాయ్, ఫైసల్, మరో మహిళా అనుమానితురాలి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# బయట ఆర్భాటం.. లోపల అనారోగ్యం



- రోగాలు వండివారుస్తున్న కొన్ని హోటళ్లు..!
- కల్తీ, కుళ్లిన పదార్థాలకు రసాయనాలతో రంగు, రుచి
- సిబ్బంది లేక కొరవడిన తనిఖీలు



**హైదరాబాద్ పెన్ పవర్:** మెరిసే లైట్లు, ఆకర్షణీయమైన సీటింగ్‌తో వినియోగదారులకు ఆహ్వానం పలుకుతున్న కొన్ని హోటళ్లు.. లోపల వంటగదిలో మాత్రం భయంకర వాతావరణం మధ్య ఆహారాన్ని తయారు చేస్తున్నాయి. కల్తీ, కుళ్లిన పదార్థాలను హానికర రసాయనాలతో వండివారుస్తూ ఆహార ప్రియుల ఆరోగ్యంతో మృత్యుక్రీడ ఆడుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 1,72,337 మంది హోటళ్లు, ఆహార సంబంధ వ్యాపారాలను నిర్వహిస్తున్నారు. నిర్మల్ నుంచి హైదరాబాద్ వరకు జాతీయ రహదారి 44పైనే 350కి పైగా దాబాలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్-నల్గొండ-సూర్యాపేట మీదుగా విజయవాడ వెళ్లే జాతీయ రహదారి 65పైనా పెద్దసంఖ్యలో హోటళ్లు నడుస్తున్నాయి. వీటిల్లో చాలాచోట్ల పరిశుభ్రత కొరవడింది. ఇటీవల అధికారులు పలు హోటళ్లలో చేపట్టిన తనిఖీల్లో ఆహారంపై ఈగలు, బొద్దింకలు, నిల్వ ఉంచిన మాంసం, నిషేధిత రసాయనాలు బయటపడటం చూసి.. వాటిలో తరచూ తినేవారు అవాక్కవుతున్నారు.

-4లో



# ఎమ్మెల్సీ స్థానాల్లో భాజపా గెలవాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** త్వరలో ఎన్నికలు జరగనున్న రెండు ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకునేందుకు భాజపా శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. గతంలో నల్గొండ-వరంగల్-ఖమ్మం, హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ స్థానాలను భాజపా గెలుచుకున్న చరిత్ర ఉందని, ఇప్పుడు కూడా అదే స్ఫూర్తితో గెలుచుకోవాలన్నారు. శనివారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో ఓటింగ్ నమోదుపై సమావేశం ఏర్పాటు చేశారు. భాజపా శాసనమండలి పక్ష నేత ఏవీఎన్ రెడ్డి, ఎమ్మెల్సీలు మల్క కొమరయ్యతోపాటు మరికొందరు కీలక నేతలతో కలిసి రామచందర్‌రావు మాట్లాడారు. 'ఎమ్మెల్సీ అభ్యర్థులను అధిష్ఠానం త్వరలో నిర్ణయిస్తుంది. అభ్యర్థులు ఎవరైనా కార్యకర్తలు వారిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉంది. భారాస, కాంగ్రెస్‌ల పాలనతో విసిగిపోయిన ప్రజలకు భాజపానే వారికి ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. ఈ రెండు ఎమ్మెల్సీల స్థానాలను గెలిస్తే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావడం మరింత సులువవుతుందన్నారు. ఎక్కువ మంది పట్టభద్రులు ఓట్లు నమోదు చేసుకునేలా పార్టీ శ్రేణులు పనిచేయాలని కోరారు.

# పర్యావరణ హితమే బతుకమ్మ సందేశం

## రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్‌శుక్లా
## కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు

**తెలంగాణ మహిళలు తొమ్మిది రోజులపాటు నిర్వహించే బతుకమ్మ వేడుకలు... ప్రజలకు పర్యావరణాన్ని కాపాడుకోవాలనే సందేశాన్ని ఇస్తాయని గవర్నర్ శివప్రతాప్ శుక్లా గుర్తుచేశారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని, ఇది మనందరి బాధ్యతన్నారు. శనివారం హైదరాబాద్‌లోని అంబర్‌పేట మున్సిపల్ మైదానంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ వేడుకలకు.. తన సతీమణితో కలిసి ఆయన హాజరయ్యారు.**





**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "ప్రకృతితో మమేకమయ్యే బతుకమ్మ ఉత్సవాలు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును పొందాయి. దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ రాజరాజ్వేరస్వామి ఆలయంతోనూ ఈ వేడుకలకు అవినాభావ సంబంధం ఉంది. తీరొక్క పూలతో చేసే బతుకమ్మలు... ప్రకృతి తల్లి ప్రేమకు, తెలంగాణ సంస్కృతికి, మహిళాశక్తికి, వారి ఐక్యతకు ప్రతిరూపాలు" అని వివరించారు.కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... "పేద, ధనిక తారతమ్యాలు లేకుండా అంతా ఒకచోట చేరి నిర్వహించే పూల పండగే బతుకమ్మ. బతుకమ్మ పాటలతో అనాదిగా మహిళలంతా సామాజిక దురాచారాలను దూరం చేయడానికి ప్రయత్నిస్తున్నారు" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు డా.కె.లక్ష్మణ్, మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, భాజపా నేతలు గౌతంరావు,

-4లో

# బయట ఆర్భాటం.. లోపల అనారోగ్యం

**ఇటీవలి ఘటనలు**

సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లిలోని మండేపల్లి, అంకుసాపూర్‌లో ఆగస్టులో పానీపూరి తిని 24 మంది అస్వస్థతకు గురయ్యారు. తయారీదారులపై కేసు నమోదైంది. సిరిసిల్లలో ఓ మిఠాయి దుకాణం మిక్చర్‌లో చనిపోయిన బల్లి రావడంతో యజమానికి రూ.లక్ష జరిమానా విధించారు.

చికెన్ కూరలో బల్లి కనిపించడంతో ఖమ్మంలోని ఓ దాబాను అధికారులు సీజ్ చేసి, రూ.లక్ష జరిమానా విధించారు.

కామారెడ్డిలోని ఓ హోటల్‌లో కుళ్లిన మేక, కోడి మాంసాన్ని అధికారులు గుర్తించారు.

జాతీయ రహదారి-44పై కామారెడ్డి జిల్లాలోని భిక్కనూరు, సదాశివనగర్ దగ్గరలోని దాబాల్లో గడువు ముగిసిన సరకులు, అపరిశుభ్రతను అధికారులు గుర్తించారు. వాటి లైసెన్సుల రద్దుకు సిఫార్సు చేశారు.

మెదక్ జిల్లాలోని రామాయంపేట దాబాలో కుళ్లిన మాంసంతో చేసిన వంటలను ఈ నెల 7న గుర్తించి చర్యలు తీసుకున్నారు.

నల్గొండలోని ఓ హోటల్‌లో ఆహార నాణ్యతను తనిఖీ చేస్తున్న అధికారులు

**వంటలు రసాయనాలమయం**

కంటికి ఇంపుగా, నాలుకకు రుచికరంగా మార్చడం కోసం ప్రజారోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. బిర్యానీలకు మంచి రంగు తీసుకురావడానికి విషపూరిత సింథటిక్ రంగులను వాడుతున్నారు. వీటివల్ల క్యాన్సర్ వచ్చే ముప్పు ఉంది.

చైనీస్ ఫుడ్, సూప్‌లు, బిర్యానీల రుచి పెంచేందుకు కలుపుతున్న అజినోమోటో నరాల బలహీనత, తలనొప్పికి దారితీస్తోంది.

నాణ్యత లేని నూనెలు వాడటంతోపాటు వాటిని మార్చకుండా పదేపదే మరిగిస్తున్నారు. దీనివల్ల క్యాన్సర్ కారకాలు ఉత్పన్నమవుతున్నాయి.

మాంసాన్ని రోజుల తరబడి నిల్వ చేయడానికి హానికర ప్రిజర్వేటివ్‌లు, కల్తీ అల్లం-వెల్లుల్లి పేస్ట్, పన్నీర్, ఉప్పుకారాలు విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు.

చాలామంది హోటళ్ల నిర్వాహకులు టర్నోవర్ ఆధారంగా ఫుడ్ సేఫ్టీ లైసెన్స్, పురపాలికలు, నగరపాలికల నుంచి ట్రేడ్ లైసెన్సును తీసుకోవడం లేదు.

**జిల్లాలకు విస్తరించని నిఘా వ్యవస్థ**

'గత రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 11 వేల తనిఖీలు నిర్వహించాం. నిజామాబాద్, హనుమకొండ, మహబూబ్‌నగర్‌లో ఆహార పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తాం' అని ప్రభుత్వం 8 నెలల క్రితం ప్రకటించింది. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది నియామకాలు చేపట్టి హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు ముమ్మరం చేస్తామంది. ఇప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. గత ఆగస్టులో ఆహారభద్రత, ఔషధ నియంత్రణ విభాగాలను కలిపి టీజీ సేఫ్(తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్) వ్యవస్థను ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో 299 హోటళ్లలో తనిఖీలు చేసి 64 లైసెన్సులను రద్దు చేశారు. ఈ నిఘా వ్యవస్థ ఇంకా జిల్లాలకు విస్తరించలేదు.

**అధికారుల కొరత**

ఆహార భద్రత చట్టాల ప్రకారం కల్తీ ఆహారం విక్రయించినట్లు రుజువైతే రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు జరిమానా, 8 నెలల జైలు శిక్ష విధిస్తారు. ఆహారం తిని మరణాలు సంభవిస్తే జీవిత ఖైదు విధించే నిబంధనలున్నాయి. క్షేత్రస్థాయిలో మాత్రం నామమాత్ర చర్యలే దిక్కవుతున్నాయి. సేకరించిన ఆహార నమూనాలను హైదరాబాద్‌లోని నాచారంలో ఉన్న స్టేట్ ఫుడ్ ల్యాబ్‌కు పంపిస్తున్నారు. పరీక్ష నివేదిక రావడానికి చాలా సమయం పడుతోంది. ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు కలిపి ఆహార నమూనా సేకరణ వాహనం ఒక్కటే ఉంది. చాలా జిల్లాల్లో ఒక్కరే గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఉండగా.. కొన్ని జిల్లాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నమూనాల సేకరణకు, కార్యాలయంలో సిబ్బందే లేరు.

# నీటి ఎద్దడి సమస్య తీవ్రతరం

**హైదరాబాద్ అక్టోబరు 17 పెన్ పవర్:**
తెలంగాణ రాష్ట్రంలో నీటి ఎద్దడి సమస్య తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో, ప్రభుత్వం ఈ సమస్యను ఎదుర్కొనేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాభావం ఏర్పడటంతో, రాష్ట్రంలో 11.18 లక్షల ఎకరాల్లో పంటలు నష్టపోతున్నాయని అంచనా వేయబడింది. ఈ క్రమంలో, వివిధ శాఖల అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు అందించారు. గురువారం జరిగిన సమావేశంలో, కరవు పరిస్థితులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రభుత్వానికి పలు ప్రత్యామ్నాయాలను ప్రతిపాదించారు. గత సంవత్సరం 69.19 లక్షల ఎకరాల్లో సాగు చేసిన వరి, ఈ సంవత్సరం 57.04 లక్షల ఎకరాలకు తగ్గింది. నీటి ఎద్దడి కారణంగా పత్తి, వరి పంటలపై తీవ్ర ప్రభావం పడింది. నల్గొండ, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి జిల్లాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ముఖ్యంగా 8.93 లక్షల ఎకరాల్లో పత్తి, 1.20 లక్షల ఎకరాల్లో వరి పంటలపై తీవ్ర ఒత్తిడి ఉంది. ఈ పరిస్థితులను అధిగమించేందుకు, ప్రభుత్వం రూ.1,986.89 కోట్ల నిధులను అవసరమని అధికారులు ప్రతిపాదించారు. పశుసంవర్ధక శాఖ నుంచి రూ.86.39 కోట్లు అవసరమని పేర్కొన్నారు.కృష్ణా బేసిన్ ప్రాజెక్టుల్లో ప్రస్తుతం 270 టీఎంసీల నిల్వ సామర్థ్యానికి, 78.5 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఇది 71 శాతం లోటు సూచిస్తుంది. గోదావరి నదీ పరివాహక ప్రాజెక్టుల్లో 145.7 టీఎంసీలకు 34 శాతం లోటుతో 96.0 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ముఖ్యంగా సింగూరు జలాశయంలో ప్రస్తుతం కేవలం 3.924 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఇది డిసెంబర్ వరకు సరిపోతుందని అంచనా. రాష్ట్రంలోని చెరువుల్లో 40 శాతం వాటిలో నాలుగో వంతు కంటే తక్కువ నీరు ఉంది. అందువల్ల, అందుబాటులో ఉన్న నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాలకు కేటాయించాలని అధికారులు ప్రతిపాదించారు. మిగులు ఉన్న చోట పంటలకు తడి సాగునీరు అందించాలని సూచించారు. సింగూరు, ఎస్సారెస్పీ, కాళేశ్వరం, మిడ్ మానేరు, జూరాల, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలను వాయిదా వేయాలని సూచించారు. డిండి, ఎస్సారెస్పీ ప్రాజెక్టుల పరిధిలోని ఎత్తిపోతల ద్వారా నీటి నిల్వను పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.రాష్ట్రంలో 34 జలాశయాల ద్వారా 24,001 గ్రామీణ ఆవాసాలకు, 145 పట్టణ స్థానిక సంస్థలకు నీటిని సరఫరా చేస్తున్నారు. సింగూరు జలాశయంలో నీటి నిల్వ 3.92 టీఎంసీలకు పడిపోవడంతో అదనపు పంపులను ఏర్పాటు చేసేందుకు రూ.84.14 కోట్ల వ్యయంతో ఓ ప్రత్యామ్నాయ ప్రణాళికను సిద్ధం చేశారు. ఏడాది పొడవునా తాగునీటి అవసరాలను తీర్చడానికి అన్ని జలాశయాల్లో తగినంత నీటిని నిల్వ ఉంచాలని, గ్రామాల్లోని చెరువుల్లో పశువుల కోసం తగినంత నీరు ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు. అత్యవసర నీటి సరఫరా అవసరాల కోసం ప్రతి జిల్లా కలెక్టర్ దగ్గర రూ.1 కోటి నిధిని అందుబాటులో ఉంచాలని ప్రతిపాదించారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ పరిధిలో 14.5 లక్షల నల్లా కనెక్షన్ల ద్వారా 1.30 కోట్ల మందికి తాగునీరు అందుతోంది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి సింగూరు, మంజీరా జలాశయాల పరిధిలో నీటి సరఫరా కొరత ఏర్పడే అవకాశం ఉందని అంచనా. దీనిని దృష్టిలో ఉంచుకొని రూ.57.55 కోట్ల వ్యయంతో 9 ప్రత్యామ్నాయ ప్రణాళికల ఆమోదానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు.

**5 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం!**

తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఇప్పటికే వర్షాభావం మరియు నీటి కొరత కారణంగా పంటల కాపాడుకోవడంలో కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో, తెగుళ్ల సమస్య కూడా రైతులకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో సుమారు 5 లక్షల ఎకరాల్లో పంటలు వివిధ రకాల తెగుళ్ల బారిన పడుతున్నాయి. వ్యవసాయ శాఖ ఈ విషయాన్ని గుర్తించింది. రైతులు ఈ సమస్య వల్ల మరింత నష్టం వాటిల్లుతుందేమోనని తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం చాలా జిల్లాల్లో వరి పంట అంకుర దశకు చేరుకుంది. కొన్ని జిల్లాల్లో కాత మొదలవుతోంది. వర్షాలు లేకపోవడంతో, వరి పొలాల్లో ఆకు ఎండు తెగులు, కాండం తొలిచే పురుగులు, ఆకు ముడత తెగుళ్లు మొదలయ్యాయి. వరంగల్, కరీంనగర్, జగిత్యాల, ములుగు, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, నిర్మల్, కొత్తగూడెం, సూర్యాపేట, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో సుమారు 2.5 లక్షల ఎకరాల్లో ఈ తెగుళ్ల సమస్య తీవ్రంగా ఉంది. రైతులు తమ పంటలను కాపాడుకోవడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నారు, కానీ ఫలితం లేకుండా పోతున్నాయి. ప్రభాకర్ రావు అనే రైతు, వరంగల్ జిల్లాలో 4 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాడు. అతను చెప్పినట్లుగా, విపరీతమైన ఎండలు మరియు వర్షాభావం కారణంగా పంట తెగుళ్ల బారిన పడింది. అరికట్టడానికి రూ.25 వేలతో పురుగు మందులు పిచికారీ చేశాడు, కానీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఈ పరిస్థితి రైతులకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.ఇంకా, పత్తి పంట ప్రస్తుతం కాయలు పగిలి దూది బయటకు వచ్చే దశలో ఉంది. ఈ సమయంలో, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, మహబూబ్‌నగర్, మెదక్, ఖమ్మం జిల్లాల్లో సుమారు లక్ష ఎకరాల్లో గులాబీ రంగు పురుగు, తామర పురుగులు, పచ్చ పురుగుల దాడి కనిపిస్తోంది. ఈ తెగుళ్లు మొక్కల ఆకులు, కాండం, వేర్లు కుళ్ళిపోయి మొక్కలు వాడిపోతున్నాయి. కాయల్లో పత్తి నాణ్యత మరియు దిగుబడి కూడా తగ్గుతోంది. శంకర్ అనే రైతు, మహబూబాబాద్ జిల్లాలో రెండు ఎకరాల్లో పత్తిని సాగుచేస్తున్నాడు. వర్షాలు లేకపోవడంతో, బావి నీళ్లతోనే పంటను బతికిస్తున్నాడు. కానీ ఇటీవల పంటకు గులాబీరంగు తెగులు వస్తున్నాయి. దీనివల్ల కాయ నుంచి పత్తి రావటం లేదు. దీంతో దిగుబడి రాదేమోనని భయంగా ఉంది. మొక్కజొన్న పంట కూడా ప్రస్తుతం పాల దశ దాటి గింజ గట్టిపడే దశకు చేరుకుంది. ఈ సమయంలోనే వర్షాలు లేకపోవటంతో కాండం కుళ్లు తెగులు, ఆకుమచ్చ తెగులు, కుంకుమ తెగుళ్లు వస్తున్నాయి.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5.30 లక్షల ఎకరాల్లో కంది పంటకు పురుగుల బెడద ఏర్పడింది. ముఖ్యంగా కాయ తొలిచే పురుగు సోకింది. సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో సుమారు 72,000 ఎకరాల్లో ఈ పురుగు కాయలను పాడు చేస్తోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో సుమారు 12,000 ఎకరాల వేరుశనగ పంటకు పొగాకు లద్దె పురుగు సోకింది. మిరప, టమోటా, వంకాయ బంతి పూల పంటలకు సంబంధించి మరో 22,000 ఎకరాల్లో మొక్క కుళ్లు తెగులు తీవ్ర సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో, పంట నష్టాన్ని నివారించేందుకు రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. వారు క్షేత్రస్థాయిలో పర్యటించి, రైతులకు నివారణ నియంత్రణ చర్యల గురించి వివరించాలని సూచించారు.

# దసరా పండుగ సందర్భంగా ఓపీ సేవల

**వరంగల్,అక్టోబరు 17 పెన్ పవర్:**
ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తోంది. ఈ క్రమంలో వరంగల్లోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణాన్ని పూర్తి చేసి, దసరా పండుగ సందర్భంగా ఓపీ సేవలను ప్రారంభించడానికి సిద్ధమవుతోంది. వరంగల్లోని ఎంజీఎం ఆస్పత్రి భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం త్వరగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవనంలో వైద్య విభాగాలను తరలించి, సేవలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఇన్ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. 24 అంతస్తులతో నిర్మితమవుతున్న ఈ ఆస్పత్రిలో ముందుగా ఓపీ సేవలను ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ ఏడాది దసరా నుంచి సేవలు అందుబాటులోకి రానున్నాయి. నవంబర్ చివరి నాటికి లేదా డిసెంబర్లో పూర్తిగా వైద్య సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. గురువారం, మంత్రి సీతక్క మరియు పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి నూతన ఆస్పత్రి భవనాన్ని పరిశీలించారు. ఓపీ సేవలను ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు మరియు జాగ్రత్తలపై ఆమె కొన్ని సూచనలు చేశారు.మాజీ బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం జీవోలు ఇచ్చి నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేసిందని మంత్రి సీతక్క ఆరోపించారు. నిర్మాణాలను మొండి గోడల దశలో విడిచిపెట్టారని ఆమె పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని, ఆటంకాలు లేకుండా నిర్మాణాన్ని పూర్తి చేశామని ఆమె వెల్లడించారు. మంత్రుల వెంట ఎంపీ బలరాం నాయక్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, కుడా ఛైర్మన్ సుధారాణి, కలెక్టర్లు సత్య శారద, చాహత్‌బాజ్‌పాయ్ తదితరులు ఉన్నారు.వరంగల్ సెంట్రల్ జైలు స్థలంలో 56 ఎకరాల విస్తీర్ణంలో రూ.1,150 కోట్ల వ్యయంతో 2021లో ఈ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఈ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ ఆస్పత్రిలో దశల వారీగా మొత్తం 2,208 పడకల సామర్థ్యంతో వైద్య సేవలు అందించనున్నారు. అన్ని విభాగాలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలతో పాటు ఛత్తీస్గఢ్, మహారాష్ట్రకు చెందిన పేద ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందించబడతాయి. ఈ సూపర్ స్పెషాలిటీ భవనంలోని 9 అంతస్తులను వైద్య సేవలకు వినియోగించేందుకు ప్రణాళిక వేసారు. అయితే ప్రస్తుతం కేవలం ఆరు అంతస్తులలోనే పనులు పూర్తయ్యాయి. మిగతా అంతస్తుల్లో సివిల్ పనులు మిగిలి ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎంజీఎం ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరడంతో తరచూ ఏదో ఒక ఘటన జరుగుతోంది. ఈ కారణంగా, త్వరగా ఇక్కడి వైద్య సేవలను కొత్త భవనంలోకి మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. దసరా రోజున రెండు అంతస్తుల్లో ముందుగా 22 విభాగాలకు సంబంధించిన ఓపీ సేవలను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పూర్తిగా అందుబాటులోకి వస్తే, మొత్తం 37 విభాగాలకు సంబంధించిన వైద్య సేవలను అందించనున్నారు. సంతాన లేమి, అవయవ దానం, అవయవ మార్పిడి వంటి సమస్యలకు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

## పర్యావరణ హితమే బతుకమ్మ సందేశం

-3 పేజి తరువాయి

ప్రేంసింగ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు. అంబర్‌పేట మున్సిపల్ మైదానంలో 72 అడుగుల ఎత్తుతో రూపొందించిన బతుకమ్మకు యూనివర్సల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటుదక్కింది. కిషన్‌రెడ్డి సతీమణి కావ్య, దేవి కలెక్టివ్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్‌పర్సన్ నీలిమ సంబంధిత ధ్రువపత్రాన్ని అందుకున్నారు.

## కోల్‌కతా దుర్గాపూజలో పెను విషాదం.. తొక్కిసలాటలో 17 మంది భక్తులు మృతి..!

-3 పేజి తరువాయి

భక్తులపై పడింది. తొక్కిసలాట, మండపం కుప్పకూలడంతో కనీసం 17 మంది మరణించగా.. 25 నుంచి 35 మందికి పైగా భక్తులు గాయపడ్డట్లు సమాచారం. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కోల్ కత్తా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్?కు తరలించారు. ప్రస్తుతం అక్కడ క్షతగాత్రులకు అత్యవసర చికిత్స అందిస్తున్నారు.సమాచారం అందుకున్న పోలీసులు, డిజాస్టర్ మేనేజ్మెంట్ బృందాలు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. భద్రతా కారణాల దృష్ట్యా చోర్‌బగాన్ పండాల్‌ను తాత్కాలికంగా మూసివేసి, భక్తుల సందర్శనను నిలిపివేశారు.ఈ ఘటనపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఆరోగ్య శాఖ మంత్రి శరద్వత్ ముఖర్జీ, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఆసుపత్రికి వెళ్లిన ఆయన బాధితులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## సెక్షన్ 22-A ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు సాఫ్ట్‌వేర్ మోక్షం!

**హైదరాబాద్ అక్టోబరు 17 పెన్ పవర్:** తెలంగాణలో సరైన అనుమతులు, అప్రూవ్డ్ లేఅవుట్లు ఉన్నప్పటికీ, సెక్షన్ 22-ఏ చట్టపరమైన ఆంక్షల కారణంగా సంవత్సరాలుగా రిజిస్ట్రేషన్లు కాకుండా ఆగిపోయిన వేలాది ఆస్తుల యజమానులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరట కల్పించనుంది. చట్టబద్ధమైన ప్లాట్లు ఉన్నప్పటికీ సాంకేతిక, రికార్డు లోపాల వల్ల క్రయవిక్రయాలు జరగక ఇబ్బంది పడుతున్న సామాన్యుల కష్టాలను తొలగించేందుకు రెవెన్యూ శాఖ రంగంలోకి దిగింది. ఈ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపే దిశగా రిజిస్ట్రేషన్ శాఖ ప్రత్యేకంగా ఒక సరికొత్త సాఫ్ట్‌వేర్ మాడ్యూల్‌ను సిద్ధం చేస్తోంది.గతంలో ప్రభుత్వ భూములు, వివాదాస్పద స్థలాలు లేదా ఇనామ్ భూముల ముసుగులో చాలా వరకు చట్టబద్ధమైన లేఅవుట్లు కూడా సెక్షన్ 22-ఏ జాబితాలో చేరిపోయాయి. దీనివల్ల పక్కా ప్లాట్లు కొనుగోలు చేసిన మధ్యతరగతి ప్రజలు, చిన్న రియల్టర్లు తమ ఆస్తులను అమ్ముకోలేక, బ్యాంకుల నుంచి గృహ రుణాలు పొందలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారుల చుట్టూ తిరిగినా పరిష్కారం దొరకని ఈ దీర్ఘకాలిక సమస్యను గుర్తించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, అర్హమైన ఆస్తులను ఆ నిషేధిత జాబితా నుంచి తొలగించడానికి పకడ్బందీ విధివిధానాలను రూపొందించింది.ఈ సమస్యను పూర్తిగా పరిష్కరించే ఉద్దేశంతోనే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ ఒక అత్యాధునిక సాఫ్ట్‌వేర్ మాడ్యూల్‌ను అభివృద్ధి చేస్తోంది. దీని ద్వారా ఎంపిక చేసిన ఆస్తులకు సంబంధించిన అసలైన డాక్యుమెంట్లు, ఆమోదించిన లేఅవుట్ పత్రాలు, రెవెన్యూ రికార్డులను ఈ కొత్త పోర్టల్‌లో డిజిటలైజ్ చేసి పరిశీలిస్తారు. అన్ని అర్హతలు సక్రమంగా ఉన్నట్లు తేలితే, ఆటోమేటిక్‌గా ఆ ప్లాట్లను 22-ఏ నిషిద్ధ జాబితా నుంచి తొలగించేలా ఈ సాఫ్ట్‌వేర్‌ను డిజైన్ చేశారు. దీనివల్ల అవినీతికి ఆస్కారం లేకుండా, మానవ ప్రమేయం లేకుండా పారదర్శకంగా క్లియరెన్స్ లభిస్తుంది.ఈ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ మాడ్యూల్ అందుబాటులోకి వస్తే, రాష్ట్రవ్యాప్తంగా చిక్కుల్లో పడి ఉన్న వేల ఎకరాల ఆస్తుల క్రయవిక్రయాలకు మార్గం సుగమమవుతుంది. రియల్ ఎస్టేట్ రంగంలో ఊచకోత కోస్తున్న నిరుత్సాహం తొలగిపోయి, లావాదేవీలు మళ్లీ పుంజుకుంటాయని నిపుణులు భావిస్తున్నారు. తద్వారా వేలాది మంది గృహ కొనుగోలుదారులకు చట్టబద్ధమైన యాజమాన్య హక్కులు దక్కడంతో పాటు ప్రభుత్వానికి కూడా రిజిస్ట్రేషన్ల రూపంలో భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

## దసరాకు హైడ్రా పోలీస్ స్టేషన్ -

**హైదరాబాద్ అక్టోబరు 17 పెన్ పవర్:**
హైడ్రా పరిధిలోని సరస్సులు, చెరువులు, రోడ్లు, పార్కులు, లేఅవుట్లలోని ఖాళీ స్థలాలను ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి హైడ్రా పోలీస్ స్టేషన్ సిద్ధమవుతోంది. ఇటీవల అమల్లోకి వచ్చిన క్యూర్ చట్టంతో, హైడ్రా కోసం ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడం, అధికారాలపై స్పష్టత ఇవ్వడం జరిగింది. అయితే, ఈ చట్టాన్ని ఎలా అమలు చేయాలో సంబంధించి మార్గదర్శకాలు త్వరలో విడుదల కానున్నాయి. దసరా పండుగకు ముందు లేదా పండుగ తర్వాత ఈ కార్యకలాపాలు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో, హైడ్రా, మూడు మున్సిపల్ కార్పొరేషన్ల అధికారుల కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల్లో హైడ్రా పరిధి, క్యూర్ చట్టం కల్పించిన అధికారాలు, వాటిని ఎలా అమలు చేయాలో వివరిస్తారు. సెక్షన్ 241(3) ప్రకారం, క్యూర్ చట్టంలోని 28వ అధ్యాయం, సెక్షన్ 241(3) హైడ్రా స్పష్టం చేస్తోంది. ఈ సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చు. ప్రభుత్వ ఉద్యోగి విధులను అడ్డుకోవడం, ఉద్యోగిపై దాడి చేయడం, జలాశయాలను కలుషితం చేయడం వంటి చర్యలకు ఈ సెక్షన్లు వర్తిస్తాయి. అయితే, ప్రజలు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా లేదా కమిషనర్ సిఫార్సుతో కేసులు నమోదు చేయాలా అనే విషయాన్ని ప్రభుత్వం స్పష్టం చేయాల్సి ఉంది. ఈ కేసులపై నాంపల్లిలోని తొమ్మిది మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో విచారణ జరగనుంది. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు ఇచ్చే ఫిర్యాదుల ఆధారంగా హైడ్రా చర్యలు తీసుకుంటుందని కమిషనర్ ఏవీ.రంగనాథ్ తెలిపారు. కప్రా చెరువు పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయని, రూ.35 కోట్ల ఖర్చుతో చేపట్టిన ఈ పనులు 450 రకాల వలస పక్షులకు ఆవాసంగా మారాయని హైడ్రా బుధవారం మీడియాకు వెల్లడించింది. హైడ్రా ఇప్పటికే వందల ఎకరాల భూములను, పలు చెరువులు, పార్కులు, నాలాలు అన్యాక్రాంతం కాకుండా సంరక్షించిందని కమిషనర్ రంగనాథ్ వివరించారు. వేర్వేరు పోలీస్ స్టేషన్లో 50కి పైగా కేసులు విచారణలో ఉన్నాయని ఆయన తెలిపారు. హైడ్రా పోలీస్ స్టేషన్ అందుబాటులోకి వస్తే, ఆయా కేసులన్నీ హైడ్రాకు బదిలీ అవుతాయని గతంలో వివరించారు. కొత్త కేసులు వేగంగా నమోదవుతాయని రంగనాథ్ పేర్కొన్నారు. సమస్య మూలాల్లోకి వెళ్లి చెరువుల ఆక్రమణలను అడ్డుకోవడం, నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ ఆస్తులను కొల్లగొడుతున్న అధికారులను, సిబ్బందిని, ఆక్రమణదారులను పక్కా ఆధారాలతో జైలుకు పంపడమే లక్ష్యమని రంగనాథ్ తెలిపారు.

## ముగ్గుల పోటీలతో పండుగ శోభ



హైదరాబాద్ పెన్ పవర్:

భద్రాచలం పట్టణంలోని భగవాన్ దాస్ కాలనీ, గోల్డ్ స్మిత్ కాలనీ, సీతారామ్ నగర్, డ్రైవర్స్ కాలనీల శ్రీ దేవి శరన్నవరాత్రుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారి శ్రీ మహాలక్ష్మీ దేవి అలంకారం సందర్భంగా ముగ్గుల పోటీలు కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణ దొర, ఫారెస్ట్ రేంజ్ అధికారి జశ్వంత్ పాల్గొన్నారు. ఈ పోటీల్లో సుమారు 100 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొని, వివిధ రంగులతో అందమైన ముగ్గులు వేసి తమ ప్రతిభను చాటుకున్నారు. పోటీ ప్రాంగణం రంగురంగుల ముగ్గులతో పండుగ శోభను సంతరించుకుంది. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి వరుసగా మొదటి నుంచి ఎనిమిదో బహుమతి వరకు రాజరాజేశ్వరి, శకుంతల, సౌజన్య, సౌమ్య, హితశ్రీ, త్రివేణి, జ్యోత్స్న, నేహా బహుమతులు అందుకున్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు ప్రోత్సాహకంగా ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పూనెం కృష్ణ దొర మాట్లాడుతూ, ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు మహిళల్లో సృజనాత్మకతను ప్రోత్సహించడంతో పాటు కాలనీవాసుల మధ్య ఐక్యత, ఆత్మీయతను పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుంజా ధర్మా, భూక్యా రంగా, వార్డు మెంబర్ సున్నం భూలక్ష్మి, బండారిగూడెం దేవుడమ్మ, బండి రాంప్రసాద్, రామకృష్ణ, హరిబాబు, కుంజా సంతోష్, భూక్యా సాయి కౌశిక్, షేక్ సిరాజ్, ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

## దాబా హోటల్ నుండి కలుషిత నీరు...

- దెబ్బతింటున్న పంట పొలాలు...
- ఆందోళన వ్యక్తం చేసిన రైతులు...



హైదరాబాద్ పెన్ పవర్: పెబ్బేరు మండల కేంద్రంలోజాతీయ రహదారిపై ఉన్న దాబా (శ్రీ కృష్ణ దేలికేఫ్)హోటల్ నుండి కలుషిత నీరు, కెమికల్స్ మరియు వ్యర్థాలు పక్కనే ఉన్న వ్యవసాయ పొలాల్లోకి విడుదల కావడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కలుషితమైన నీరు కాలువలోకి వెళ్లి పొలాల్లోకి వెళ్లడంతో మురుగునీరు నిరంతరం పొలాల్లోకి చేరడం వల్ల పొలం నేల తన సహజత్వాన్ని కోల్పోయి, చౌడు భూమిగా మారే ప్రమాదం ఉందని,పంటలు దెబ్బతింటున్నాయని, పరిసర ప్రాంతాల్లో చెడు వాసన వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. హోటల్ యాజమాన్యంకు ఎన్నో సార్లు హెచ్చరించిన కూడ అలాగే కలుషితమైన నీరు వదులుతున్నారని వాసన భరించలేకపోతున్నామని జూరాల ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసిన కూడా పట్టించుకోవడంలేదని వాపోయారు. హోటల్ యాజమాన్యం సరైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసుకోకుండా బహిరంగంగా నీటిని వదులుతున్నందుకు ఉన్నతాధికారులకు పిర్యాదు చేస్తామని రైతులు వాపోయారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని జొమాటో డెలివరీ బాయ్ మృతి

హైదరాబాద్ పెన్ పవర్: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కిసర సర్కిల్ జవహర్ నగర్ – అంబేద్కర్ నగర్ రోడ్ లోని రోజ్ ఫంక్షన్ హాల్ సమీపంలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్ ఢీకొని జొమాటో డెలివరీ ఏజెంట్ స్వామి (36)అక్కడికక్కడే మృతి చెందాడు. డెలివరీకి వెళ్తున్న స్వామిని సిటీ బస్సు ఢీకొట్టడంతో సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు స్వామికి భార్య,ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జవహర్ నగర్ లో కొమ్మరాజుల వెంకటేష్ ఆధ్వర్యంలో దుర్గా నవరాత్రులు - ఘనంగా మహా అన్నదానం

హైదరాబాద్ పెన్ పవర్:





)మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర సర్కిల్ జవహర్ నగర్ చెన్నాపురం శ్రీ కృష్ణ నగర్ కాలనీలో దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం రోజున మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.
కొమ్మరాజుల వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో లో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య, మాజీ కార్పొరేటర్లు,బి ఆర్ ఎస్ , కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు.

## కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

హైదరాబాద్ పెన్ పవర్:

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీతో పాటు శిక్షణ, ఉపాధి కల్పన
37 మంది నిరుపేద మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ చేసిన పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి




గీసుగొండ మండలం కొనయమాకుల గ్రామంలోని రైతు వేదిక యందు సంగెం మండలం మరియు గ్రేటర్ వరంగల్ పరిధిలోని15, 16,17 డివిజన్ లకు చెందిన 37 మంది నిరుపేద మైనార్టీ మహిళలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అందిస్తున్న కుట్టు మిషన్లను పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మహిళలకు స్వయం ఉపాధి అవకాశాల కల్పనకు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు కృషి చేస్తున్నారని, కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మైనారిటీ మహిళల సంక్షేమమం మరియు అభివృద్ధి కొరకు ఇందిరమ్మ మహిళ శక్తి పథకం ద్వారా కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నాం అన్నారు. ఆధునిక కుట్టు మిషన్లతో ట్రైనింగ్ ఇప్పించి కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం అన్నారు. పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పరకాల ఇందిరా మహిళా డైరీ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్,నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ చీరల పంపిణీ,200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు బీమా, సన్న వడ్లకు రూ 500 బోనస్,సన్న బియ్యం పంపిణీ,మహాలక్ష్మి ,గ్యాస్ సబ్సిడీ, వడ్డీ లేని రుణాలు, శ్రీనిధి రుణాలు, ఇందిరమ్మ ఇల్లు,తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ కే రమేష్, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ టి రమేష్ , ఎంపీడీవోలు శ్రీధర్, రవీందర్, ఎమ్మార్వో రియాజుద్దీన్, మండల పార్టీ అధ్యక్షులు దాడి శివ, ఇండ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

## ఏడవ రోజుకు చేరుకున్న భద్రకాళి దేవస్థానం లో దేవి శరన్నవరాత్రులు



హైదరాబాద్ పెన్ పవర్:

వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీశరన్నవరాత్రులు ఏడవ రోజుకు చేరుకున్నాయి. ఉదయం గం॥ 04-00లకు నిత్యాహ్నికం నిర్వర్తించిన పిమ్మట అర్చకులు అమ్మవారిని సరస్వతీమాతగా అలంకరించడానికి అంగీకార ప్రార్ధన జరిపి సూచన వచ్చిన వెంటనే అమ్మవారిని సరస్వతీమాత. గా అలంకరించి పూజానాధలు నిర్వహించారు. ఈ రోజు అమ్మవారు సాధకుడి బుద్ధిలోకి ప్రవేశిస్తుంది. సరస్వతీ మాతగా అలంకరింపబడిన అమ్మవారి దర్శనం వల్ల సాధకుడికి సకల విద్యలు సమకూరుతాయని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేష తెలిపారు. ఈ రోజు సరస్వతీ అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించడానికి ఉదయం నుండి భక్తులు అమ్మవారి దర్శనమునకు పోటెత్తారు. ఈరోజు అమ్మవారికి రథసేవ జరిపారు శరీరాన్ని రథంతో పోలుస్తారు రక్తసేవలో సేమింపబడుతున్న అమ్మవారి రథం లాగితే ఈ జీవనరతం అనేది బాగా సాగుతుందని నమ్మకం అందుకు అనేకమంది భక్తులు పోటీపడుతూ ఈ రథాన్ని లాగారు నవరాత్ర కల్పాన్ని అనుసరించి కాలరాత్రి మరియు రక్తబీజహా దుర్గా క్రమంలో అమ్మవారికి పూజారాధనలు జరిపారు భద్రకాళీ శరణం మమ అనే నామస్మరణతో దేవాలయం మారుమ్రోగింది. రేపు భద్రకాళి అమ్మవారి జన్మోత్సవం, దుర్గ భద్రకాళిగా కోటి యోగినీ గణములతో ప్రాదుర్భావం చెందిన రోజు. బతుకమ్మ కూడా దుర్గాష్టమినాడే జన్మించిందని అనాడే చద్దులు చేయడమనేది తరతరాలుగా వస్తున్న సంప్రదాయం.

ఈ రోజు కార్యక్రమాలకు ఉభయదాతలుగా శారదా విద్యా సంస్థలు హైదరాబాదు వారి అధినేతలు శ్రీ సందిపూడి రవిశంకర్ మానస దంపతులు. శ్రీ నాగభూషణం- శ్రీదేవి దంపతులు, డా॥ బి. వెంకటేశ్వర్లు సునీత దంపతులు, డా॥ బి. సనత్ కుమార్. డా॥ సాహితి దంపతులు, కుమారి డా॥ బి. వైష్ణవి. శ్రీ జోశ్యుల కామేశ్వరశర్మ - కిరణ్మయి దంపతులు వ్యవహరించారు. ఈ రోజు అమ్మవారిని తెలంగాణా రాష్ట్ర ఐ.టి శాఖామాత్యులు శ్రీ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు. సందర్శించారు. మంత్రివెంట వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు మరియు డి.సి.సి అధ్యక్షులు శ్రీ ఇనుగాల వెంకట్రాంరెడ్డి తదితరులున్నారు. ఆలయానికి విచ్చేసి ప్రముఖులకు ఆలయ ఈఓ శ్రీమతి రామల సునీత, ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషులు పూర్ణకుంభం, మంగళవాద్యాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి నవరాత్ర విశేష పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం ఆలయ మహామండపంలో మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు ఎం.ఎల్.ఏ శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు వారి బంధుమిత్రలు దేవాలయములో నూతనముగా కోటిరూపాయల వ్యయముతో తయారు చేయించినటువంటి 27 ఫీట్ల ఎత్తుగల రథమును. మంత్రి ఆధ్వర్యంలో దేవాలయమునకు స్వాధీనపరచుట జరిగినది. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ డా॥ శివసుబ్రహ్మణ్యం. ధర్మకర్తలు శ్రీయుతులు కమటం వేణుగోపాల్, కల్లూరి పవన్ కుమార్, కటకం రాములు, కారెంగుల సురేష్ బాబు, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి. చిదర అంజనీదేవి, మాడిశెట్టి సతీష్, పేరాల శ్రీనివాస రావు, రమేష్ చంద్ భంగ్, మోతుకూరి మయూరి రామేశ్వర్రావులు మాజీ ధర్మకర్తలు శ్రీ జారతి వెంకటేశ్వర్లు, శ్రీ అనంతుల శ్రీనివాస్, శ్రీమతి గాండ్ల స్రవంతి. శ్రీ పాలడుగుల అంజనేయులు తదితరులున్నారు.
అట్లాగే ఈ రోజు అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులలో మాజీ ఎం.ఎల్.సి శ్రీ జోగినపల్లి సంతోష్ కుమార్, శ్రీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎం.ఎల్.ఏ శ్రీ దాస్యం వినయభాస్కర్, శ్రీ నాగుర్ల వెంకటేశ్వర్లు, శ్రీ కె. వాసుదేవ రెడ్డి తదితరులున్నారు.

## వరకట్న నిషేధ చట్టం



బాలల హక్కుల పై అవగాహన పోస్టర్ల ఆవిష్కరణ

హైదరాబాద్ పెన్ పవర్:
జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వరంగల్ ఆధ్వర్యంలో వరకట్న నిషేధ చట్టం మరియు చట్టంతో విభేదించిన బాలల హక్కులపై అవగాహన పోస్టర్ల ఆవిష్కరణవరకట్న నిషేధ చట్టం, చట్టంతో విభేదించిన బాలల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించాలి --- వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. బి. నిర్మలా గీతాంబ
వరంగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వరంగల్ ఆధ్వర్యంలో వరకట్న నిషేధ చట్టం మరియు చట్టంతో విభేదించిన బాలలకు సంబంధించిన చట్టాలు, హక్కులు, రక్షణ చర్యలపై రూపొందించిన అవగాహన పోస్టర్లను అధికారులు ఆవిష్కరించారు.
ఈ కార్యక్రమం ద్వారా వరకట్నం తీసుకోవడం, ఇవ్వడం చట్టరీత్యా నేరమనే విషయాన్ని ప్రజలకు తెలియజేయడంతో పాటు, వరకట్న వేధింపులకు గురయ్యే మహిళలకు అందుబాటులో ఉన్న న్యాయ సహాయం, ఫిర్యాదు చేసే విధానాలు, సంబంధిత చట్టపరమైన రక్షణలపై అవగాహన కల్పించడం ప్రధాన ఉద్దేశమని తెలిపారు ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. అదేవిధంగా, చట్టంతో విభేదించిన బాలల పట్ల సానుభూతితో, మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని, వారి హక్కులు, గౌరవం, గోప్యతను కాపాడాలని సూచించారు. బాలల న్యాయ వ్యవస్థలో సంబంధిత చట్టాలు, పునరావాసం, కౌన్సెలింగ్, విద్య మరియు సమాజంలో తిరిగి కలిసేలా చేయడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరముందని తెలిపారు. ప్రజలకు చట్టపరమైన అవగాహన కల్పించడం, బాధితులకు ఉచిత న్యాయ సహాయం అందించడం, మహిళలు మరియు బాలల హక్కులను పరిరక్షించడం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా న్యాయమూర్తులు పద్మజ, క్షమాదేశ్ పాండే, వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి. పూజ, ఇతర న్యాయమూర్తులు పాల్గొన్నారు.

## శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి......



హైదరాబాద్ పెన్ పవర్:

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట్ పరిధిలో శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారి నవరాత్రుల కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఆలయ ధర్మకర్త కొలన్ తేజ శ్రీనివాస్ రెడ్డి దేవి నవరాత్రుల సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో, సిరిసంపదలతో, ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని వారు శ్రీ కనకదుర్గ అమ్మవారిని ప్రార్థించారు. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొలన్ నర్సింహా రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డీసీసీ సభ్యులు రావూరి మౌళేశ్వర్ రావు, డివిజన్ అధ్యక్షులు వారాగాని వాసు, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, నాయకులు టేకుల ప్రవీణ్ రెడ్డి, శ్రీశైలం, లక్ష్మణ్, ప్రశాంత్ రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.

## బేతంపూడిలో ఉచిత కంటి వైద్య శిబిరం



హైదరాబాద్ పెన్ పవర్:

బేతంపూడి గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ వాంకుడోత్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో రాజ్ మొహమ్మద్ జాన్ బి మెమోరియల్ ట్రస్ట్ (రుద్రంపూర్)చైర్మెన్ పాషా జునైద్ సహకారంతో బేతంపూడి స్థానిక గ్రామ ప్రజల కోసం "ఉచిత కంటి వైద్య శిబిరాన్ని" ఏర్పాటు చేశారు. ఖమ్మం మరియు హైదరాబాద్‌లకు చెందిన ప్రముఖ డాక్టర్ అగర్వాల్ కంటి హాస్పిటల్ వైద్యుల బృందం సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించి, ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు చేశారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐఎన్‌టియుసి కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండీ . రజాక్ ,జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చీకటి కార్తీక్ విచ్చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. గ్రామ ప్రజలకు ఈ సేవలను చేరువ చేయడంలో సర్పంచ్ శ్రీకాంత్ కృషిని, అలాగే అగర్వాల్ ఆసుపత్రి వైద్యుల సేవలను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొని ఉచిత కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కె దేవేందర్,అనిల్,గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్స్‌లో ఘనంగా 'పండుగ సాయన్న' పాట ఆవిష్కరణ....

- ప్రజా వీరుడి పోరాట చరిత్రను భావితరాలకు అందించాలి
- రాష్ట్రమంతటా పండుగ సాయన్న విగ్రహాల ప్రతిష్ఠాపన జరగాలి -- నిర్మాత, విగ్రహ దాత ఆగం పాండు ముదిరాజ్



హైదరాబాద్ పెన్ పవర్:

)తెలంగాణ చరిత్రలో పేదల పక్షాన నిలిచి పోరాడిన ప్రజా వీరుడు పండుగ సాయన్న వీరగాథను పాట రూపంలో ప్రజల ముందుకు తీసుకొచ్చారు. ఆయన ధైర్యసాహసాలు, పోరాట పటిమ, సామాజిక న్యాయం కోసం సాగించిన పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాలనే లక్ష్యంతో రూపొందించిన 'పండుగ సాయన్న' పాట ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్స్‌లో ఘనంగా జరిగింది. బాచుపల్లి మాజీ సర్పంచ్, నిర్మాత, పండుగ సాయన్న విగ్రహ దాత ఆగం పాండు ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకకు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరై కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిలిపారు.

**ఆడియో ఆవిష్కరణకు ప్రముఖుల హాజరు :**

రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ ముఖ్య అతిథులుగా పాల్గొని పాటను ఆవిష్కరించారు. పండుగ సాయన్న చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆయన పోరాట స్ఫూర్తిని మరోసారి గుర్తుచేసింది.

**పండుగ సాయన్న వీరగాథకు పాట రూపం.. భావితరాలకు పోరాట స్ఫూర్తి**

ప్రముఖులు మాట్లాడుతూ ...

పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం నిలబడి పోరాడిన పండుగ సాయన్న చరిత్రను నేటి తరానికి పరిచయం చేయడం ఎంతో అవసరమని కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు పేర్కొన్నారు. ఆయన ధైర్యసాహసాలు, అన్యాయాన్ని ఎదిరించిన తీరు, ప్రజల పక్షాన నిలిచిన పోరాట స్ఫూర్తి సమాజానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. పాటలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ఆయన జీవిత విశేషాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లవచ్చని అభిప్రాయపడ్డారు.

ఒక చారిత్రక వ్యక్తి జీవితాన్ని సంగీత రూపంలో ప్రజల ముందుకు తీసుకురావడం ద్వారా యువతలో చరిత్ర పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు పండుగ సాయన్న ఆశయాలను మరింత విస్తృతంగా ప్రచారం చేయవచ్చని పేర్కొన్నారు. ఈ పాట ఆవిష్కరణ కేవలం సంగీత కార్యక్రమానికే పరిమితం కాకుండా, ప్రజా వీరుడి చరిత్రను గుర్తుచేసే వేదికగా నిలిచింది.

**రాష్ట్రవ్యాప్తంగా విగ్రహాల ప్రతిష్ఠాపనకు ఆగం పాండు ముదిరాజ్ సంకల్పం**

నిర్మాత, పండుగ సాయన్న విగ్రహ దాత ఆగం పాండు ముదిరాజ్ మాట్లాడుతూ, పండుగ సాయన్న చరిత్రను భావితరాలకు అందించాలనే బలమైన సంకల్పంతో రాష్ట్రవ్యాప్తంగా ఆయన విగ్రహాలను ప్రతిష్ఠించాలని కృషి చేస్తున్నట్లు తెలిపారు. విగ్రహాల ఏర్పాటు ద్వారా ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తూ, ప్రజా పోరాట చరిత్రను నిరంతరం గుర్తుచేసేలా చేయాలన్నది తన లక్ష్యమని పేర్కొన్నారు.

**రాష్ట్ర ప్రభుత్వం పండుగ సాయన్న జయంతి వర్ధంతి అధికారికంగా నిర్వహణ :**

పండుగ సాయన్న వీరగాథను ప్రతి గ్రామానికి, ప్రతి ప్రాంతానికి చేరువ చేయడంతో పాటు ఆయన పోరాట స్ఫూర్తిని యువతకు పరిచయం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్నట్లు ప్రకటించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆగం పాండు ముదిరాజ్ ప్రముఖులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పండుగ సాయన్న చరిత్రను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు దోహదపడుతుందని ఆయన ఆకాంక్షించారు.

**ముఖ్య అతిథుల చేతుల మీదుగా విగ్రహాల పంపిణీ కార్యక్రమం**

రాష్ట్రవ్యాప్తంగా పండుగ సాయన్న విగ్రహ ప్రతిష్టాపన జరగాలని ప్రతిష్టాత్మకంగా బలమైన సంకల్పంతో కార్యక్రమాన్ని ముందుకు తీసుకున్న సందర్భంగా ప్రసాద్ ల్యాబ్ లో ఆడియో ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా హాజరైన ప్రముఖుల చేతుల మీదుగా వివిధ జిల్లాల నుంచి పండుగసాయన విగ్రహ ప్రతిష్టాపన కొరకై పూనుకొని ముందుకు వచ్చిన సంఘాలకు విగ్రహాలను ప్రముఖుల చేతుల మీదుగా అందించడం జరిగింది. ప్రముఖుల హాజరుతో ప్రత్యేక ఆకర్షణగా ఆవిష్కరణ వేడుక

ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్స్‌లో నిర్వహించిన ఈ ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం ప్రముఖుల హాజరుతో సందడిగా సాగింది. పండుగ సాయన్న చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న లక్ష్యంతో నిర్వహించిన ఈ వేడుకకు ముదిరాజ్ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, విగ్రహ కమిటీ సభ్యులు, అభిమానులు తరలివచ్చారు. ప్రజా వీరుడి చరిత్రను పాట రూపంలో ఆవిష్కరించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ మాజీ కార్పొరేటర్ సామల హేమ, దుండిగల్ మాజీ ఎంపీపీ చిన్నంగి వెంకటేశం, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, జగన్మోహన్ ముదిరాజ్, ఉప్పరి నారాయణ, చొప్పరి శంకర్ ముదిరాజ్, రావుల జగదీశ్వర్ ప్రసాద్, ఆగం రాజు ముదిరాజ్, వరలక్ష్మీ ముదిరాజ్‌తో పాటు పండుగ సాయన్న విగ్రహ కమిటీ సభ్యులు, ముదిరాజ్ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# పాఠకులకు మెరుగైన సేవలు అందిస్తాం

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి శ్రీమతి సి. వసుంధర**



హైదరాబాద్ పెన్ పవర్:

జిల్లాలోని గ్రంథాలయాలకు వచ్చే పాఠకులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి శ్రీమతి సి. వసుంధర స్పష్టం చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలు అభివృద్ధి అంశాలపై సుదీర్ఘంగా చర్చించి, సంబంధిత ప్రతిపాదనలను ఆమోదించారు. జిల్లాలో నూతన గ్రంథాలయ భవనాల నిర్మాణం చేపట్టడం, ప్రస్తుతం ఉన్న గ్రంథాలయ భవనాలను ఆధునీకరించడం, పాఠకులకు అవసరమైన తాగునీరు, ఫర్నిచర్, పుస్తకాల ర్యాకులు తదితర మౌలిక సదుపాయాలను కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు వారు తెలిపారు. ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత, విద్యార్థులకు గ్రంథాలయాలను మరింత చేరువ చేయడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. గ్రంథాలయాల్లో చదువుకోవడానికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, పఠన సదుపాయాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. గ్రంథాలయాలు కేవలం పుస్తక పఠన కేంద్రాలుగానే కాకుండా విద్యార్థులు, యువత విజ్ఞానాభివృద్ధికి, పోటీ పరీక్షల్లో విజయ సాధనకు తోడ్పడే విజ్ఞాన కేంద్రాలుగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటామని చైర్మన్, కార్యదర్శి తెలిపారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ సభ్యులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు.

# పారిశుద్ధ సమస్యలపై పంచాయతీ కార్యదర్శులకు వినతి పత్రం

**అందించిన బిఆర్ఎస్ నాయకులు**



హైదరాబాద్ పెన్ పవర్: బీఆర్ఎస్ పార్టీ పిలుపుమేరకు జిల్లాలో ఉన్నటువంటి గ్రామపంచాయతీలలోని సమస్యలపై గ్రామపంచాయతీ సెక్రటరీలకు వినతి పత్రం ఇచ్చే కార్యక్రమంలో భాగంగా చుంచుపల్లి మండలం రుద్రంపూర్, ధన్బాద్ గ్రామపంచాయతీలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ధన్బాద్ సర్పంచ్ గుగులోత్. జ్యోతి , మాజీ సర్పంచ్ బానోతు. రాందాస్, రుద్రంపూర్ మాజీ సర్పంచ్ గుమ్మడి.సాగర్,మాజీ ఉప సర్పంచ్ భూక్య.రవి, వార్డు నెంబర్లు కృష్ణవేణి, స్వరూప గారు, సీనియర్ నాయకులు కలకోట. ఐలయ్య, మందుల.జయరాజ్, కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు రవి, ముఖేష్, బావుసతీష్, జలీల్, అజర్, తదితరులు కలిసి రుద్రంపూర్, ధన్బాద్ గ్రామపంచాయతీ సెక్రటరీ భూమిక కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రుద్రంపూర్ మాజీ సర్పంచ్ గుమ్మడి. సాగర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పూల రవీందర్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామపంచాయతీలో పారిశుద్ధం పూర్తిగా క్షీణించిపోయిందని గ్రామంలోని పల్లె ప్రకృతి వనాలు, క్రిమిటోరియల్, స్మశానవాటికలు,మురుగు కాలువలు,వీధిలైట్లు, పారిశుధ్య పనులను పట్టించుకునే నాథుడు కరువయ్యాడని కనీసం దోమలు రాకుండా ఫాగింగ్ గాని అంటువ్యాధులు వాపించకుండా బ్లీచింగ్ కానీ చేయడం లేదని ప్రధానంగా కోతులు, కుక్కలు,పందుల బెడద చాలా తీవ్రంగా ఉన్నాయని, పైన పేర్కొన్న సమస్యలు అన్నిటిపై తక్షణమే స్పందించి ప్రజలందరికీ స్వచ్ఛ పాలన అందించాలని లేనిపక్షంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రానున్న కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రుద్రంపూర్ ధన్బాద్ గ్రామపంచాయతీలోని టిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బతుకమ్మ ఘాట్లను పర్యవేక్షించిన బిఆర్ఎస్ నాయకులు



హైదరాబాద్ పెన్ పవర్:

గ్రామపంచాయతీలో ఉన్నటువంటి బతుకమ్మ ఘాట్లను(ధన్బాద్ చెరువు) బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సందర్శించి జరిగే బతుకమ్మ నిమజ్జన కార్యక్రమం పనులను పర్యవేక్షించరు . ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పూల రవీందర్ మాట్లాడుతూ తెలంగాణలో అతిపెద్ద పండగ దసరా అని ఈ దసరా పండుగకు కార్మిక ప్రాంతమైనటువంటి రుద్రంపూర్ ధన్బాద్ గౌతమ్ పూర్ ప్రజలకు ఎటువంటి ఆటంకం కలవకుండా బతుకమ్మ ఘాట్లను మరియు ఆడుకునే ప్రదేశాలను శుభ్రంగా ఉంచడం మరియు ఆడుకునే వారికి అన్ని వసతులు కల్పించడం ఆయా గ్రామ పంచాయతీలు మరియు సింగరేణి యాజమాన్యం వారిది బాధ్యత అని కానీ సింగరేణి అధికారులు ఫ్యామిలీ డే పేరుతో ఒకరోజు ముందుగానే బతుకమ్మ ప్రగతి వనంలో విద్యుత్ దీపాల నడుమ కార్యక్రమ ముగించుకొని అసలు బతుకమ్మ పండుగ అయినటువంటి ఆదివారం నిర్వహించబోయే బతుకమ్మ నిమజ్జన కార్యక్రమానికి ఏర్పాట్లు సింగరేణి యాజమాన్యం అరకొరగా నిర్వహిస్తున్నదని పార్క్ లో ఉన్న లైటింగ్ను తీసివేసినారని నమ మాత్రం లైటింగ్ ఉంచినారని చెరువులో పేరుకుపోయిన పూడిక సరిగా తీయలేదని ఆరోపించినారు. దేనికి అంతటికి కారణం మూడు గ్రామపంచాయతీ సర్పంచులు , సింగరేణి యాజమాన్యం వారు కలిసి ప్లాన్ చేస్తే ప్రజలకు మేలు జరిగేదని, సింగరేణి అధికారులు అందరూ కూడా కొత్త వారే కనుక కొంత అవగాహన రహితం ఉన్నదని ఇంకా సమయం ఉన్నది కావున కార్మిక వాడల్లో మరియు వారు ఆడుకునే ప్రదేశాలలో లైటింగ్ బతుకమ్మ ఘాట్ల వద్ద వసతులు పెంచాలని తెలిపారు . ఈ కార్యక్రమంలో రుద్రంపూర్ మాజీ సర్పంచ్ గుమ్మడి.సాగర్ ధన్ బాద్ మాజీ ఉపసర్పంచ్ , భూక్య రవి, సీనియర్ నాయకులు కలకోటి ఐలయ్య, మందుల జయరాజు, సతీష్,ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మీదేవి అలంకారములో దర్శనమిచ్చిన అమ్మవారు

**పెద్దమ్మగుడిలో వైభవంగా 7వ రోజు అమ్మవారి ఉత్సవాలు**



హైదరాబాద్ పెన్ పవర్:

పాల్వంచ మండలం, కేశవాపురం-జగన్నాథపురం గ్రామంలో వెలసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మగుడి) నందు ఈ నెల 11వ తేదీన ప్రారంభమైన శ్రీ దేవి శరన్నవరాత్ర ఉత్సవాలలో భాగంగా 7 వ రోజున ఋత్వికులు మరియు దేవస్థాన అర్చకులచే ఉదయం ప్రాతఃకాలార్చన, శ్రీ లక్ష్మీగణపతి అనుష్టానములు, వేదపారాయణ, నవగ్రహజపములు, శ్రీ సూక్త మన్య సూక్తపారాయణములు, సప్తశతి పారాయణము, శ్రీచక్రార్చన, సూర్య నమస్కారములు, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకము, రుద్రహోమం నిర్వహించబడినది. ఉదయం "శ్రీ ఆంజనేయస్వామివారికి సహస్ర నాగపల్లి అర్చన (తమలపాకులతో) మరియు 'నవగ్రహపూజలు" మరియు సుహాసిని పూజ కార్యక్రమములు నిర్వహించబడినవి. "సుహాసిని పూజ నందు ఒక ముత్తైదువను అమ్మవారిగా భావించి, షోడశ ఉపచారములతో శ్రీసూక్త విధానంగా సహస్ర, త్రిశతీ, అష్టోత్తర, ఖడ్గమాల నామములతో అర్చించి, మంగళహారతి ఇచ్చి, ఆభరణ, పుష్ప, హరిద్ర, కుంకుమ చందనాదులతో (పసుపు, కుంకుమ, చీరె, జాకెట్, కొబ్బరికుడకలు, పళ్ళు, పూలు, గాజులు) "సారె"తో సత్కరించి, సువాసినిగారి ఆశీర్వచనము పొందడం జరిగినది. మధ్యాహ్నం 2 గం॥ల నుండి "చండీహోమం", "లక్షకుంకుమార్చన" కార్యక్రమమం నిర్వహించబడినది. శనివారం అమ్మవారు శ్రీ మహాలక్ష్మీ దేవీ అలంకరణలో భక్తులకు కష్టం ఇచ్చారు. ఉత్సవాల్లో ఆదివారం సాయంత్రం 6-00 గంటలకు "చద్దుల బతుకమ్మ" నిర్వహించబడును. ఉత్సవాల్లో 8 వ రోజు అమ్మవారు "శ్రీ దుర్గా దేవి అలంకారము"లో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

# జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేతకు సహకరించండి -మర్రి రాజశేఖర్ రెడ్డికి జేఏసీ వినతి

హైదరాబాద్ పెన్ పవర్: లక్షలాది మంది ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన జవహర్ నగర్ డంపింగ్ యార్డును శాశ్వతంగా ఎత్తివేసేందుకు సహకరించాలని కోరుతూ జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ (జేఏసీ) నేతలు శనివారం మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. బోయిన్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో ఈ వినతిపత్రాన్ని అందజేశారు. గత 25 ఏండ్లుగా గ్రేటర్ హైదరాబాద్‌లోని కోటిన్నర మంది విసర్జించే రోజుకు వేల టన్నుల వ్యర్థాలను స్వీకరిస్తున్న రాంకీ డంపింగ్ యార్డు కాలపరిమితి ముగిసినా, అక్రమంగా చెత్తను తరలించి పరిసర కాలనీలు,గ్రామాల ప్రజలకు తీవ్ర పర్యావరణ, ఆరోగ్య సంక్షోభాన్ని కలిగిస్తోందని జేఏసీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు కలుషితం కావడం, గాలి కాలుష్యం, దుర్వాసన, మీథేన్ వాయువు అధికంగా విడుదల కావడం వల్ల వేలాది మంది ప్రజలు శ్వాసకోశ, చర్మ, క్యాన్సర్ తదితర తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, అనేక మంది అకాల మరణాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గతంలో అనేక శాస్త్రీయ అధ్యయనాలు, నిపుణుల కమిటీల నివేదికలు కూడా ధృవీకరించాయని గుర్తుచేశారు. డంపింగ్ యార్డు ప్రభావిత సుమారు 30 లక్షల మంది ప్రజల జీవించే హక్కును కాపాడాలని, డంపింగ్ యార్డును వెంటనే ఎత్తివేసి శాశ్వతంగా మూసివేసి, శాస్త్రీయ పద్ధతిలో పర్యావరణ పునరుద్ధరణ చేపట్టేలా ఒత్తిడి తేవాలని కోరారు. బాధిత ప్రాంతాల్లో కాలుష్య నియంత్రణ ప్రణాళిక అమలు చేసి, ఉచిత వైద్య శిబిరాలు, పరిశుభ్రమైన మంచినీటిని అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ ఐఎఫ్‌టీయూ షేక్ షావలి, కన్వీనర్ సీపీఐ ఉమామహేశ్,గౌరవ సలహాదారు మాజీ ఉపసర్పంచ్ రావల్ కోల్ నర్సింహ్మాగౌడ్, కోశాధికారి పి.శివబాబు, కో-కన్వీనర్లు గడ్డం సదానందం, ఎ.సుబ్రహ్మణ్యం, పీకేఎం రాజానర్సింహ్మా, మహ్మద్ పాషామియా, చిందం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



స్పందిస్తూ డంపింగ్ యార్డు ప్రభావిత ప్రాంతాలకు చెందిన మెజార్టీ ప్రజలు రోడ్లమీదకు వస్తేనే ఎత్తివేతకు మార్గం సుగమం అవుతుందని, కేవలం అర్జీలు, వినతిపత్రాల ద్వారా సమస్య పరిష్కారం కాదని జేఏసీ నేతలకు సూచించారు. ఆ దిశగా ప్రజలు ముందుకు వచ్చినప్పుడు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు అండగా నిలిచిన యువ డాక్టర్ వెంపటి జీవనజ్యోతి

## ప్రమాద సమయంలో మానవత్వం చాటుకున్న వైనం బాధితులను ఆసుపత్రికి తరలించడంలో సహకారం

**ఖమ్మం, పెన్ పవర్, అక్టోబర్ 17:** ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ బైపాస్ రోడ్డు సమీపంలో లక్ష్మీ బృందావనం వద్ద ఆటో కారు ఢీకొన్న ఘటనలో పలువురు గాయపడ్డారు. ఆటోలో ప్రయాణిస్తున్న పిల్లలు, పెద్దలకు గాయాలు కాగా, ఒక వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు సమాచారం. ఈ ఘటనను అదే మార్గంలో తన తండ్రి, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేంద్రతో కలిసి వెళ్తున్న డాక్టర్ వెంపటి జీవనజ్యోతి గమనించారు. ప్రమాదంలో గాయపడిన వారిని చూసి చలించిపోయిన ఆమె వెంటనే స్పందించి క్షతగాత్రుల వద్దకు చేరుకున్నారు. వారికి ధైర్యం చెప్పి, భరోసా కల్పించడంతోపాటు మెరుగైన వైద్య చికిత్స కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించేందుకు తన వంతు సహకారం అందించారు.



అదే సమయంలో అటుగా వెళ్తున్న సీపీఐ అనుబంధ రైతు సంఘం నాయకులు మెడకనిచ్చిన వెంకటరెడ్డి, రామకోటి, వెన్నం భాస్కర్‌తో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు సైతం క్షతగాత్రులకు సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. ప్రమాద సమయంలో పార్టీలు, రాజకీయాలకు అతీతంగా బాధితులకు అండగా నిలవడం అక్కడి ప్రజలను ఆకట్టుకుంది.

**ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తం.. అదే నిజమైన మానవత్వం!**

రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి బాధితులకు సహాయం అందించిన డాక్టర్ వెంపటి జీవనజ్యోతితో పాటు ఇతర నాయకుల సేవాభావాన్ని స్థానికులు అభినందించారు. కష్టకాలంలో బాధితులకు ధైర్యం చెప్పడం, సకాలంలో వైద్య సహాయం అందేలా చూడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది.

# సీపీ సజ్జనార్ ను కలిసిన దళిత సంక్షేమ సమితి ప్రతినిధులు



**ఎల్బీనగర్, పెన్ పవర్, అక్టోబర్ 17:** మహేశ్వరం నియోజకవర్గం జిల్లెలగూడ చెరువు కట్టపై త్వరలో ఏర్పాటు చేయనున్న జాంబవంతుడి విగ్రహానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ హైదరాబాద్ పోలీసు కమిషనర్ సజ్జనర్ ను వారి కార్యాలయంలో దళిత సంక్షేమ సమితి ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. సమితి ప్రతినిధుల వినతిపత్రాన్ని పరిశీలించిన కమిషనర్ సంబంధిత అధికారులతో చర్చించి జాంబవంతుని విగ్రహ ఏర్పాటుకు అనుమతిస్తామని హామీనిచ్చినట్లు సమితి నాయకులు తెలిపారు. కమిషనర్ సజ్జనర్ కు వినతిపత్రం సమర్పించిన వారిలో సమితి ప్రతినిధులు మొక్కపల్లి బాలకృష్ణ, కొండ్ర ఓంప్రకాష్, గజ్జెల రాంచందర్, పోగుల నర్సింహ, జెనిగె నరేష్, చాక శ్రీనివాసులు, దండు యాదయ్య, ప్రసాద్ తదితరులు ఉన్నారు.



# మధుయాష్కీ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు



**ఎల్బీనగర్, పెన్ పవర్ అక్టోబర్ 17:** అఖిల భారత వృత్తినిపుణుల కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిగా నూతన బాధ్యతలు స్వీకరించిన మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మధుయాష్కీ గౌడ్ అనుభవం, నాయకత్వంలో అఖిల భారత వృత్తినిపుణుల కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతుందని, వివిధ రంగాలకు చెందిన వృత్తినిపుణులను కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షించడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# అభివృద్ధికి కొత్త బాట. ఏదులాపురానికి సరికొత్త రూపం

**కూడళ్ల సుందరీకరణతో నగరానికి కళమౌలిక వసతుల అభివృద్ధితో ప్రజలకు మేలు ఆదర్శ మున్సిపాలిటీగా ఏదులాపురాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యం**



**ఖమ్మం, పెన్ పవర్, అక్టోబర్ 17:** మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మార్గదర్శకత్వంలో ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే దిశగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. పట్టణానికి ప్రత్యేక ఆకర్షణ తీసుకురావడంతో పాటు ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించే లక్ష్యంతో ప్రధాన కూడళ్ల సుందరీకరణపై అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా శనివారం నాయుడుపేట సర్కిల్, కోదాడ ఎక్స్ రోడ్, వెంకటగిరి ఎక్స్ రోడ్‌లలో జరుగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, ఏఈ అప్పారావు, స్థానిక కౌన్సిలర్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షించి, నాణ్యత విషయంలో రాజీ పడకుండా అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయాలని సూచించారు. అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, కూడళ్లకు కొత్త రూపు ఇవ్వడం మాత్రమే కాదు.. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం కూడా” అనే లక్ష్యంతో మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నారు. పరిశుభ్రమైన వాతావరణం, ఆకర్షణీయమైన కూడళ్లు, మెరుగైన సదుపాయాలతో పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు చేపడుతున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారం, మార్గదర్శకత్వంతో ఏదులాపురం మున్సిపాలిటీని అభివృద్ధికి చిరునామాగా నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఒక్కో కూడలికి అందం. ఒక్కో అభివృద్ధి పనితో ప్రజలకు ఆనందం.. ప్రజల అవసరాలే ప్రాధాన్యంగా ఏదులాపురం అభివృద్ధి ప్రస్థానం సాగాలి అనే సంకల్పంతో మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా అడుగులు పడుతున్నాయి.

# పెయింటర్ నుంచి కౌన్సిలర్‌గా ఎదిగి.. ప్రజల కష్టాల్లో నేనున్నానంటూ ముందుకు సాగే భూక్య ఫుల్ చంద్ నాయక్

**ఖమ్మం, పెన్ పవర్, అక్టోబర్ 17:**
ఏదిరాపురం మున్సిపాలిటీ పరిధిలో27వ వార్డు అభివృద్ధే లక్ష్యంగా. పేదల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ27వ వార్డు కౌన్సిలర్ భూక్య ఫుల్ చంద్ నాయక్ సాధారణ పెయింటర్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించి, ప్రజలతో మమేకమవుతూ ప్రజాప్రతినిధిగా ఎదిగారు. ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకుంటూ, వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. పదవిని హోదాగా కాకుండా ప్రజలకు సేవ చేసే అవకాశంగా భావిస్తూ వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. ఎవరి కుటుంబంలోనైనా కష్టం వచ్చినప్పుడు తనకు చేతనైన సహాయం అందించేందుకు ముందుంటూ, పేదలు, నిరుపేదల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తున్నారు. వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ 27వ వార్డును అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకుంటూ, వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తూ తన బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. సాధారణ వృత్తి నుంచి ప్రజాప్రతినిధిగా ఎదిగిన భూక్య ఫుల్ చంద్ నాయక్ తన ప్రస్థానంలో ప్రజలతో ఉన్న అనుబంధానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండటం, వారి సమస్యలను వినడం, పరిష్కారానికి కృషి చేయడం తన బాధ్యతగా భావిస్తూ ముందుకు సాగుతున్నారు.

ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం, పేదల కష్టాల్లో అండగా నిలవడం 27వ వార్డును అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం నా ప్రధాన లక్ష్యం అనే సంకల్పంతో భూక్య ఫుల్ చంద్ నాయక్ తన సేవా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.



# పార్టీ ప్రభావం తక్కువ.. అభ్యర్థి ప్రభావం ఎక్కువ !

# కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు

**హైదరాబాద్ అక్టోబరు 17 పెన్ పవర్:**
తెలంగాణలో రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వేడి అప్పుడే రాజకీయ వర్గాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఎమ్మెల్సీ పోరుకు సంబంధించి అధికార కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ ముందస్తు ప్రచారంలో జోరు పెంచగా, ప్రతిపక్ష బీఆర్ఎస్ , బిజెపి మాత్రం ఇప్పటికీ తమ అభ్యర్థులను ఖరారు చేయలే మల్లగుల్లాలు పడుతున్నాయి. పట్టభద్రుల ఎన్నికల్లో సాధారణ ఎన్నికల మాదిరిగా కాకుండా ఓటర్ల నమోదు ప్రక్రియే అత్యంత కీలకం కావడం, అభ్యర్థి ఎవరో తేలితే తప్ప క్షేత్రస్థాయి క్యాడర్‌లో పూర్తిస్థాయిలో ఉత్సాహం రాకపోవడంతో ఆయా పార్టీల్లో అంతర్గత చర్చలు తుదిదశకు చేరుకున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తోంది. అభ్యర్థుల ఎంపికలో వేగం పెంచడమే కాకుండా, గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు బాధ్యతను నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులకు అప్పగించింది. పట్టభద్రులను నేరుగా కలిసి ఓటర్లుగా నమోదు చేయించడంలో కాంగ్రెస్ శ్రేణులు ఇప్పటికే క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తున్నాయి. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, ఉద్యోగ నియామకాల ప్రచారాన్ని పట్టభద్రుల వద్దకు తీసుకెళ్తూ, ఓటర్ల నమోదును ఓ సవాలుగా తీసుకుని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రచారంలో ముందంజలో ఉన్నాయి. మరోవైపు బీజేపీలో పట్టభద్రుల ఎమ్మెల్సీ టికెట్ కోసం తీవ్ర పోటీ నెలకొంది. గతంలో హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు మళ్లీ రేసులో ముందున్నారనే ప్రచారం బలంగా సాగుతోంది. ఆయనతో పాటు పార్టీ ముఖ్య నేతలు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కూడా టికెట్ రేసులో ఉండటంతో అభ్యర్థిత్వం కొలిక్కిరావడం లేదు. ముగ్గురు చొప్పున అభ్యర్థుల పేర్లతో కూడిన నివేదికలను రాష్ట్ర కమిటీ కేంద్ర నాయకత్వానికి పంపినట్లు సమాచారం. అయితే, పార్టీ అభ్యర్థిపై అధికారిక స్పష్టత వచ్చే వరకు స్థానిక క్యాడర్ సంపూర్ణంగా ఓటర్ల నమోదు ప్రక్రియలో పాల్గొనలేకపోతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విపక్ష బీఆర్ఎస్ పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. వరుస ఎన్నికల పరాజయాల తర్వాత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాన్ని దక్కించుకోవడం ద్వారా మళ్లీ పుంజుకోవాలని ఆ పార్టీ భావిస్తోంది. అయితే పట్టభద్రుల నియోజకవర్గాలు విస్తారంగా ఉండటంతో పాటు ప్రచార వ్యయం కూడా అధికంగా ఉండే అవకాశం ఉండటంతో, ఆర్థికంగా బలంగా ఉన్న నేతల వైపే అధిష్టానం మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో పట్టు ఉండి, ఆర్థిక వనరులను సమకూర్చుకోగల సీనియర్ నేతలతో బీఆర్ఎస్ అధిష్టానం సంప్రదింపులు జరుపుతోంది. సరైన అభ్యర్థి దొరకడంలో జరుగుతున్న జాప్యం వల్ల జిల్లాల్లో బీఆర్ఎస్ క్యాడర్ దిశానిర్దేశం లేక వేచిచూసే ధోరణిలోనే ఉండిపోయింది. పట్టభద్రుల ఎన్నికల్లో పార్టీ గుర్తు కంటే అభ్యర్థి వ్యక్తిగత ఇమేజ్, విద్యావంతులలో ఉన్న ప్రజాదరణ, ముందస్తు ప్రచారమే ప్రధాన పాత్ర పోషిస్తాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఓటర్ నమోదులో వేగం చూపిస్తుంటే, బిజెపి అర్బన్ ప్రాంతాల్లో ఉన్న తన సాంప్రదాయ ఓటు బ్యాంకుపై ధీమాతో ఉంది. ఇక బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ వ్యతిరేక ఓటును ఆకర్షించాలని చూస్తోంది. కానీ, అభ్యర్థుల ప్రకటన ఆలస్యమయ్యే కొద్దీ ఆయా పార్టీల క్యాడర్‌లో క్రియాశీలత తగ్గి, ఓటర్ల నమోదు ప్రక్రియ మందగించే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమరం రోజురోజుకూ ఆసక్తికరంగా మారుతోంది. కాంగ్రెస్ తన స్పీడ్‌తో ప్రత్యర్థులపై ఒత్తిడి పెంచుతుంటే, బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు వీలైనంత త్వరగా అభ్యర్థులను ఖరారు చేసి ప్రకటన విడుదల చేయాలని భావిస్తున్నాయి. రాబోయే కొద్ది రోజుల్లో ప్రధాన పార్టీలన్నీ అభ్యర్థులను రంగంలోకి దించితే తప్ప పట్టభద్రుల నియోజకవర్గాల్లో అసలైన పొలిటికల్ హీట్ మొదలయ్యే అవకాశం కనిపించడం లేదు

# పులివెందులలో హైటెన్షన్.. గాలిలోకి పోలీసుల కాల్పులు




**విజయవాడ అక్టోబరు 17 పెన్ పవర్:** మాజీ సీఎం జగన్మోహనరెడ్డి సొంత నియోజకవర్గం పులివెందులలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. మున్సిపల్ ఎన్నికలకు నామినేషన్లు సందర్భంగా అధికార, విపక్షాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. దీంతో పరిస్థితులను అదుపు చేసేందుకు పోలీసులు ముందుగా టియర్ గ్యాస్ ప్రయోగించారని చెబుతున్నారు. అప్పటికీ ఉద్రిక్తతలు సద్దుమణగకపోవడంతో గాలిలోకి కాల్పులు జరిపారని చెబుతున్నారు. పోలీసులు ఆరు రౌండ్ల కాల్పులు జరపడంతో పలువురు గాయపడ్డారని అంటున్నారు. ఈ ఘటనకు అధికార టీడీపీదే బాధ్యత అంటూ ఎంపీ అవినాశ్ రెడ్డి ఆరోపించారు. వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారనే సమాచారంతో ఆయన నామినేషన్ సెంటర్ వద్దకు వచ్చారు.పులివెందులలో హై టెన్షన్ నెలకొంది. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సొంత నియోజకవర్గం కావడంతో ఈ స్థానంపై అధికార పార్టీ గట్టిగా ఫోకస్ చేసింది. పులివెందులలో గెలిచి పరువు నిలబెట్టుకోవాలని భావిస్తున్న విపక్ష వైసీపీ తన సర్వశక్తులు ఒడ్డుతోంది. దీంతో శనివారం నామినేషన్ల దాఖలు సమయంలో బలప్రదర్శనకు దిగిందని అంటున్నారు. దీంతో టీడీపీ శ్రేణులు కూడా భారీగానే తరలివచ్చినట్లు చెబుతున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారని ఆరోపిస్తున్నారు.

నామినేషన్ కేంద్రం వద్ద ఉన్న పోలీసులతోనే వైసీపీ నాయకులు గొడవ పడుతున్నారని తెలియడంతో పట్టణంలోనే ఉన్న ఎంపీ అవినాశ్ రెడ్డి హుటాహుటిన అక్కడకు చేరుకున్నారని ప్రచారం జరుగుతోంది. ఎంపీ వచ్చిన తర్వాత గొడవ మరింత ఎక్కువ అయిందని అంటున్నారు. దీంతో పోలీసులు టియర్ గ్యాస్ తోపాటు గాలిలోకి కాల్పులు జరిపారని చెబుతున్నారు. ఈ ఘటనలో తమ కార్యకర్తలకు గాయాలు అయ్యాయని ఎంపీ అవినాశ్ రెడ్డి మీడియాకు తెలిపారు. రాష్ట్రంలో పోలిసింగ్ అధ్వానంగా తయారైందని ఈ ఘటనతో రుజువైందని ఆయన విమర్శించారు. తాము పోలీసులతో పోరాడాల్సివస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.మరోవైపు మున్సిపల్ ఎన్నికల సందర్భంగా చోటుచేసుకుంటున్న పరిణామాలపై సాధారణ ప్రజానీకం తీవ్ర ఆందోళనకు గురవుతోంది. నామినేషన్ల సమయంలోనే ఈ స్థాయిలో యుద్ధ వాతావరణం ఉండటంతో రానున్న రోజుల్లో పరిస్థితులు ఇంకెంత దారుణంగా తయారవుతాయోనని ఆవేదన చెందుతున్నారు. ప్రధానంగా ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండటంతో ఎన్నికల సంఘం కూడా ప్రత్యేకంగా దృష్టి పెట్టిందని చెబుతున్నారు. ఈ పరిస్థితులను అధిగమించి ఎన్నికలు శాంతియుతంగా ముగిసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# వంగవీటి బ్రాండ్ ఇక జనసేన సొంతం..
# డిప్యూటీ సీఎం ద్విముఖ వ్యూహం!



**విజయవాడ అక్టోబరు 17 పెన్ పవర్:** స్థానిక ఎన్నికల సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాజకీయ వ్యూహాలు ఆసక్తి రేపుతున్నాయి. పార్టీని రాష్ట్రవ్యాప్తంగా బలోపేతం చేసుకోవడంతోపాటు తన సొంత సామాజిక వర్గం మొత్తాన్ని తనవైపు తిప్పుకునేలా పవన్ పావులు కదుపుతున్నారని అంటున్నారు. స్థానిక ఎన్నికలు పార్టీ శ్రేణుల కోసమేనని గతంలోనే చెప్పిన పవన్, కేడర్ కు గుర్తింపు, గౌరవం ఇచ్చేలా కీలకమైన స్థానాలను దక్కించుకున్నారని చెబుతున్నారు. కార్పొరేషన్లు, మున్సిపల్ చైర్మన్ స్థానాలతోపాటు ఆయా పట్టణ సంస్థల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్ పదవులలో గౌరవప్రదమైన సంఖ్యలో స్థానాలు తీసుకుని పార్టీని పూర్తిస్థాయిలో విస్తరించేలా పవన్ అడుగులు వేస్తున్నారని చెబుతున్నారు. ప్రధానంగా విజయవాడ కార్పొరేషన్ దక్కించుకున్న జనసేనాని ఆ స్థానంలో మేయర్ అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణను ఎంపిక చేయడంలో తిరుగులేని వ్యూహాన్ని రచించారని అంటున్నారు.

**విజయవాడ, వంగవీటి పవన్ ద్విముఖ వ్యూహం**

రాష్ట్రంలో కీలకమైన విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ను పొత్తుల్లో భాగంగా దక్కించుకోవడం ద్వారా జనసేనాని వ్యూహం స్పష్టమవుతోందని అంటున్నారు. గోదావరి జిల్లాల తర్వాత కాపుల ప్రభావం ఎక్కువగా ఉండే విజయవాడ నగరంలో జనసేన జెండా ఎగరవేయడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఆ సామాజిక వర్గంపై బలమైన ముద్ర వేయాలని పవన్ భావిస్తున్నారని అంటున్నారు. అదే సమయంలో వంగవీటి బ్రాండ్ ను సొంతం చేసుకోవడం ద్వారా కాపుల్లో తన ఇమేజ్ మరింత పెంచుకునే దిశగా అడుగులు వేశారని చెబుతున్నారు. దీనివల్ల కాపు సామాజికవర్గాన్ని పవన్ ఆకర్షించారని అంటున్నారు. ఇప్పటికే ఆ సామాజికవర్గంలో పవన్ పట్ల సానుకూల వైఖరి ఉందని, తాజా నిర్ణయాల వల్ల చిన్న చిన్న అసంతృప్తులు ఉన్నప్పటికీ తొలగిపోయే పరిస్థితి ఉందని అంచనా వేస్తున్నారు.

**వంగవీటి ముద్రపై శాశ్వత పట్టు**

విజయవాడ మేయర్ గా వంగవీటి రాధాకృష్ణను నిలపడం ద్వారా పవన్ రాజకీయంగా పట్టు బిగించే వ్యూహాన్ని అమలు చేశారని అంటున్నారు. రాష్ట్రంలో వంగవీటి బ్రాండ్ కు పార్టీలకు అతీతంగా అభిమానులు ఉన్నారని, ఇన్నాళ్లు తమ నాయకుడు వంగవీటి మోహనరంగా వారసులకు సరైన గుర్తింపు లేదని వారిలో ఆవేదన ఉండేదని అంటున్నారు. ఈ కారణంగా నామినేటెడ్ పదవుల పందేరం జరిగిన ప్రతిసారి వంగవీటి వారసుడిగా మాజీ ఎమ్మెల్యే రాధాకృష్ణ పేరు ప్రముఖంగా వినిపించేదని అంటున్నారు. అయితే రకరకాల సమీకరణాలతో వంగవీటి పేరు వెనక్కి వెళ్లిపోయేదని అంటున్నారు. ఈ పరిస్థితుల్లో మేయర్ గా వంగవీటి రాధాకృష్ణ పేరు తెరపైకి తీసుకురావడమే కాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబును ఒప్పించారని చెబుతున్నారు. అదేసమయంలో వంగవీటిని టీడీపీ నుంచి జనసేనలోకి తీసుకురావడం కూడా పవన్ రాజకీయ చాణక్యానికి నిదర్శనంగా చెబుతున్నారు. దీనిద్వారా వంగవీటి బ్రాండ్ ను జనసేనాని సొంతం చేసుకున్నారని అంటున్నారు.

**విజయవాడ నగరంపై పట్టు**

రాష్ట్ర రాజకీయాల్లో విజయవాడ నగరం అత్యంత కీలకం. రాష్ట్ర రాజకీయాలకు విజయవాడే కేంద్రం. ఒకప్పుడు వ్యాపార, వాణిజ్య కేంద్రంగా విలసిల్లిన విజయవాడ రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్ర రాజకీయాలకు కేంద్రంగా మారింది. రాజధానికి సమీపంలో ఉన్న ఈ నగరంలోనే పెద్ద సంఖ్యలో నేతలు, ఉద్యోగులు నివసిస్తున్నారు. దీంతో విజయవాడ నగరానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రాముఖ్యత పెరిగింది. ఇలాంటి నగరంపై జనసేన జెండా ఎగురవేస్తే ఆ ప్రభావం రాష్ట్రం మొత్తం ఉంటుందని జనసేనాని పవన్ వ్యూహాత్మకంగా అడుగులు వేశారని అంటున్నారు. అందుకే తమ పార్టీ నేతలు ఎక్కువగా మచిలీపట్నం కార్పొరేషన్ కావాలని తొలి నుంచి హడావుడి చేసినప్పటికీ పవన్ మౌనంగా తన వ్యూహాన్ని అమలు చేశారని అంటున్నారు. పార్టీ అవసరాల రీత్యా విజయవాడ జనసేనకే దక్కాలనే ఆలోచనతో ముందుగా సరైన అభ్యర్థిని వెతికి ఆ తర్వాత ఆయన పేరుతో టీడీపీని ఒత్తిడి చేశారని అంటున్నారు. దీంతో వంగవీటి విషయంలో టీడీపీ అధిష్టానం వ్యతిరేకించలేక విజయవాడ కార్పొరేషన్ ను జనసేనకు అప్పగించిందని చెబుతున్నారు.

# టీడీపీలో చిన్న శ్రీనుకు తొలి షాక్.. విజయనగరం మేయర్ అభ్యర్థి ఎంపికపై అనూహ్య నిర్ణయం



**విజయవాడ అక్టోబరు 17 పెన్ పవర్:** విజయనగరం మేయర్ సీటు ఎంపికపై టీడీపీ అనూహ్య నిర్ణయం తీసుకుంది. ఈ సీటు ఆశించి పార్టీలో చేరిన జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చిన్న శ్రీనుకు షాక్ ఇచ్చిందని ప్రచారం జరుగుతోంది. చిన్న శ్రీను కుమార్తె సిరి సహస్ర విజయనగరం మేయరుగా పోటీ చేయాలని భావించారని, ఈ కారణంగానే చిన్న శ్రీను టీడీపీలోకి వచ్చారంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే టీడీపీ అధిష్టానం మాత్రం చిన్న శ్రీను కుమార్తెను కాదని పార్టీలో తొలి నుంచి కొనసాగుతున్న అవనాపు భార్గవికి అవకాశం ఇచ్చింది. ప్రస్తుతం ఈ నిర్ణయం విజయనగరం జిల్లా రాజకీయాల్లో హాట్ టాపిక్ అవుతోంది. మేయర్ ఎంపికలో స్థానిక ఎమ్మెల్యే ఆదితి గజపతిరాజు మాటకే అధిష్టానం ప్రాధాన్యం ఇచ్చిందని అంటున్నారు. విజయనగరం మేయర్ అభ్యర్థిగా అవనాపు భార్గవిని ఎంపిక చేస్తూ టీడీపీ అధిష్టానం తీసుకున్న నిర్ణయం హాట్ టాపిక్ అవుతోంది. పార్టీపరంగా ఈ నిర్ణయాన్ని కార్యకర్తలు సమర్థిస్తున్నప్పటికీ, సీనియర్ నేత చిన్న శ్రీనుకు టీడీపీలో తొలి షాక్ ఎదురైనట్లుగా భావించాలని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. గత నెలలో వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన చిన్న శ్రీనుకు టీడీపీ రాజకీయాలు ఎలా ఉంటాయో ఈ నిర్ణయం ద్వారా తెలియజేసినట్లైందని అంటున్నారు. వైసీపీలో ఉండగా సర్వం తానై వ్యవహరించిన చిన్నశ్రీనుకు టీడీపీలో అటువంటి జోరు చూపేందుకు అవకాశం ఉండదని అధిష్టానం సంకేతాలు పంపిందని అంటున్నారు.విజయనగరం మేయర్ సీటు జనరల్ మహిళకు రిజర్వు చేశారు. దీంతో చిన్న శ్రీను కుమార్తె సిరి సహస్రకు లైన్ క్లియర్ అయినట్లే భావించారు. కానీ, పార్టీ అధిష్టానం అనూహ్యంగా బీసీ మహిళ అవనాపు భార్గవికి అవకాశం ఇచ్చింది. అవనాపు కుటుంబం తొలి నుంచి టీడీపీలో ఉండేది. 2004 తర్వాత కాంగ్రెస్ లోకి వెళ్లిన అవనాపు కుటుంబం గత ఎన్నికల ముందు తిరిగి టీడీపీలోకి వచ్చింది. రెండున్నరేళ్లుగా ఎమ్మెల్యే ఆదితి గజపతిరాజుకు వెన్నుదన్నుగా నిలుస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో అవనాపు భార్గవికి మేయర్ సీటు ఖరారు చేసినట్లుగా చెబుతున్నారు. దీంతో సీనియర్ నేత చిన్న శ్రీనుకు ఆశాభంగం తప్పలేదని అంటున్నారు.చిన్న శ్రీను కుమార్తె సిరి సహస్ర మేయర్ గా పోటీ చేయాలని ఉవ్విళ్లూరారని అంటున్నారు. ఈ కారణంతోనే ఆమె గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని టీడీపీలో చేరారని చెబుతున్నారు. అయితే టీడీపీలోకి కొత్తగా వచ్చిన సిరి సహస్రకు మేయర్ సీటు ఎలా ఇస్తారని పార్టీ వర్గాల నుంచి ప్రశ్నలు ఎదురయ్యాయని అంటున్నారు. ఇది గమనించే పార్టీలో తొలి నుంచి ఉన్నవారికి అవకాశం ఇచ్చారని అంటున్నారు. అయితే చిన్న శ్రీను తన కుమార్తెకు మేయర్ సీటు ఆశించిన విషయం వాస్తవమే అయినప్పటికీ టీడీపీలో చేరిన తర్వాత అటువంటి ప్రయత్నాలు ఏవీ చేయలేదని ఆయన మద్దతుదారులు చెబుతున్నారు. ఆయనకు ఏ పదవి ఇవ్వాలనే అంశాన్ని పార్టీ అధిష్టానం చూసుకుంటుందని, ఆ విషయంలో తమకు రెండో ఆలోచన లేదని అంటున్నారు. మొత్తానికి విజయనగరం మేయర్ సీటు ఎంపికతో చిన్న శ్రీను ఆశలు గల్లంతు చేశారన్న వాదనే ఎక్కువగా వినిపిస్తోంది.

# బీజేపీతో వైఎస్సార్‌సీపీ దోస్తీకి శాశ్వత ముగింపేనా?

**విజయవాడ అక్టోబరు 17 పెన్ పవర్:**

కాక్రోచ్ జనతా పార్టీ కీలక నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలల అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన ట్వీట్ జాతీయ రాజకీయాల్లో,సోషల్ మీడియా వేదికల్లో ఊహించని ప్రకంపనలు సృష్టిస్తోంది. ఢిల్లీ వేదికగా కేంద్ర ప్రభుత్వ వైఖరిపై, ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ యంత్రాంగం, కేంద్ర ఎన్నికల సంఘం తీరును సిజేపీ తీవ్రంగావ్యతిరేకిస్తున్న వేళ.. జగన్ నేరుగా ఆ పార్టీ నేతలకు సానుభూతి తెలపడమే కాకుండా, సిజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే, నేత అజింక్య షిండేలు ఆ ట్వీట్‌ను రీట్వీట్ చేస్తూ థ్యాంక్స్ చెప్పడం రాజకీయప్రాధాన్యతను సంతరించుకుంది. ఎలక్షన్ సిస్టమ్‌పై జగన్ చేసిన ఘాటు వ్యాఖ్యలు, పరోక్షంగా మోదీ ప్రభుత్వపు ముందస్తు అరెస్టుల వైఖరిని ఎండగట్టడం ఆయన తాజా రాజకీయ వ్యూహానికి నిదర్శనంగామారుతోంది.గతంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత, విపక్షాల నిరసన తీరును ప్రస్తావిస్తూ పరిస్థితులు ఇలాగే ఉంటే మేం కూడా కాక్రోచ్‌లం అవుతాం అని జగన్ వ్యాఖ్యానించారు. ఇప్పుడు అదే కాక్రోచ్ జనతా పార్టీ జాతీయ స్థాయిలో బీజేపీకి, ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా తీవ్ర స్థాయిలో వీధిపోరాటాలు చేస్తుంటే జగన్ వారికి సంపూర్ణ అండగా నిలుస్తున్నారు.

ఈ పరిణామం వైఎస్సార్‌సీపీ కేవలం తాత్కాలిక నిరసనలకు పరిమితం కాకుండా, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి వ్యతిరేకంగా బలమైన యాంటీ బేస్ ను నిర్మించుకోవడానికి మానసికంగా సిద్ధపడిందనే సంకేతాలను ఇస్తోంది.అయితే ఇక్కడే ఒక పెద్ద పొలిటికల్ వైరుధ్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఒకవైపు ఏపీలో అధికారంలో ఉన్న టీడీపీ–జనసేన–బీజేపీ కూటమిని ఢీకొట్టడానికి జగన్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. మరోవైపు జాతీయ స్థాయిలో బీజేపీతో వైరం పెట్టుకోకుండా, కేంద్ర దర్యాప్తు సంస్థల కేసులు, ఢిల్లీ మద్దతు కోసం గతంలో వ్యూహాత్మక మౌనం పాటించేవారు. కానీ ఇప్పుడు నేరుగా మోదీ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న, మోదీపై ఘాటు వ్యాఖ్యలు చేస్తున్న కాక్రోచ్ జనతా పార్టీకి నేరుగా మద్దతు ప్రకటించడం ద్వారా బీజేపీతో జగన్ బంధం ఇక పూర్తిగా తెగిపోయినట్లేనా అనే అనుమానాలు బలపడుతున్నాయి.

బీజేపీ విషయంలో పరోక్షంగా సైలెంట్‌గా ఉంటూనే, బీజేపీని తీవ్రంగా ఎండగట్టే తీవ్రవాద నిరసన గ్రూపులకు మద్దతివ్వడం వల్ల వైఎస్సార్‌సీపీ నైతికతపై సొంత పార్టీ శ్రేణుల్లోనే అనిశ్చితి నెలకొంటోంది.ఈ వైఖరివైఎస్సార్‌సీపీ రాజకీయ విశ్వసనీయతను ప్రశ్నించేలా చేస్తోందని భావిస్తున్నారు. అధికారం కోల్పోయిన తర్వాత ఓటు చోరీ, ఈవీఎంలు, కేంద్ర ఎన్నికల సంఘం పక్షపాతం అంటూ జగన్ వరుసగా గొంతువిప్పుతున్నారు. కానీ, ఏపీలో 2019లో వైఎస్సార్‌సీపీ 151 సీట్లు గెలిచినప్పుడు లేని లోపాలు, 2024లో ఓడిపోగానే ఎన్నికల వ్యవస్థలోనే లోపాలు ఉన్నాయంటూ జగన్ మాట్లాడటాన్ని బీజేపీ తీవ్రంగా తప్పుపడుతోంది. ఏపీ బీజేపీ నేతలు సైతం జగన్ వ్యాఖ్యలపై నిప్పులు చెరుగుతూ.. ఓడిపోతే వ్యవస్థ తప్పు, గెలిస్తే వ్యవస్థ ఒప్పా?" అంటూ ప్రశ్నిస్తున్నారు. సోషల్ మీడియాలో కూడా ఈ అంశంపై భిన్నమైన రాజకీయ చర్చ నడుస్తోంది. గతంలో కాక్రోచ్ జనతా పార్టీ నేత సౌరవ్ దాస్ స్వయంగా జగన్ కుటుంబానికి చెందిన భారతి సిమెంట్స్ , ఈడీ కేసులపై సంచలన ట్వీట్లు చేసిన అంశాలను నెటిజన్లు రీ–పోస్ట్ చేస్తున్నారు. గతంలో మిమ్మల్ని విమర్శించిన వారికే నేడు మద్దతు ఇస్తున్నారా? అంటూ నెటిజన్లు జగన్ ట్వీట్‌ను ప్రశ్నిస్తుంటే, మరొకవైపు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు మాత్రం ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడే ఎవరికైనా తమ నాయకుడు అండగా నిలుస్తాడని రీ–ట్వీట్లు చేస్తున్నారు.కాక్రోచ్ జనతా పార్టీకి బహిరంగ మద్దతు ఇవ్వడం ద్వారా జగన్ మోహన్ రెడ్డి ఒక పెద్ద పొలిటికల్‌గ్యాంబుల్ ఆడారని చెప్పవచ్చు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో ఉన్న సత్సంబంధాలను వదులుకుని, నేరుగా ఢిల్లీ స్థాయిలో విపక్షాల వైపు నిలబడే సంకేతాలు ఇవ్వడం వల్ల రాబోయే రోజుల్లో ఏపీ రాజకీయాల్లోనే కాక, జగన్‌పై ఉన్న వివిధ కేంద్ర దర్యాప్తు కేసుల్లోనూ పరిణామాలు వేగంగా మారే అవకాశం ఉంది. మరి జగన్ ఇకపై నేరుగా బీజేపీతోనే ఢీకొట్టేందుకు పూర్తిస్థాయిలో రంగంలోకి దిగుతారో లేకవ్యూహాత్మక వెనకడుగు వేస్తారో వేచి చూడాల్సిందే.

# క్షేత్రస్థాయి ముచ్చెమటలు

**విజయవాడ అక్టోబరు 17 పెన్ పవర్:** లోకల్ పోల్స్ విషయంలో వైఎస్సార్‌సీపీ మునుపెన్నడూ లేనంత నీరసంగా కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వంపై తాము పెద్ద ఎత్తున పోరాడుతున్నామని రంగుల కలలు కంటున్న వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డికి, క్షేత్రస్థాయి రాజకీయ వాస్తవాలు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. మున్సిపల్ ఎన్నికల రేసులో మేయర్, మున్సిపల్ చైర్మన్ పీఠాలపై కేవలం ఎమ్మెల్యే స్థాయి లేదా అంతకంటే బలమైనముఖ్యనేతలనే అభ్యర్థులుగా నిలబెట్టాలని జగన్ ప్రణాళికలు రచించారు. కూటమిని ఢీకొట్టేందుకు సీనియర్లు, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా ఇంఛార్జ్‌లు అంతా ప్రత్యక్ష బరిలోకి దిగాలని తీవ్ర ఒత్తిడి తెచ్చారు.అయితే ఆయన పిలుపును ఖాతరు చేస్తూ పోటీకి సిద్ధమని ఒక్కరంటే ఒక్క ముఖ్యనేత కూడా ముందుకు రాకపోవడం పార్టీ అగ్రనాయకత్వానికి కోలుకోలేని షాక్ ఇచ్చింది.రాజకీయంగా కీలకమైన ప్రకాశంజిల్లా కేంద్రం ఒంగోలు కార్పొరేషన్‌లో బరిలో నిలిచేందుకు వైఎస్సార్‌సీపీ నుంచి ఒక్కటంటే ఒక్క ముఖ్యనేత కూడా ముందుకు రాలేదంటే ఆ పార్టీ పరిస్థితి ఎంతలా దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. అధికారంపోయాక కూటమి ధాటికి తట్టుకుని నిలబడే ధైర్యం లేక, పోరులో ఓటమి ఖాయమని ముందే తెలిపోవడంతో సీనియర్లంతా చేతులెత్తేశారు. నగరాల్లోనూ, మున్సిపాలిటీల్లోనూ ఆర్థికంగా, రాజకీయంగా అండగానిలవాల్సిన అగ్రనేతలు కాడిపడేయడంతో, వేరే దారి లేక వైఎస్సార్‌సీపీ ఆఖరి నిమిషంలో ద్వితీయ శ్రేణి నాయకులను, అనామక అభ్యర్థులను ఖరారు చేస్తూ జాబితాలు విడుదల చేయాల్సిన దుస్థితిఏర్పడింది.ఇక కనీసం సామాజిక సమీకరణాలైనా కాపాడుకున్నామని చెప్పుకోవడానికి, బీసీలకు, బలహీన వర్గాలకు అవకాశాలు కల్పించామంటూ వైఎస్సార్‌సీపీ నేతలు సరికొత్త కప్పిపుచ్చే రాజకీయంమొదలుపెట్టారు. ప్రధాన నేతలు పోటీ నుంచి తప్పుకోవడంతో ఖాళీ అయిన స్థానాలను భర్తీ చేసేందుకు బలవంతంగా కొంతమంది ద్వితీయ శ్రేణి నేతలకు బి–ఫారాలు పంపిణీ చేస్తున్నారు. కానీ, నామినేషన్లఘట్టం ముగిసే వరకు ఈ అభ్యర్థులు నిజంగానే పోటీలో ఉంటారా లేక ఉపసంహరణ బాట పట్టి బరి నుంచి తప్పుకుంటారా అనేది పెద్ద ప్రశ్నార్థకంగా మారింది. ఒకవేళ చివరిదాకా బరిలో నిలిచినా, అదికేవలం నామ్‌కే వాస్తే పోరాటమే తప్ప క్షేత్రస్థాయిలో గట్టిగా ప్రచారం చేసే శక్తి గానీ, వనరులుగానీ ఆ ద్వితీయ శ్రేణి నేతలకు లేవు.అధికారంలో ఉన్నప్పుడు విర్రవీగి, సొంత పార్టీ కేడర్‌ను గానీ, ద్వితీయ శ్రేణి నాయకులను గానీ కనీసం పట్టించుకోని జగన్ రెడ్డి విధానాలే ఇప్పుడు ఆ పార్టీకి శరాఘాతంగా మారాయి. మేయర్, చైర్మన్ సీట్లకే గతిలేక అభ్యర్థుల కోసం వెతుక్కునే దుస్థితి దాపురిస్తే, వార్డు స్థాయిలో డివిజన్లలో కూటమి అభ్యర్థులను ఎదుర్కొనే ధైర్యం ఎవరికి ఉంటుంది? యుద్ధరంగానికి సైన్యాన్ని నడిపించాల్సిన సేనాధిపతులే పారిపోతుంటే, ద్వితీయ శ్రేణి నేతలను బలిపశువులను చేస్తూ వైఎస్సార్‌సీపీ ఆడుతున్న రాజకీయం ఆ పార్టీకి మరింత ఇబ్బందికరమే.

ఆర్థిక సాయం చేస్తేనే పోటీ అంటున్న భాగ్యలక్ష్మి

ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి అనుసరిస్తున్న అస్తవ్యస్త వ్యూహాలు ఆ పార్టీని పాతాళానికి తొక్కేస్తున్నాయి. ముఖ్యంగా కృష్ణా జిల్లా రాజకీయ కేంద్రమైనవిజయవాడ నగరపాలక సంస్థ మేయర్ పీఠం కోసం అభ్యర్థుల ఎంపిక ఆయన పలుకుబడి ఎంతటిదో తేల్చేసింది. ప్రధాన నేతలంతా పోటీకి ముఖం చాటేయడంతో చివరికి దిక్కుతోచక మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి పేరును బలవంతంగా తెరపైకి తెచ్చారు. అయితే నామినేషన్ల పర్వం ముంచుకొస్తున్న తరుణంలో ఆమె చేతులెత్తేయడంతో ఇప్పుడు వైఎస్సార్‌సీపీ పెద్దలకు షాక్ తగిలినట్లయింది.నిజానికివిజయవాడ మేయర్ స్థానానికి రాయన భాగ్యలక్ష్మిని బరిలో దించే ఆలోచనే పార్టీ అధిష్టానానికి లేదు. ఎందుకంటే ఎన్నికల్లో కోట్లు ఖర్చు పెట్టి పోరాడే సత్తా, ఓట్లు రాల్చే బలమైన నాయకత్వం ఆమె వద్దలేదనే అంచనాతో పెద్దలంతా వేరే పేర్లపై కసరత్తు చేశారు. తొలుత యువనేత దేవినేని అవినాష్‌ను లేదా ఆయన సతీమణిని మేయర్ అభ్యర్థిగా నిలబెట్టాలని తీవ్రంగా ప్రయత్నించారు. ఆ తర్వాత మాజీమేయర్ కేశినేని శ్వేతను కూడా సంప్రదించి బతిమలాడి చూశారు. అంతిమంగా తానే జగన్ రెడ్డికి స్వయంగా బంధువునంటూ పార్టీలో సర్వస్వం తానేనని చెలామణి అయ్యే దేవినేని గౌతం రెడ్డి... తనకుమార్తెను బరిలో దించాలని పార్టీ నేతలు తీవ్రంగా ఒత్తిడి తెచ్చారు. కానీ ఎవరూ ముందుకు రాలేదు.ఉమ్మడి కృష్ణా జిల్లాలోని వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతలందరి గడప తొక్కి, కాళ్లబేరానికి వచ్చి మేయర్‌రేసులో నిలబడాలని కోరినా ఒక్కరంటే ఒక్కరు కూడా ముందుకు రాలేదు. అధికారంలో ఉన్నప్పుడు కేడర్‌ను పట్టించుకోకపోవడం, ఇప్పుడు ఎన్నికల్లో కూటమి ప్రభంజనాన్ని తట్టుకుని నిలబడే ధైర్యం లేకఅందరూ చేతులెత్తేశారు. నేతలందరూ దండం పెట్టి పారిపోవడంతో చేసేది లేక, చివరికి ఎవరికైతే ఇవ్వకూడదు అనుకున్నారో అదే రాయన భాగ్యలక్ష్మిని పార్టీ అగ్రనేతలు బతిమలాడి మరీ అభ్యర్థిగాప్రకటించారు.అయితే ఈ నాటకీయ పరిణామాల మధ్య రాయన భాగ్యలక్ష్మి అకస్మాత్తుగా ప్లేట్ మార్చి వైఎస్సార్‌సీపీ పెద్దలకు షాక్ ఇచ్చారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి తన వద్ద చిల్లిగవ్వ లేదని, మీరే అన్నీసర్ది, డబ్బులు ముందుగా ఇస్తేనే తాను నామినేషన్ వేస్తానని తెగేసి చెప్పినట్లు సమాచారం. తనను అభ్యర్థిగా ఖరారు చేసి చేతులు దులుపుకోవాలని చూస్తే కుదరదని, ప్రచార ఖర్చులన్నీ పార్టీయేభరించాలని ఆమె నేతలను డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అభ్యర్థులు కరవై దిక్కుతోచని స్థితిలో ఉన్న వైఎస్సార్‌సీపీ అధినాయకత్వానికి, భాగ్యలక్ష్మి చేసిన ఈ డబ్బుల డిమాండ్ మింగుడుపడకవిజయవాడ రాజకీయం రంజుగా మారింది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# రెండో రోజూ రణరంగమే.. రాయలసీమలో టెన్షన్.. టెన్షన్



మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో పలు చోట్ల ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా రాయలసీమలోని కడప, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య ఘర్షణలు శాంతిభద్రతల సమస్యగా మారాయి. నామినేషన్ వేసేందుకు రెండు పార్టీల వారు ఒకేసారి వస్తుండటం, ఒకరిని చూసి మరొకరు రెచ్చిపోతూ సవాళ్లు, ప్రతి సవాళ్లు చేసుకుంటూ దాడులకు దిగుతున్నారు. ఈ నేపథ్యంలో పలుచోట్ల పరిస్థితులను అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించాల్సిన పరిస్థితులు దాపురించాయని అంటున్నారు. ప్రధానంగా రాయలసీమలోని కొన్ని మున్సిపాలిటీలను వ్యక్తిగత ప్రతిష్టకు తీసుకోవడంతో ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు గొడవలకు సిద్ధమవుతున్నారని అంటున్నారు. మున్సిపల్ ఎన్నికలకు రేపటి వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ప్రక్రియ ప్రారంభమైన తొలిరోజే పుంగనూరు, రాయచోటిలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి. రెండో రోజు ఆ రెండు పట్టణాల్లో పరిస్థితి అదుపులోకి రాలేదు. ఇక వీటికి అదనంగా కడప, పులివెందుల, రాజంపేట తదితర చోట్ల కూడా ఘర్షణ వాతావరణం నెలకొంది. నామినేషన్లు వేయాల్సిన అభ్యర్థులు తమతో తుపాకులు, బులెట్లు, ఖాళీ సీసాలు, రాళ్లు తీసుకువస్తున్నారు. దీంతో ముందస్తు వ్యూహంతోనే దాడులకు సిద్ధమయ్యే నామినేషన్ కేంద్రాలకు వస్తున్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. కడపలో ఓ అభ్యర్థి అనుచరుల నుంచి తుపాకీ, బులెట్లను స్వాధీనం చేసుకున్నారనే వార్తలు హీట్ పుట్టిస్తున్నాయి.

వైసీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో ఉద్రిక్తలు ఎక్కువగా నమోదు అవుతున్నాయని అంటున్నారు. అదేసమయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి సొంత జిల్లాలోనూ వైసీపీ గట్టిగా పోరాడుతుండటంతో గొడవలు జరుగుతున్నాయని అంటున్నారు. అధికార పార్టీకి దీటుగా ఎక్కడా తగ్గకూడదు అన్నట్లు వైసీపీ కూడా పోరాడుతోందని అంటున్నారు. దీంతో పలుచోట్ల ఘర్షణలు జరుగుతున్నాయని చెబుతున్నారు. శనివారం కడప, రాజంపేట, పులివెందుల, తిరుపతి, దర్శి నియోజకవర్గాల్లో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఇక నామినేషన్ కార్యక్రమాల్లో ఇతర ప్రాంతాలకు చెందిన రౌడీలు వస్తున్నారని జరుగుతున్న ప్రచారం మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఈ విషయంలో అధికార, విపక్ష పార్టీల నేతలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారు. మరోవైపు పోలీసులు కూడా హై అలర్ట్ లో ఉన్నారు. కడపలో పరిస్థితులను అదుపులోకి తెచ్చేందుకు టియర్ గ్యాస్ ప్రయోగించారు. పులివెందులలో కూడా ఆందోళనకారులపై లాఠీచార్జి చేసిన పోలీసులు, పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో గాల్లోకి కాల్పులు జరిపారు. దర్శిలోనూ ఇదే పరిస్థితి నెలకుందని వార్తలు అందుతున్నాయి.

# వెంకీ కుటుంబం.. నాగవంశీకి ఇది పెద్ద టాస్కే..



వెంకటేష్, త్రివిక్రమ్.. ఆ ఇద్దరి కాంబినేషన్ లో సినిమా అంటే ప్రేక్షకుల్లో కామన్ గానే అంచనాలు ఉంటాయి. అందులోనూ ఫ్యామిలీ స్టోరీతో వస్తున్నారంటే ఇంట్రెస్ట్ మరింత పెరుగుతుంది. కానీ ఆదర్శ కుటుంబం విషయంలో ఇప్పుడు పరిస్థితి కొంచెం మారింది. విడుదల వాయిదాలు, పాటలతో ఆశించిన స్థాయిలో బజ్ రాకపోవడంతో సినిమాపై మొదట్లో ఉన్న హైప్ మళ్లీ పెంచాల్సిన అవసరం ఏర్పడింది.

దీంతో ఇప్పుడు నాగవంశీ ఆశలన్నీ ట్రైలర్ పైనే ఉన్నాయి. అంతే కాదు, ప్రేక్షకుల్లో మళ్లీ అంచనాలు పెంచడం ఆయన ముందున్న పెద్ద టాస్క్ గా మారింది. మొదట ఆ సినిమాను అక్టోబర్ 2న విడుదల చేయాలని భావించారు. ఆ తర్వాత అక్టోబర్ 9కి వాయిదా వేశారు. కానీ ఆ తేదీకి కూడా సినిమా రిలీజ్ కాలేదు. సినిమా చుట్టూ ఉన్న హైప్ పై ఆ ఎఫెక్ట్ పడింది. మరోవైపు పాటలు కూడా ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోవడంతో సినిమాపై బజ్ పెంచాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పుడు అక్టోబర్ 30న సినిమాను రిలీజ్ చేయాలని మూవీ టీమ్ భావిస్తోంది. శనివారం జరిగిన జైలర్ 2 ప్రెస్ మీట్ లో నిర్మాత నాగవంశీ ఆ విషయంపై క్లారిటీ ఇచ్చారు. అయితే ఈసారి విడుదల తేదీని తానే అఫీషియల్ గా ప్రకటించనని చెప్పారు. ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడటంతో మళ్లీ తనే తేదీ చెబితే ప్రేక్షకులు నమ్మరంటూ సరదాగా అన్నారు. ఈసారి హీరో వెంకటేష్ తోనే విడుదల తేదీని ప్రకటించాలని డిసైడ్ అయ్యారు. ప్రస్తుతం వెంకటేష్ ఊటీలో షూటింగ్ లో ఉన్నారు. ఆయన హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత అక్టోబర్ 21 లేదా 22న ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదే స్టేజ్ పై వెంకటేష్ సినిమా విడుదల తేదీని ఆఫీషియల్ గా అనౌన్స్ చేయనున్నారు. ఆ ఈవెంట్ సినిమాకు కొత్త ఊపు తీసుకొచ్చేలా ఉండాలని మేకర్స్ భావిస్తున్నారు. అయితే కేవలం విడుదల తేదీ ప్రకటించినంత మాత్రాన సినిమాపై బజ్ పెరగదు. ప్రేక్షకులను ఆకట్టుకునే ట్రైలర్ రావడం ఇప్పుడు చాలా ముఖ్యం. స్టోరీలోని స్పెషాలిటీ, వెంకటేష్ రోల్, త్రివిక్రమ్ మార్క్ ఎంటర్టైన్మెంట్ ట్రైలర్ లో స్ట్రాంగ్ గా కనిపిస్తే ప్రేక్షకుల్లో మళ్లీ హైప్ పెరిగే అవకాశం ఉంటుంది. పాటలతో రాని దాన్ని ట్రైలర్ ద్వారా తీసుకురావాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఈ కాంబినేషన్‌పై ఉన్న అంచనాలకు తగ్గ కంటెంట్ ఉందనే నమ్మకాన్ని కలిగించాలి. సినిమా విడుదలకు ఇంకా కొద్ది రోజులే ఉండటంతో ప్రమోషన్స్ కు ఎక్కువ సమయం లేదు. ట్రైలర్ విడుదల తర్వాత ప్రమోషనల్ ఈవెంట్స్ ఎలా నిర్వహిస్తారు, ఆడియన్స్ లో ఎలా హైప్ పెంచుతారనేది మెయిన్. వెంకటేష్, త్రివిక్రమ్ కాంబోపై ఉన్న ఇంట్రెస్ట్ మళ్లీ పెంచగలిగితే సినిమాకు మంచి ఊపు వచ్చే అవకాశం ఉంటుంది. ఇప్పుడు ఆదర్శ కుటుంబం విషయంలో నాగవంశీకి రిలీజ్ డేట్ ప్రకటించడం కంటే, ప్రేక్షకుల్లో తగ్గిన ఆసక్తిని పెంచడమే పెద్ద టాస్క్. ట్రైలర్ తో ఆడియన్స్‌ను ఆకట్టుకుని సినిమాను అక్టోబర్ 30 విడుదలకు రెడీ చేయడం మేకర్స్ ముందున్న అసలు సవాల్.

# జనసేన సత్తా చాటాలన్నా... స్ట్రైక్ రేట్ భయపెడుతుందా?




: ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ మరోసారి తన సత్తా చాటాలని చూస్తోంది. అయితే, గత సార్వత్రిక ఎన్నికల్లో సాధించిన తిరుగులేని విజయం తర్వాత, ఈ ఎన్నికల్లో స్ట్రయిక్ రేట్ ను కాపాడుకోవడం జనసేనకు ఒక పెద్ద సవాల్‌గా మారింది. గత శాసనసభ ఎన్నికల్లో 21 అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంటు నియోజకవర్గాల్లో పోటీ చేసి అన్నింటిలో గెలిచింది. ఇప్పుడు నాలుగు కార్పొరేషన్ లో మేయర్ పదవులు, 21 మున్సిపాలిటీల్లో పోటీకి సిద్ధమయింది. అయితే శ్రీకాకుళం నుంచి ఇటు అన్ని ప్రాంతాల్లో తమకు ప్రాతినిధ్యం ఉండేలా సర్దుబాటు కు ఓకే చెప్పింది. పవన్ కల్యాణ్ తొలి నుంచి ఎక్కువ స్థానాల్లో పోటీ చేయడం కన్నా, పోటీ చేసే అన్ని స్థానాల్లో గెలవాలని భావిస్తున్నారు. కానీ జనసైనికుల వత్తిడితో మాత్రం కొన్ని ఎక్కువ స్థానాలనే తీసుకున్నారు. వాస్తవానికి జనసేనకు క్షేత్రస్థాయిలో పెద్దగా బలం లేదు. కేవలం పవన్ కల్యాణ్ ఇమేజ్, అభిమానుల ఓట్లు జనసేనకు కీలకం. మరొకవైపు సామాజికవర్గం ఓట్లు కూడా ఈసారి పడతాయా? అన్నది అనుమానమే.

**అనేక వ్యూహాలున్నా...**

స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన ఎదుర్కొంటున్న ప్రధాన టెన్షన్లు, వ్యూహాలు అనేకం ఉన్నాయి. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన 21 స్థానాల్లోనూ జనసేన విజయం సాధించి 100 శాతం స్ట్రయిక్ రేట్ నమోదు చేసింది.స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అదే స్థాయి ఫలితాలను పునరావృతం చేయాలనే ఒత్తిడి పార్టీపై ఉంది. ఒకవేళ స్ట్రయిక్ రేట్ తగ్గితే, ప్రత్యర్థుల నుంచి విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందనే ఆందోళన కనిపిస్తోంది. అలాగే 2029 శాసనసభ ఎన్నికల్లో సీట్లను ఈ రిజల్ట్ ను చూసి తగ్గించే అవకాశాలు కూడా ఉంటాయి. ఎక్కువ స్థానాల్లో పోటీ చేయడం కంటే, గెలిచే అవకాశం ఉన్న పరిమిత స్థానాలను ఎంచుకుని అక్కడ 100 శాతం విజయం సాధించడమే ముఖ్యమని పార్టీ నాయకత్వం భావిస్తోంది.

**మరోసారి సత్తా చాటాలని...**

తొలుత 40 శాతం వరకు సీట్లు ఆశించినప్పటికీ, గెలుపు గుర్రాలకే ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తోంది. జనసేన పార్టీ 6 కార్పొరేషన్లు, 26 మున్సిపాలిటీలను డిమాండ్ చేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే తాజా చర్చల ప్రకారం 4 కార్పొరేషన్లు, 21 మున్సిపాలిటీలకు జనసేన అంగీకరించిందని తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో ప్రజల్లో మంచి ఆదరణ, బలమైన క్యాడర్ ఉన్న అభ్యర్థులనే బరిలోకి దించేందుకు కసరత్తు చేసింది. అయితే జనసేన లీడర్లకు రిజల్ట్ టెన్షన్ పట్టుకుంది. అనేక చోట్ల టీడీపీ నేతల నుంచి అసంతృప్తి, అసహనాలు కనిపిస్తుండటం కొంత ఆందోళనకు దారితీస్తుంది. స్థానిక జనసేన ఎమ్మెల్యేలకు కూడా ఈ ఎన్నికలు సవాల్ గా మారాయి. స్థానిక నాయకత్వం పైనే గెలుపోటములు ఆధారపడి ఉన్నాయి. పవన్ కల్యాణ్ చరిష్మా కంటే ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక కీలకం అని చెబుతున్నారు. స్థానికంగా వారికి ప్రజల్లో ఉండే పలుకుబడితో పాటు జనంతో మమైకమయ్యే తీరు గెలుపోటములను ఖరారు చేస్తుంది. అందుకే జనసేనకు ఇప్పుడు రిజల్ట్ ఫీవర్ పట్టుకుందని చెప్పుకోవాలి.

# కూటమిలో సర్దుబాట్లు సరే.. ఓట్లు పడేది ఎలా?




ఆంధ్రప్రదేశ్ స్థానికసంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు కుదిరింది. అయితే ఓట్ల బదిలీ జరగడమే ఇప్పుడు మూడు పార్టీలను వణికిస్తున్న అంశం. నేతలు, నాయకత్వం చెప్పినట్లు చేసే పరిస్థితులు ఉన్నాయా? అంటే కొన్ని ప్రాంతాల్లోనే. ఎక్కువ ప్రాంతాల్లో కీలకమైన పదవిని ఇతరుల చేతుల్లో పెట్టేందుకు ఎవరూ ఇష్టపడరు. ఇష్టపడరు అనేకంటే ... ఒకసారి వారి చేతుల్లోకి పదవి వెళితే భవిష్యత్ లో తమకు ఈ పదవి దక్కదన్న అభిప్రాయం స్థానిక నేతల్లో వ్యక్తమవుతుంది. సర్దుబాట్లు సరే.. ఓట్లు పడేది ఎలా? అనేది కూటమి రాజకీయాల్లో, ముఖ్యంగా ఎన్నికల సమయంలో అగ్రనేతల నుంచి క్షేత్రస్థాయి కార్యకర్తల వరకు వేధించే ఒక ముఖ్యమైన ప్రశ్న. రాజకీయ కూటములలో అగ్రనాయకత్వం సీట్ల సర్దుబాట్లను ఒక కొలిక్కి తెచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఓట్లు ఒక పార్టీ నుంచి మరో పార్టీకి బదిలీ అవ్వడం అనేది అంత సులువుగా సాగదు. ఈ నేపథ్యంలో కూటమి ఎదుర్కొనే అంతర్మథనం మరియు సవాళ్లు అనేకం ఉన్నాయి.

**క్షేత్రస్థాయిలో ఓట్ల బదిలీ సవాల్...**

నిన్నటి వరకు స్థానికంగా బద్ధశత్రువులుగా పోరాడిన రెండు పార్టీల కార్యకర్తలు, పైస్థాయిలో పొత్తు కుదిరిన వెంటనే కలిసి పనిచేయడం మానసికంగా కష్టమవుతుంది. ఒక పార్టీకి సాంప్రదాయకంగా పడే ఓట్లు, పొత్తులో భాగంగా ఆ స్థానం మరో మిత్రపక్షానికి కేటాయించినప్పుడు, ఆ అభ్యర్థికి పూర్తిగా బదిలీ అవుతాయా లేదా అనే సందేహం ఉంటుంది. కూటమి సర్దుబాటులో భాగంగా తమకు దక్కాల్సిన సీటు మిత్రపక్షానికి వెళ్లడంతో, అప్పటివరకు కష్టపడ్డ స్థానిక నాయకులు స్వతంత్రులుగా బరిలోకి దిగడం లేదా లోపాయికారీగా వ్యతిరేకంగా పనిచేయడం జరుగుతుంది. తమ సొంత పార్టీ గుర్తు ఎన్నికల బరిలో లేకపోవడంతో ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో చురుగ్గా పాల్గొనకుండా డీలా పడిపోయే ప్రమాదం ఉంది. ఎన్నికల ప్రచారానికి తక్కువ సమయం ఉండటంతో అగ్రనేతలు కూడా అక్కడకు నేరుగా వచ్చి ప్రచారం చేసే వీలుండదు. అందువల్ల స్థానిక నేతలు ఎవరికి ఇష్టమొచ్చినట్లు వారు ఎన్నికల్లో వ్యవహరిస్తారు.

**ఉమ్మడి ఓటు బ్యాంకు...**

పార్టీలు కేవలం అధికారం లేదా సీట్ల కోసం చేతులు కలిపినప్పుడు, వారి ఉమ్మడి ఓటు బ్యాంకు ఆ నిర్ణయాన్ని పూర్తిగా అంగీకరించకపోవచ్చు. మేధావులు, తటస్థ ఓటర్లు ఇలాంటి సమయాల్లో ప్రత్యామ్నాయాల వైపు చూసే అవకాశం ఉంటుంది. ఈ అంతర్మథనం నుంచి బయటపడి ఓట్లు గుంపగుత్తగా పడేలా చేయడానికి కూటమి అగ్రనాయకత్వం కొన్ని కీలక చర్యలు తీసుకోవాల్సి ఉంది. నియోజకవర్గాల వారీగా అన్ని భాగస్వామ్య పార్టీల ముఖ్య నేతలతో ఉమ్మడి కమిటీలను ఏర్పాటు చేసి, క్షేత్రస్థాయిలో సమన్వయం కుదర్చడం. అగ్రనేతలందరూ ఒకే వేదికపైకి వచ్చి, కార్యకర్తలకు స్పష్టమైన సందేశం ఇవ్వడం ద్వారా కిందిస్థాయిలో ఉన్న అపనమ్మకాలను తొలగించడం. టికెట్ దక్కని అసంతృప్త నేతలకు భవిష్యత్తులో అధికారంలోకి వచ్చాక నామినేటెడ్ పదవులు లేదా ఇతర అవకాశాలు ఇస్తామని అధిష్టానం హామీ ఇచ్చి బుజ్జగించడం. అందుకే, సీట్ల సర్దుబాట్లు పూర్తి కావడం అనేది కేవలం మొదటి అడుగు మాత్రమే; క్షేత్రస్థాయిలో పార్టీల క్యాడర్‌ను ఏకతాటిపైకి తెచ్చి ఓట్లను రాబట్టడమే కూటమి విజయానికి అసలైన పరీక్ష. మొత్తం మీద తొలి అడుగు ఓకే. కానీ మలి అడుగు మాత్రం సవాల్ తో కూడుకున్నదే.

# భారత్ లోకి రోహింగ్యాలు ఎలా ప్రవేశిస్తున్నారు...బీజేపీ ఎంపీ విశ్లేషణ !




రోహింగ్యాలు భారత్ లోకి ఎలా ప్రవేశిస్తున్నారు, వారికి భారత్ లో ఓటు హక్కు, ఆధార్ కార్డులు రేషన్ కార్డులు అన్ని రకాల సదుపాయాలు సౌకర్యాలు ఎందుకు లభిస్తున్నాయి, ఢిల్లీ ఉద్యమాలకు మద్దతు ఇస్తున్న పొరుగు దేశానికి ఓటు బ్యాంక్ కి మధ్య అతి పెద్ద లింక్ ఏమిటి అంటే మ్యాటర్ చాలానే ఉందని అంటున్నారు బీజేపీకి చెందిన చేవేళ్ళ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి. ఆయన బంగ్లా దేశ్ నుంచి రోహింగ్యాలు ఎలా భారత్ లోకి సులువుగా ప్రవేశిస్తున్నారో ఒక వీడియో చేసి మరీ జనాలకు చక్కగా వివరించి విశ్లేషించారు. ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నుంచి ఇప్పటి వరకూ బంగ్లాదేశ్ కి భారత్ కి మధ్య అంతర్జాతీయ సరిహద్దుకు ఫెన్సింగ్ లేదని కొండా విశ్వేశ్వరరెడ్డి గుర్తు చేశారు

**ఫెన్సింగ్ లేని దేశ సరిహద్దు :**

దీని వల్లనే చాలా సులువుగా రోహింగ్యాలు భారత్ లోకి ప్రవేశిస్తున్నారు అని ఆయన చెప్పారు. ఇక ఈ సరిహద్దులు కూడా గందరగోళంగా ఉన్నాయని ఆయన అన్నారు గతంలో చూస్తే కనుక ఇండియా కొంత భాగం బంగ్లాదేశ్ లో అలాగే ఇండియాలో కొంత భాగం బంగ్లాదేశ్ లో ఉందని అన్నారు. అంతే కాకుండా ఒకటి రెండు కాకుండా బంగ్లాదేశ్ లో ఇండియా ఎంక్లేవ్స్ 111 ఉన్నాయని చెప్పారు. అలాగే ఇండియాలో బంగ్లాదేశ్ ఎంక్లేవ్స్ 51 దాకా ఉన్నాయని వివరించారు. సెకండ్ ఆర్డర్ ఎంక్లేవ్ అని, థర్డ్ ఆర్డర్ ఎంక్లేవ్ అని బంగ్లాదేశ్ లో ఉన్నాయని ఇది ఆశ్చర్యకరమని అన్నారు. . పిచ్చి పిచ్చి విభజనగా ఇండియాలో బంగ్లాదేశ్ ఉంది, బంగ్లాదేశ్ లో ఇండియా ఉంది. ఇలా చూసుకుంటే పోతే ఇలాంటి పిచ్చితనం కానీ ఈ తరహా బోర్డర్ కానీ ప్రపంచంలో ఎక్కడా ఉండదని బీజేపీ ఎంపీ అంటున్నారు. దీంతో బోర్డర్ అన్నది లేకుండా యధేచ్చగా ఎవరిష్టం వచ్చినట్లుగా వారు వస్తూ పోతున్నారని ఆయన చెప్పుకొచ్చారు. ఇది సరైనదా అని ఆయన ప్రశ్నించారు

**అసలేమిటి ఇదంతా :**

ఇలా ఉంటే ప్రజలకు పాలన ఎలా జరుగుతుంది, సౌకర్యాలు ఎలా అందుతాయని ఆయన ప్రశ్నించారు. దీనికి ఫుల్ స్టాప్ పెడుతూ 2015లో మోడీ అధికారం చేపట్టాక ఇండియా బంగ్లాదేశ్ ల్యాండ్ బోర్డర్ అగ్రిమెంట్ అయింది, వందవ రాజ్యాంగ సవరణ కూడా అయింది అని ఆయన చెప్పారు. దీంతో అంతర్జాతీయ బోర్డర్ స్పష్టంగా విభజించబడింది అని ఆయన చెప్పారు. అయితే ఈ చట్టం మాత్రం ఇప్పటిదాకా అమలు కాలేదు, దానికి కారణం పశ్చిమ బెంగాల్ లో తృణమూల్ కాంగ్రెస్ అధికారంలో ఉండడం వల్ల వీలు కాలేదని అన్నారు. ఇపుడు బీజేపీ ప్రభుత్వం పశ్చిమ బెంగాల్ లో అధికారంలో ఉంది కాబట్టి అంతర్జాతీయ బోర్డర్ కి కంచె వేసే పనులు చురుగ్గా సాగుతున్నాయని అన్నారు.

**బంగ్లా మద్దతు వెనక :**

గడచిన కాలమంతా బంగ్లాదేశ్ నుంచి రోహింగ్యాలు భారత్ లోకి సులువుగా ప్రవేశించి తిష్ట వేశారు. పశ్చిమ బెంగాల్ లో ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు అయింది. దాంతో వారి వలసలకు చెక్ పడింది. సర్ ప్రక్రియతో వారందరి ఓట్లు కూడా లేకుండా తీసేశారు. దాంతోనే ఇపుడు రోహింగ్యాలు తమ సొంత దేశానికి వెళ్ళాల్సిన అనివార్యత ఏర్పడింది. వారికి అక్కడ ఉపాధి లేక ఇక్కడ అవకాశం లేక ఇబ్బందుల్లో ఉన్నారు. అందుకే ఇపుడు ఓటు చోరీ అని ఉద్యమిస్తున్న వారికి బంగ్లాదేశ్ లో ఇలాంటి వారంతా మద్దతు తెలుపుతున్నారని అంటున్నారు, భారత్ లో నీట్ పరీక్షలకు వారికి సంబంధం ఏమిటని ఆయన నిలదీశారు. ఈ నిరసనల వెనక ఉన్న అసలు విషయాలను తెలుసుకోవాలని, ప్రజలు అంతా ఈ సంగతికి గుర్తించాలని కొండా విశ్వేశ్వర రెడ్డి కోరారు.

## సంభాషణే సమాధానం!

దేశ రాజధానిలో 'కాక్రోచ్' నిరసనకారులు శుక్రవారం మళ్లీ వీధుల్లోకొచ్చారు. ఈ ఆందోళనలు ఎటు వెళ్తున్నాయి, అసమ్మతి గళాలను అణచివేయడానికే పరిమితమైన ప్రభుత్వ ప్రతిస్పందన, కనీసం నియంత్రిత వాతావరణంలోనైనా భిన్నాభిప్రాయం వ్యక్తం చేసే స్వేచ్ఛను అనుమతించే దిశగా మారుతుందా? అనే ప్రశ్నలు మరింత పెరిగాయి. ప్రవేశ పరీక్షల అక్రమాలు, ప్రశ్నపత్రాల లీకేజీలపై నిరసనగా మొదలైన యువత ఆగ్రహం, ఇప్పుడు ఎన్నికల సంస్కరణల తొలి అడుగుగా సీఈసీ జ్ఞానేష్ కుమార్ తొలగింపును కోరే స్థాయికి, ఆపై నిరసన తెలిపే ప్రాథమిక హక్కుపైనే విస్తృత పోరాటంగా మారింది. జంతర్ మంతర్ వద్ద నిరసనలను పోలీసులు డీనోటిఫై చేయడం, తర్వాత అక్కడికి వెళ్లిన సీజేపీ నేతలు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను ఐదు రోజుల న్యాయ కస్టడీకి పంపడంతో ఈ మార్పు స్పష్టమైంది. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వారిని వెంటనే విడుదల చేయాలని కోరి, శాంతియుత నిరసనకు స్థలం కుంచించుకుపోతోందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రశ్నపత్రాల లీకేజీలే ప్రధాన కారణమైనప్పుడు ప్రభుత్వం నిరసనకారులతో మాట్లాడింది, చివరికి విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. కానీ ఇప్పుడు కనిపిస్తున్న శత్రుభావం, నిరసనకారులతో చర్చకు బదులు గొంతు నొక్కే విచిత్ర పద్ధతులకు దారితీసిందన్న విమర్శ ఉంది. అక్టోబర్ 10, 11 తేదీల్లో జరిగిన భారీ నిర్బంధాలు, మెట్రో స్టేషన్ల మూసివేత, రాకపోకల నియంత్రణ, నిరసన వేదికలను ప్రజలకు అందకుండా చేయడం కోసం బలగాలు జర్నలిస్టులను కూడా వదలకుండా వ్యవహరించిన తీరు, ఒక రకమైన "ముట్టడి మనస్తత్వాన్ని" సూచిస్తున్నాయని విమర్శలొచ్చాయి. ఈ సందర్భంలో ప్రపంచంలో నిరసనలకు ప్రభుత్వాల ప్రతిస్పందనలు వేర్వేరుగా ఉంటాయి; ఫ్రాన్స్‌లో దేశవ్యాప్త విద్యార్థి నిరసనలు జరుగుతున్నప్పుడు, అసమ్మతి వ్యక్తం చేసే స్థలాన్ని తెరిచి ఉంచుతూనే, నిరసనలతో తరచూ ముడిపడే అల్లర్ల వంటి అతిక్రమణలను అణచివేసిన దృశ్యాలు చూశాం. భారత్‌లోనూ పోలీసు అతిక్రమణలు లేకపోలేదు. నిరసనలను అణచే బలాన్ని ప్రదర్శించే సందర్భాలూ పునరావృతమవుతున్నాయి.

ఈ పరిణామాల మధ్య ప్రతిపక్షాలు రంగంలోకి దిగడం, యువత ఆగ్రహాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవడం వాటి ప్రజాస్వామ్య హక్కే. కానీ అదే సమయంలో అధికారం చేజిక్కించుకునే ప్రయత్నంగా దాన్ని చూడటంతో పరిస్థితి ఒక రాజకీయ అగ్నిగుండంగా కనిపిస్తోంది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ నెల 12న ఎస్ఐఆర్‌ను సవాలు చేస్తూ పిటిషన్ సమర్పించేందుకు సుప్రీంకోర్టు వైపు ర్యాలీగా వెళ్లారు; అంతకుముందు ప్రతిపక్ష ఎంపీలు ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం వైపు వెళ్తూ నిర్బంధానికి గురయ్యారు, ఆపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు తమ ఫిర్యాదులు సమర్పించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు గౌరవించాల్సిన, నిష్పాక్షిక మధ్యవర్తిగా భావించే న్యాయవ్యవస్థ అత్యున్నత స్థానంవైపు జనసమూహాన్ని నడిపించినందుకు ప్రతిపక్ష నేతను సుప్రీంకోర్టు మందలించడం చూశాం. ఎంతటి న్యాయమైన ఆందోళనైనా న్యాయస్థానంపట్ల గౌరవాన్ని, నిబంధనలను పాటించాల్సిందే. అదే సమయంలో, ప్రజాస్వామ్య చరిత్రలో భారత్‌కు మూలాధారమైన ఎన్నికల వ్యవస్థను అధికారంలో ఉన్నవారు తమ స్థానాన్ని బలోపేతం చేసుకోవడానికి వంచించారన్న ప్రాథమిక ఆరోపణను పరిశీలించాల్సిన బాధ్యత కూడా న్యాయస్థానాలపై ఉంది. ఎన్నికల సంఘం, అధికార పక్షం ఈ ఆరోపణలను తిరస్కరిస్తున్నాయి; ఎస్ఐఆర్ ప్రక్రియ నిబంధనల ప్రకారమే సాగిందని, ఈ ఏడాది మేలో సుప్రీంకోర్టు కూడా దాని చట్టబద్ధతను సమర్థించిందని నివేదికలు చెబుతున్నాయి. అయినప్పటికీ, సుప్రీంకోర్టు స్వయంగా సెప్టెంబర్ 22న ఢిల్లీలో నోటీసులు "దాదాపు యాంత్రికంగా" వెళ్తున్నాయని, "తార్కిక వ్యత్యాసం" గుర్తింపు ఆధారం స్పష్టం కావాలని చెప్పింది; ఈ విషయంలో విచారణ అక్టోబర్ 28న జరగనుంది. న్యాయస్థానం కూడా ప్రభుత్వం "ఈగను చంపడానికి సుత్తి వాడుతోంది" అని వ్యాఖ్యానించింది. రాజధానిని కోటగా మార్చడం, అన్ని రవాణా సాధనాలను నిలిపివేయడం, ట్రాఫిక్‌ను మళ్లించి నిరసన వేదికలను మూసివేయడం వంటి చర్యలు అంత తీవ్రమైనవన్నది ఆ విమర్శ. ఆసక్తికరంగా, కొన్ని బీజేపీయేతర ప్రభుత్వాలు కూడా నిరసనలను అణచే చర్యలు తీసుకున్నాయన్నది ఈ సమస్య ఒక్క పార్టీకే పరిమితం కాదని సూచిస్తుంది.

మరోవైపు, ప్రజాస్వామ్య మార్గంలో వచ్చిన పరివర్తనకు ఉదాహరణగా బంగ్లాదేశ్‌లో పౌర నిరసనలు పాలన మార్పునకు దారితీసిన సందర్భాన్ని చూపడం ప్రాథమిక ప్రజాస్వామ్య సూత్రాలకే విరుద్ధం. ప్రస్తుత వ్యవస్థను వ్యతిరేకించే పార్టీలు ఎన్నికలను బహిష్కరించడమో, పోటీ చేయకుండా నిషేధించడమో జరిగే దేశం, అంటే షేక్ హసీనా అవామీ లీగ్ తాజా ఎన్నికల్లో ఎదుర్కొన్న పరిస్థితి, "ప్రజాస్వామ్యానికి మాతృక"గా పరిగణించబడదు. ఇక్కడ అసలు ప్రశ్న సీఈసీ వెళ్లిపోతారా లేదా అన్నది కాదు; ఫారం 6ను మార్చి చట్టబద్ధమైన ఓటర్లకు కూడా జాబితాలో కొనసాగడం కష్టమయ్యేలా చేశారన్న ఆరోపణలకు (వీటిని సంఘం ఖండిస్తోంది) లోనైన ఆయన, సవరించిన జాబితాల చట్టబద్ధతపై తీవ్రమైన సందేహాలు కలిగేంతగా ప్రక్రియను కలుషితం చేశారా లేదా అన్నది సుప్రీంకోర్టు తేల్చాల్సిన విషయం. వెంటనే నిర్ణయించాల్సింది, సుప్రీంకోర్టు ఆమోదం పొందిన ఎస్ఐఆర్ ప్రక్రియను చట్టవిరుద్ధంగా పరిగణించాలా వద్దా అన్నది; జాబితాలను మరణించిన లేదా తాము దేశానికి చెందినవారమని రుజువు చేసుకోలేక అనర్హులైనవారిని మినహాయించి, మిగిలినవారందరినీ కలుపుకునే విధంగా నిర్వహించాలన్నది. పరిష్కారానికి కొన్ని మార్గాలు కనిపిస్తున్నాయి: ప్రభుత్వం 2018 సుప్రీంకోర్టు తీర్పు స్ఫూర్తితో నియంత్రణతో కూడిన నిరసన వేదికను, వీలైతే జంతర్ మంతర్‌నే, పునరుద్ధరించడం; పోలీసు అతిక్రమణలపై స్వతంత్ర, కాలపరిమితితో కూడిన విచారణ, జర్నలిస్టులకు రక్షణ; ప్రశ్నపత్రాల లీకేజీల సమయంలో చూపిన సంభాషణ మార్గానికి తిరిగి రావడం; ఎన్నికల సంఘం "తార్కిక వ్యత్యాసాల" ప్రమాణాలను బహిరంగపరచడం, స్వతంత్ర ఆడిట్‌కు అనుమతించడం. నిరసనకారులు, ప్రతిపక్షాలు కూడా శాంతిని, న్యాయస్థానాల పట్ల గౌరవాన్ని కాపాడుకోవాలి. యువత అసలు సమస్యలైన ఉద్యోగాలు, పరీక్షల పారదర్శకత, ఓటు హక్కు రాజకీయ కోలాహలంలో కనుమరుగవకుండా చూడాలి. అసమ్మతి గొంతు నొక్కడం కాదు, వినడం ప్రజాస్వామ్యం నిలబడే అసలైన మార్గం!

## పనికొచ్చే పలుకు



### సింహంలా నడిపిస్తే.. గొర్రెలూ గర్జిస్తాయి!

**సింహం నాయకత్వంలోని గొర్రెల సైన్యం, గొర్రె నాయకత్వంలోని సింహాలను ఓడించగలదని పెద్దల మాట. అంటే బలం కంటే దిశను చూపే నాయకత్వమే గెలుపును నిర్ణయిస్తుంది. కానీ రీల్స్‌లో "ఆరు వారాల్లో అద్భుతం" అంటూ గర్జించేవారిలో నిజమైన నాయకులెందరు? అందుకే ఎవరిని ఫాలో అవుతున్నామో చూసుకోవడమే, మన జీవితాన్ని నడిపే మొదటి నిర్ణయం.**

"రీల్స్‌లో గర్జించే అన్నల్ని చూశారా? వాళ్లు తమను తాము సింహాలనుకుంటారు, ఫాలోయర్లను గొర్రెల్లా చూస్తారు. కానీ అసలు సింహం గర్జనతో కాదు, దిశతో నాయకత్వం వహిస్తుంది. ఒక పాత సామెత ఉంది: సింహం నాయకత్వంలోని గొర్రెల సైన్యం, గొర్రె నాయకత్వంలోని సింహాల సైన్యాన్నీ ఓడించగలదని. అంటే సరైన నాయకత్వం సాధారణ వ్యక్తులనూ అసాధారణ శక్తిగా మార్చగలదు.

అదే టీమ్, అదే వనరులు, అదే తెలివున్నా, నాయకుడు మారితే ఫలితం మారుతుంది. ఎందుకంటే మంచి నాయకుడు ఎవరినీ బలవంతంగా మార్చడు; స్పష్టమైన లక్ష్యమిస్తాడు, నమ్మకం పెంచుతాడు, తప్పులను భయం లేకుండా అంగీకరించే వాతావరణం కల్పిస్తాడు. ఐపీఎల్‌లో చూడండి.. ఆటగాళ్లు వాళ్లే, కెప్టెన్ మారితే ఆట మారుతుంది.

ఇక్కడ అసలు ప్రశ్న: మీ జీవితంలో మిమ్మల్ని నడిపిస్తున్నది ఎవరు? ఉదయాన్నే ఫోన్ తీసి స్క్రోల్ చేస్తే, అల్గారిథమ్ మీ లీడర్ అవుతుంది. ఎవరో ఇన్‌ఫ్లుయెన్సర్ చెప్పింది గుడ్డిగా ఫాలో అయితే, "గొర్రె నాయకత్వంలోని సింహం" అవుతారు, మీ బలం ఉన్నా దిశ లేక వృథా అవుతుంది. అందుకే ముందు సెల్ఫ్-లీడర్‌షిప్ నేర్చుకోండి: మీ రోజును మీరే ప్లాన్ చేయండి, మీ ప్రాధాన్యాలను మీరే నిర్ణయించండి.

"ఈ ఒక్క డ్రింక్‌తో పొట్ట కరుగుతుంది!" అని చెప్పేవారికి గొర్రెల మందను నడిపించే ఆసక్తి ఉంటుంది, మీ ఆరోగ్యం మీద కాదు, మీ క్లిక్కుల మీద. నిజమైన లీడర్ "ఆరు వారాల్లో అద్భుతం" అని చెప్పడు; "ఆరు నెలలు ఓపిక పట్టు, రోజూ ఇది చేయి" అంటాడు. ఎందుకంటే ఆరోగ్యం, సంపద, నైపుణ్యం ఏదైనా షార్ట్‌కట్‌లో రావు. ఒక్క శరీర భాగం నుంచి మాత్రమే కొవ్వు కరిగించడం సాధ్యం కాదని నిపుణులు చెబుతారు. అందుకే ఎవరి మాటనైనా నమ్మేముందు, "ఈయన నాకు దిశ చూపుతున్నాడా? లేక నన్ను అమ్ముతున్నాడా?" అని అడగండి.

సరైన మార్గదర్శిని ఎంచుకోండి: మీరు ఫాలో అయ్యే వ్యక్తులు (మెంటార్, టీచర్, యూట్యూబర్) నిజమైన అనుభవం, నిలకడ ఉన్నవారేనా చూడండి.

ఇతరులను నడిపించడం నేర్చుకోండి: కుటుంబంలో, ఫ్రెండ్స్‌లో, ఆఫీసులో చిన్న బాధ్యత తీసుకోండి. నాయకత్వం పదవి కాదు, ప్రవర్తన.

మీ ఉదాహరణే మీ నాయకత్వం: రోజూ ముప్పై నిమిషాలు నడవండి; మీ చుట్టూ ఉన్నవారు గమనించి మారతారు.

చివరిగా ఒక మాట

గొర్రె అయినా సరైన సింహం వెనుక నడిస్తే గర్జించగలదు; సింహం అయినా తప్పు దారిలో నడిస్తే అడవిలో తప్పిపోతుంది. కాబట్టి లైక్స్ కోసం కాదు, లక్ష్యం కోసం నడిపించే వారినే ఫాలో అవ్వండి, చివరికి మీ జీవితానికి సింహం మీరే అవ్వండి.

## అమెరికా మధ్యంతర పోరు
# భారత్‌పై ప్రభావమెంత!?



అమెరికన్లు నవంబర్ 3న మధ్యంతర ఎన్నికల్లో ఓటు వేయడానికి మూడు వారాలకంటే తక్కువ సమయముంది. అధ్యక్షుడి నాలుగేళ్ల పదవీకాలం మధ్యలో జరిగే ఎన్నికలు కావడంతో వీటికి ఆ పేరు వచ్చింది; అధ్యక్షుడు స్వయంగా బరిలో ఉండరు. భారత ఎన్నికల సంఘంలా కాకుండా, అమెరికా ఫెడరల్ ఎన్నికల సహాయ కమిషన్ ఎన్నికలను నేరుగా నిర్వహించదు. ఓటరు నమోదు, పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రధానంగా రాష్ట్ర, స్థానిక అధికారుల చేతుల్లోనే ఉంటాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడి పాలనలో మిగిలిన రెండేళ్లను ప్రభావితం చేసే కాంగ్రెస్‌ను ఓటర్లు ఎన్నుకుంటారు: ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలకు, సెనేట్‌లో 35 స్థానాలకు, అలాగే 39 రాష్ట్రాల గవర్నర్ పదవులకు ఎన్నికలు జరుగుతాయి. సభలో రిపబ్లికన్లకు స్వల్ప మెజారిటీ ఉంది; నియంత్రణకు 218 స్థానాలు అవసరం. సెనేట్‌లో రిపబ్లికన్లకు 53 స్థానాల బలం ఉండటంతో, డెమొక్రాట్లు మెజారిటీ సాధించాలంటే కనీసం నాలుగు స్థానాలు నికరంగా గెలుచుకోవాలి. అంచనాలు డెమొక్రాట్లకు అనుకూలంగా మారుతున్నాయి. కుక్ పొలిటికల్ రిపోర్ట్ అంచనా ప్రకారం వారు సభలో 9 నుంచి 19 స్థానాలు అదనంగా గెలుచుకోవచ్చు. అక్టోబర్ 16న వెలువడిన విశ్లేషణలు కూడా రిపబ్లికన్లకు ఎదురుగాలి వీస్తోందని సూచించాయి. సెనేట్ పోరు మాత్రం హోరాహోరీగానే ఉంది.

సాధారణంగా మధ్యంతర ఎన్నికలు అధ్యక్షుడి పాలనపై ప్రజాభిప్రాయ సేకరణగా మారతాయి; అధికార పార్టీ స్థానాలు కోల్పోవడం ఆనవాయితీ. ఈసారి డొనాల్డ్ ట్రంప్ ఎన్నికలను తన చుట్టూ తిప్పుతున్నారు. "నేనే బ్యాలెట్‌పై ఉన్నానని భావించి ఓటేయండి" అన్న తరహాలో మద్దతుదారులను సమీకరిస్తూ పలు రాష్ట్రాల్లో ప్రచారం చేస్తున్నారు. తాజా సర్వేలు ఆయన ఆమోద రేటింగ్‌పై తీవ్ర అసంతృప్తిని సూచిస్తున్నాయి; కాంగ్రెస్ ఎన్నికల్లో డెమొక్రాట్లకు కూడా ఆధిక్యం కనిపిస్తోంది. ఇక భారతీయులకు ఆసక్తి కలిగించే పోరు ఒహాయో గవర్నర్ ఎన్నిక. వివేక్ రామస్వామి గెలిస్తే ఆ రాష్ట్ర తొలి భారతీయ-అమెరికన్ గవర్నర్ అవుతారు. అయితే, అక్టోబర్‌మధ్య నాటికి అందుబాటులో ఉన్న సర్వేల సగటులో డెమొక్రాట్ అభ్యర్థి అమీ ఆక్టన్ స్వల్ప ఆధిక్యంలో ఉన్నారు; కొన్ని వ్యక్తిగత సర్వేల్లో రామస్వామి ముందున్నప్పటికీ, పోటీ ఇంకా ముగిసిపోయినట్లేమీ లేదు. ఆయన భారతీయ మూలాలు, హిందూ విశ్వాసంపై ప్రచారంలోనూ ఆన్‌లైన్‌లోనూ విమర్శలు, ద్వేషపూరిత వ్యాఖ్యలు ఎదురయ్యాయి. హెచ్-1బీ వీసాలపై వివాదాల నేపథ్యంలో అమెరికా కుడిపక్షంలో పెరిగిన భారత వ్యతిరేక వాక్చాతుర్యం కూడా ఈ చర్చలో భాగమైంది.

ఈ ఎన్నికలను ప్రధానంగా ఐదు అంశాలు ప్రభావితం చేస్తున్నాయి: సుంకాలు, జీవన వ్యయంతో పెరిగిన ఆర్థిక ఒత్తిడి; అమెరికా-ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధ పరిణామాలు, వాటి ప్రభావంతో ఇంధన ధరల పెరుగుదల; వలసదారులపై కఠిన చర్యలు; మెడికెయిడ్ కోతలతో ఆరోగ్య సంరక్షణపై ఆందోళనలు; నగరాల్లో నేరాల అంశం. ప్రచారంతోపాటు ఓటింగ్ ప్రక్రియపైనా వివాదాలు నెలకొన్నాయి. పౌరసత్వ రుజువుతోనే ఓటరు నమోదు జరగాలన్న ప్రతిపాదనకు ట్రంప్ మద్దతు పలికారు. రిపబ్లికన్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ నియోజకవర్గాల మ్యాప్‌లను మధ్యంతర ఎన్నికలకు ముందే మార్చే ప్రయత్నాలపైనా విమర్శలు వచ్చాయి.

ఇదే సమయంలో మరో ముప్పు సాంకేతిక రూపంలో ముందుకొస్తోంది: ఆన్‌లైన్ మోసాలు. అక్టోబర్ 15న ఎఫ్‌బీఐ జారీ చేసిన హెచ్చరిక ప్రకారం, మోసగాళ్లు అభ్యర్థుల పేర్లు, ఫొటోలు, లోగోలను నకిలీ విరాళాల వసూళ్లకు, సరుకుల విక్రయాల పేరుతో మోసాలకు, వ్యక్తిగత సమాచారం దొంగిలించేందుకు ఉపయోగిస్తున్నారు. ఏఐ సాధనాలతో అభ్యర్థులు, ప్రభుత్వ సంస్థలు, విశ్వసనీయ వ్యక్తుల స్వరాలు, సందేశాలను కూడా అనుకరిస్తున్నారు. మరుసటి రోజు ఎఫ్‌బీఐ, సిసా కలిసి ఎన్నికల అధికారులు, అభ్యర్థులు, వారి సంస్థలను ఫిషింగ్, స్మిషింగ్ దాడులపై అప్రమత్తం చేశాయి. సాంకేతికత ఇంత అభివృద్ధి చెందినా మోసాలను ఎందుకు అరికట్టలేకపోతున్నామన్న ప్రశ్నకు ఇది ఉదాహరణ. ఏఐ మోసగాళ్లకు మరింత నమ్మదగిన నకిలీలను సృష్టించే సామర్థ్యాన్ని ఇచ్చింది. నమ్మకం, తొందర, భయాలను వారు ఆయుధాలుగా వాడుతున్నారు. దాడి చేసేవారు కొత్త పద్ధతులను వేగంగా అందిపుచ్చుకోవడం, అనేక దేశాలు, అధికార పరిధులు దాటిన నెట్‌వర్కులు దర్యాప్తును కష్టతరం చేస్తున్నాయి.

భారత్‌కు ఈ ఎన్నికలు కీలకమైన సమయంలో వస్తున్నాయి. 2025లో భారత వస్తువులపై అమెరికా సుంకాలు పెరిగి, ఆ తర్వాత 2026 ఫిబ్రవరిలో ప్రకటించిన వాణిజ్య ఒప్పంద చట్రం ప్రకారం పలు భారత ఉత్పత్తులపై పరస్పర సుంకాన్ని 18 శాతానికి తగ్గించే ప్రతిపాదన వచ్చింది. అయితే, మధ్యంతర ఒప్పందం ఇంకా తుది రూపం దాల్చలేదు. సెప్టెంబర్ 18న ట్రంప్ సంతకం చేసిన రష్యా ఆంక్షల చట్టం, రష్యా చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారాన్ని ఆయనకు కల్పించింది. అయితే, అక్టోబర్ 17న ట్రంప్ ఆ చట్టంలోని కీలక ఆంక్షలు, సుంకాల అమలును తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో భారత్‌కు తాత్కాలిక ఊరట లభించినా, భవిష్యత్తులో మళ్లీ ఒత్తిడి వచ్చే అవకాశాన్ని తోసిపుచ్చలేం.

కొత్త హెచ్-1బీ పిటిషన్లపై లక్ష డాలర్ల చెల్లింపు నిబంధన, పాకిస్తాన్ పట్ల వాషింగ్టన్ వైఖరి కూడా భారత్ ఆందోళనలను పెంచుతున్నాయి. వాషింగ్టన్‌లో 42 ఇంటర్వ్యూల ఆధారంగా తక్షశిలా ఇన్‌స్టిట్యూషన్ చేసిన అధ్యయనం, అమెరికా కాంగ్రెస్‌లో భారత్‌కు మద్దతు విస్తృతంగా ఉన్నప్పటికీ, దాన్ని కాపాడేందుకు రాజకీయంగా చురుకుగా నిలిచే వర్గాలు పరిమితమని సూచించింది. చౌక దిగుమతులు, నైపుణ్య వలసలు, రష్యా చమురు కొనుగోళ్లను వ్యతిరేకించే వర్గాలు సంఖ్యలో చిన్నవైనా, రాజకీయంగా చురుకుగా ఉంటాయి. భారత్‌కు మద్దతుదారులు ఉన్నప్పటికీ, భారత్‌కు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నందుకు అమెరికా రాజకీయ నాయకులు మూల్యం చెల్లించే పరిస్థితి లేదన్నది ఈ విశ్లేషణలోని కీలకాంశం. డెమొక్రాట్లు సభపై నియంత్రణ సాధిస్తే భారత విద్యార్థులు, కార్మికులకు సంబంధించిన వలస విధానాలపై కొంత ఉపశమనం కోసం ప్రయత్నించవచ్చు; ఇరాన్ యుద్ధాన్ని ముగించి ఇంధన ధరలను తగ్గించాలన్న ఒత్తిడినీ పెంచవచ్చు. అయితే, సుంకాలు లేదా రష్యాపై ఆంక్షలకు సంబంధించిన చట్టంలో మార్పులు వస్తాయని చెప్పలేం.

స్వదేశంలో రాజకీయంగా బలహీనపడిన అధ్యక్షుడు విదేశాంగ విధానంలో విజయాలను సాధించేందుకు ప్రయత్నించవచ్చు. అది భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి దారితీయవచ్చు లేదా కొత్త ఒత్తిళ్లకు కారణం కావచ్చు. అందుకే కాంగ్రెస్‌పై నియంత్రణ ఎవరి చేతుల్లోకి వెళ్లినా, భారత్-అమెరికా సంబంధాలపై శ్వేతసౌధం వైఖరి కీలకంగానే ఉంటుంది. ఇరు పార్టీలతో సంబంధాలను బలోపేతం చేసుకుంటూ, జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడం, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని నిలబెట్టుకోవడమే భారత్‌కు సరైన మార్గం! ■



కంఫర్ట్ ఒక మెత్తటి దుప్పటి లాంటిది; కాసేపు హాయిగా ఉంటుంది, కానీ అదే మిమ్మల్ని ఉన్నచోటే కట్టిపడేస్తుంది. సౌకర్యమే కావాలంటే సాధారణంగా ఉండిపోవచ్చు, అందులో తప్పేమీ లేదు. కానీ మీ జీవితం మీ చేతుల్లో ఉండాలంటే, రేపటి భద్రత మీ సొంతం కావాలంటే, మనసు వద్దన్నా సరే, ఈ రోజు చేయాల్సిన పని ఈ రోజే పూర్తి చేయండి. "రేపు చేద్దాం" అనే ఆలోచనే చాలా కలలను అక్కడే ఆపేస్తుంది. కష్టకాలం వచ్చినప్పుడు వెనక్కి తిరగకండి, ఆ కష్టమే మీ బలానికి పరీక్ష. ఈ రోజు మీరు పడే శ్రమ, రేపటి మీకు మీరిచ్చే గొప్ప బహుమతి.

-మహాదేవ

## వింతల్లో వింతలు

### కార్లు సైతం కళ్లు తేలేసే వేగం!



స్పెయిన్‌కు చెందిన 27 ఏళ్ల డీగో పోన్సలే, కెనడాలోని క్యూబెక్‌లో మూసివేసిన కొండ రోడ్డుపై స్కేట్‌బోర్డ్‌పై నిలబడి గంటకు 94.34 మైళ్ల (151.83 కి.మీ.) వేగంతో దూసుకెళ్లి కొత్త గిన్నిస్ రికార్డు సృష్టించాడు! చాలా కార్లు కూడా ఆ వేగాన్ని చూడవు. వాస్తవానికి తొలి ప్రయత్నంలోనే 91.27 మైళ్లతో పాత రికార్డును దాటేశాడు, కానీ "ఇంకా తృప్తి లేదు" అని ఐదు రోజులు మంచి వాతావరణం కోసం ఆగి, సెప్టెంబర్ 22న రికార్డు బద్దలు కొట్టాడు. పాత రికార్డు 2017లో ఇదే రోడ్డుపై సృష్టించిన బ్రిటన్ స్కేటర్ పీటర్ కానలీది. చక్రాల కింద కంకర రాళ్లు ఎదురైనా దూసుకెళ్లే పెద్ద, మెత్తటి చక్రాలే తన రహస్యమట!

# జ్వరం శత్రువు కాదు



ఆశ్చర్యంగా అనిపించినా జ్వరం శత్రువు కాదు. మనల్ని కాపాడే, ఆపదల గురించి అప్రమత్తం చేసే మిత్రుడే! మనం జ్వరాన్ని ఒక జబ్బుగా భావిస్తుంటాం గానీ నిజానికిది ఓ లక్షణం మాత్రమే. శరీరం లోపలేదో జబ్బుతో పోరాడుతోందనటానికి ఒక సంకేతమే. ఇన్‌ఫెక్షన్లు, క్యాన్సర్లు, స్వీయరోగనిరోధక జబ్బులు.. ఇలా రకరకాల సమస్యల్లో జ్వరం రావచ్చు. కారణాన్ని గుర్తించమని ఇది తరచూ హెచ్చరిస్తూనే ఉంటుంది. దీన్ని ఎప్పుడు తేలికగా తీసుకోవాలో, ఎప్పుడు అత్యవసర చికిత్స అవసరమో తెలుసుకోవటంలోనే ఉంది అసలైన విజ్ఞత.

జ్వరం అంటే? శరీర ఉష్ణోగ్రత నార్మల్ కన్నా పెరగటం. నార్మల్ శరీర ఉష్ణోగ్రత అనేది అందరిలో ఒకేలా ఉండాలని లేదు. కొందరిలో ఎక్కువ, తక్కువ ఉండొచ్చు. కానీ సాధారణంగా సుమారు 98.6 డిగ్రీల ఫారన్‌హీట్ ఉష్ణోగ్రతను నార్మల్‌గా భావిస్తుంటారు. రక్తం వేడిగా ఉండే మనలాంటి జీవుల్లో శరీర ఉష్ణోగ్రత స్థిరంగా ఉంటుంది. బయటి ఉష్ణోగ్రతతో సంబంధం లేకుండా ఒకేలా కొనసాగుతుంది. వాతావరణం వేడిగా ఉన్నప్పుడు చెమట పోయటం ద్వారా చల్లబడుతుంది. చల్లగా ఉన్నప్పుడు చెమట పట్టకుండా చూడటం ద్వారా వెచ్చగా ఉంటుంది. ఈ ప్రక్రియను మన మెదడులోని హైపోథలమస్ నిరంతరం నియంత్రిస్తుంటుంది. జ్వరం రావటం లోనూ దీని పాత్రే కీలకం. చాలా జ్వరాలకు ఇన్‌ఫెక్షన్లే కారణం. వీటికి దారితీసే బ్యాక్టీరియా, వైరస్ వంటి వ్యాధి కారకాలు ఒంట్లోకి ప్రవేశించినప్పుడు రోగనిరోధక వ్యవస్థ వాటిని గుర్తించి, మెదడుకు సంకేతాలు పంపిస్తుంది. దీంతో మెదడు శరీర ఉష్ణోగ్రత పెంచాలంటూ హైపోథలమస్‌ను పురమాయిస్తుంది. అప్పుడది శరీర ఉష్ణోగ్రత లక్ష్యాన్ని పెంచుతుంది. దీన్ని చేరుకోవటానికి చర్మం సమీపంలోని రక్తనాళాలు సంకోచించి, ఒంట్లోంచి వేడి బయటకు పోవటం ఆగుతుంది. అలాగే కండరాలు వేగంగా సంకోచించటం వల్ల ఉష్ణోగ్రత పెరిగి, పైస్థాయికి చేరుతుంది. దీని మూలంగానే వణుకు పుడుతుంటుంది. ఇదంతా వ్యాధి కారకాల పనిపట్టే ప్రక్రియలో భాగమే. అంటే జ్వరం శత్రువు కాదు. కాస్త ఇబ్బంది పెట్టినా మనల్ని కాపాడటానికి తోడ్పడే మిత్రుడన్నమాట.

**అత్యవసర చికిత్స ఎప్పుడు?**

మూడు నెలల కన్నా తక్కువ వయసు పిల్లలకు జ్వరం వస్తే తాత్సారం చేయరాదు. వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. ఇతర పిల్లల్లోనైతే మామూలుగా పాలు తాగుతూ, ఆహారం తీసుకుంటూ, ఆడుకుంటూ, తిరుగుతున్నట్టయితే ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఒకవేళ చికాకు, అసౌకర్యానికి గురవుతుంటే డాక్టర్ సలహా మేరకు పారాసిటమాల్ మందు ఇవ్వచ్చు. బ్యాక్టీరియా, వైరస్‌లు ఉద్ధృతంగా ఉన్న తొలిదశలో దీంతో వెంటనే ఉష్ణోగ్రత పూర్తిగా నార్మల్‌కు రాకపోవచ్చు. అయినా హాయిగా ఉండటానికి తోడ్పడతాయి. అయితే..

**మందు వేసినా ఉపశమనం కలగకపోయినా**

నీటిశాతం తగ్గిన లక్షణాలు కనిపించినా.. అంటే 8 నుంచి 10 గంటల పాటు మూత్రం పోయకపోయినా, ఏడ్చినప్పుడు కన్నీళ్లు రాకపోయినా, నోరు ఎండిపోయినా, ద్రవాలు తీసుకోవటానికి నిరాకరించినా
మెడ బిగువుగా అయినా లేదా తలనొప్పి వస్తున్నా
ఎప్పుడూ మగతగా ఉంటున్నా
శ్వాస తీసుకోవటానికి ఇబ్బంది పడుతున్నా
చర్మం మీద దద్దు కనిపించినా
కీళ్ల వాపు, నొప్పి ఉన్నా
ఐదు రోజులైనా జ్వరం తగ్గకపోయినా
అత్యవసరంగా ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిందే.

**పెద్దవారిలోనైతే..**

శ్వాస సరిగా తీసుకోలేకపోవటం
ఛాతీ నొప్పి
తీవ్రమైన తలనొప్పి, మెడ బిగుసుకోవటం
తికమక పడటం
కడుపు నొప్పి
తరచూ వాంతులు
నోరు ఎండిపోవటం, మూత్రం ముదురు రంగులోకి మారటం, ద్రవాలు తీసుకోలేకపోవటం
చర్మం మీద దద్దు
ద్రవాలు మింగలేకపోవటం
మూత్రం పోస్తున్నప్పుడు నొప్పి
వీపులో నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే సత్వరం ఆసుపత్రికి వెళ్లాలి.

టైఫాయిడ్ కాకపోవచ్చు

మనదగ్గర జ్వరం అనగానే టైఫాయిడ్ అనే అనుకుంటారు. అందుకే చాలాచోట్ల ముందుగా వైడాల్ పరీక్ష చేస్తుంటారు. కాకపోతే ఇది చాలామందిలో ఫాల్స్ పాజిటివ్.. అంటే జబ్బు లేకపోయినా ఉన్నట్టుగా కనిపిస్తుంటుంది. దీంతో టైఫాయిడ్ లేకపోయినా డాక్టర్లు మందులు ఇస్తుంటారు. దీంతో యాంటీబయాటిక్ నిరోధకత, ఇతర దుష్ప్రభావాలు తలెత్తుతాయి.

**మేలు ఇలా..**

బ్యాక్టీరియా, వైరస్ వంటి వ్యాధి కారకాలు నార్మల్ ఉష్ణోగ్రతను బాగా తట్టుకుంటాయి. అదే జ్వరంలోనైతే వీటి మనుగడ కష్టమవుతుంది. అవి చనిపోవటం మొదలవుతుంది లేదా వృద్ధి చెందటం నెమ్మదిస్తుంది. అధిక ఉష్ణోగ్రతలో మన రోగనిరోధక వ్యవస్థ మరింత వేగంగానూ పనిచేస్తుంది. మ్యాక్రోఫేజెస్, తెల్ల రక్తకణాలు, లింఫోసైట్ల వంటి 'సైనిక' కణాలు ఉత్పత్తయ్యేలా, అవి ఇన్‌ఫెక్షన్ ఉన్న చోటుకు త్వరగా వెళ్లేలా పురమాయిస్తుంది. యాంటీబాడీలను ఉత్పత్తి చేసే టి కణాలు ఎక్కువగా వృద్ధి చెందేలా చేస్తుంది. అందువల్ల ఇన్‌ఫెక్షన్లు త్వరగా తగ్గుతాయి. ఉష్ణోగ్రత పెరిగిన వెంటనే జ్వరాన్ని తగ్గించే మందులు వేసుకుంటే ఈ రక్షణ ప్రక్రియ నెమ్మదిస్తుంది. బ్యాక్టీరియా, వైరస్ వేగంగా పెరుగుతాయి. అవి రోగనిరోధక వ్యవస్థను తట్టుకునేలా మారతాయి. దీంతో ఇన్‌ఫెక్షన్లు ఎక్కువ కాలం కొనసాగుతాయి. అలాగని జ్వరాన్ని అసలే తగ్గించకూడదని కాదు. ఇన్‌ఫెక్షన్ కారకాన్ని గుర్తించి, తగు చికిత్స చేయటం ముఖ్యమన్నమాట. ఒక్క జ్వరం తగ్గే మందులు మాత్రమే వాడితే అప్పటికి ఉపశమనం కలగొచ్చు గానీ దీనికి మూలమైన ఇన్‌ఫెక్షన్ అలాగే ఉంటుంది.

**మూడు రకాలు**

కొందరు ఒళ్లు కాస్త వెచ్చగా, నోరు చేదుగా అనిపించగానే లోజ్వరం ఉందని భావిస్తుంటారు. జ్వరం లేకపోయినా ఉందనుకుంటుంటారు. థర్మామీటరుతో చూసుకుంటేనే అసలు విషయం తెలుస్తుంది. చంకలో థర్మామీటర్ కొలత 99 ఫారన్‌హీట్ డిగ్రీలు, అంతకన్నా ఎక్కువ.. నోట్లో, మలద్వారంలో, చెవిలో కొలత 100.4, అంతకన్నా ఎక్కువుంటే జ్వరంగా భావించాలి. ఉష్ణోగ్రత తీరును బట్టి దీన్ని మూడు రకాలుగా చెప్పుకోవచ్చు.

మామూలు: 102 డిగ్రీల ఫారన్ హీట్ కన్నా తక్కువ
ఒక మాదిరి: 102 నుంచి 104
తీవ్రం: 104 డిగ్రీలు మించితే

**ఇవీ లక్షణాలు**

ఒళ్లు వేడిగా ఉండటం
శ్వాస వేగంగా తీసుకోవటం
వణుకు
నాడి వేగం పెరగటం
ఒళ్లు నొప్పులు
తిండి సరిగా తినకపోవటం (ముఖ్యంగా పిల్లల్లో)

ఇలా తగ్గించుకోవాలి

జ్వరం తీవ్రంగా ఉంటే ఎవరికైనా ఆందోళన కలుగుతుంది. కానీ ఇంట్లో సురక్షితమైన పద్ధతులను పాటించటం ద్వారా త్వరగా తగ్గేలా చూసుకోవచ్చు.

**1. నీరు-ఆహారం**

జ్వరం వచ్చినప్పుడు ఒంట్లో నీరు తగ్గుతుంది. కాబట్టి తగినంత నీరు, ద్రవాలు తీసుకోవాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహారం తినాలి. పండ్లు, కూరగాయలు తీసుకోవచ్చు. పప్పులతో ప్రొటీన్ లభిస్తుంది. ఇది త్వరగా కోలుకోవటానికి తోడ్పడుతుంది. మాంసాహారులైతే చికెన్ వంటివి తినొచ్చు. అయితే కూల్‌డ్రింకులు, కెఫీన్‌కు దూరంగా ఉంటే మంచిది.

**2. విశ్రాంతి-నిద్ర**

విశ్రాంతి తీసుకుంటే రోగనిరోధక వ్యవస్థ పనిచేయటానికి మరింత శక్తి లభిస్తుంది. పెద్దవాళ్లు రోజుకు 7-8 గంటలు నిద్రపోయేలా చూసుకోవాలి. పిల్లలకైతే ఇంకా ఎక్కువ నిద్ర అవసరం. రాత్రి సరిగా నిద్ర పట్టకపోతే పగటి పూట కునుకు తీయొచ్చు.

**3. ఒళ్లు చల్లబడేలా**

నుదురు మీద తడి బట్ట వేయాలి. తడి తువ్వాలుతో ఒళ్లంతా తుడవాలి. ఐస్ బ్యాగుతోనైనా అద్దుకోవచ్చు. జ్వరం మరీ ఎక్కువగా ఉంటే చంకల్లో, గజ్జల్లో తడి తువ్వాలు, ఐస్ ముక్కలు పెట్టొచ్చు. ఫ్యాన్లు, వీలుంటే ఏసీ వేసుకుంటే మంచిది.

**4. మాత్రలు-మందులు**

పారాసిటమాల్ మాత్రలు, పిల్లలకైతే సిరప్ మేలు చేస్తాయి. ఇవి జ్వరం తగ్గటానికి తోడ్పడతాయి. ఒకవేళ జ్వరం మరీ తీవ్రంగా ఉండి, మాత్రలు మింగలేని స్థితిలో ఉంటే ఇంజెక్షన్ రూపంలో ఇవ్వచ్చు. అయితే ఐబూప్రొఫెన్, డైక్లోఫెనాక్ వంటి నొప్పి మందులు వాడొద్దు. వర్షాకాలంలో వైరల్ జ్వరాలు ఎక్కువ కాబట్టి ఇది మరింత ముఖ్యం. వీటితో ప్లేట్‌లెట్లు తగ్గటం, రక్తస్రావం వంటి దుష్ప్రభావాలు తలెత్తుతాయి. కొందరికి కిడ్నీలు దెబ్బతినొచ్చు కూడా. పిల్లలకు ఆస్ప్రిన్ ఇవ్వద్దు.

**5. గది సరిగా**

గదిలోకి గాలి వచ్చి పోయేలా, వేడి ఎక్కువగా లేకుండా చూసుకోవాలి. అసౌకర్యం కలగకుండా వెలుతురు తగ్గించుకోవాలి. నీళ్లు, టిష్యూ పేపర్లు అందుబాటులో ఉండేలా మంచానికి దగ్గరగా పెట్టుకోవాలి.

# రోజువారీ ఇవి అందేలా చూసుకుంటే.. జుట్టు రాలడాన్ని నివారించవచ్చు!

**శిరోజాలకు పోషకాల అవసరం ఎంతో**
**బయోటిన్, విటమిన్ ఈ, సీ, ఏ అందేలా చూసుకోవాలి**
**ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ తోనూ ప్రయోజనం**



శిరోజాలు రాలిపోవడం వెనుక ఎన్నో కారణాలు ఉంటాయి. పోషకాలు లోపించొచ్చు. లేదంటే ఒత్తిడి, ఆందోళన కారణం కావచ్చు. హార్మోన్లలో మార్పులతోనూ శిరోజాలు రాలిపోయే సమస్య ఎదురవుతుంది. అయితే కారణాన్ని గుర్తిస్తే ఈ సమస్యను సులభంగానే నయం చేసుకోవచ్చు. నివారించలేని సమస్య ఇది కానే కాదు. ముఖ్యంగా శిరోజాలకు బలాన్నిచ్చే ముఖ్యమైన పోషకాలు కొన్ని ఉన్నాయి. వీటిని రోజువారీ ఆహారం రూపంలో అందేలా చూసుకోవాలి.

**బయోటిన్**

ఇది బీ 7 విటమిన్. ఇది లోపించడం వల్ల శిరోజాలకు బలం తగ్గుతుంది. బయోటిన్ లోపించినప్పుడు జుట్టు కుదుళ్లకు సరిపడా ఆక్సిజన్ సరఫరా కాదు. దీంతో జుట్టు కుదుళ్లు బలహీనపడతాయి. దాంతో జుట్టు రాలుతుంది. 18 ఏళ్లు నిండిన వారు ప్రతి రోజూ 30 ఎంసీజీ నుంచి 100 ఎంసీజీ వరకు బయోటిన్ అందేలా చూసుకోవాలి. బయోటిన్ కొంచెం ఎక్కువైనా మూత్రం ద్వారా విసర్జితం అవుతుంది.

**విటమిన్ ఏ**

సాధారణంగా విటమిన్ ఏ అంటే కంటి ఆరోగ్యానికే అనుకుంటుంటాం. కానీ, ఇది శిరోజాల ఎదుగుదలకూ ముఖ్యమే. విటమిన్ ఏ ఎక్కువైనా ప్రమాదమే. అందుకని రోజులో 900 ఎంసీజీ పరిమాణం మించకుండా విటమిమన్ ఏ తీసుకోవచ్చు. ఎక్కువ తీసుకుంటే అదనపు మొత్తాన్ని మన శరీరం మూత్రం ద్వారా బయటకు పంపలేదు. శరీరంలోనే నిల్వ చేసుకుంటుంది. కనుక మోతాదు మించకూడదు.

**ఐరన్**

మన శరీరంలోని అన్ని భాగాలకు ఆక్సిజన్ ను ఎర్ర రక్త కణాలు చేరవేస్తాయి. అప్పుడు జీవక్రియలు సాఫీగా నడుస్తాయి. కనుక ప్రతి ఒక్కరూ ఐరన్ లోపం లేకుండా చూసుకోవాలి. ఐరన్ లోపిస్తే జుట్టు కూడా రాలిపోతుంది. రోజులో పెద్దవారు గరిష్టంగా 45 ఎంజీ మించకుండా ఐరన్ అందేలా చూసుకోవాలి.

**ఒమెగా 3**

ఇవి మంచి కొవ్వులు. జుట్టు ఎదిగేందుకు సైతం ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉపయోగపడుతాయి. జుట్టు రాలిపోతున్న వారికి ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్, 6 యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్లను ఇచ్చి చూసినప్పుడు మంచి ఫలితాలు కనిపించాయి.

**విటమిన్ డీ**

విటమిన్ డీ లోపం అలోపీసియాకు దారితీస్తుంది. అంటే మహిళల్లో బట్టతలను ఇలా చెబుతారు. వెంట్రుకలకు సంబంధించి కొత్త ఫాలికల్స్ ఏర్పడడంలో విటమిన్ డీ ప్రభావం ఉంటుందని ఓ అధ్యయనంలో వెల్లడైంది. పెద్దలు రోజువారీ 600 ఐయూల మేరకు విటమిన్ డీ అందేలా చూసుకోవాలి.

**విటమిన్ ఈ**

విటమిన్ ఈ కూడా జుట్టు ఆరోగ్యంగా ఎదిగేందుకు అవసరం. ఇది లోపించినా జుట్టు రాలిపోవచ్చని పలు అధ్యయనాలు వెల్లడించాయి. రోజువారీగా 3-4 ఎంజీ మేర తీసుకోవచ్చు.

**విటమిన్ సీ**

వ్యాధి నిరోధక శక్తిని విటమిన్ సీ పెంచుతుంది. చర్మం, శిరోజాల ఆరోగ్యానికి కారణమయ్యే కొల్లాజెన్ ను పెంచుతుంది. రోజులో 50-75 ఎంజీ మధ్య విటమిన్ సీని ఆహారం ద్వారా అందేలా చూసుకోవాలి. పోషకాల లోపం లేకుండా జాగ్రత్త పడిన తర్వాత కూడా జుట్టు రాలే సమస్య తగ్గకపోతే.. అప్పుడు వైద్యుల సలహా అవసరపడుతుంది.

# ఇంట్లో మొక్కలు పెంచితే.. బోలెడన్ని ప్రయోజనాలు

**గాలిని శుభ్రం చేసే శక్తి మొక్కలకు ఉంది**
**వీటి నుంచి అదే పనిగా స్వచ్ఛమైన ఆక్సిజన్ విడుదల**
**ఒత్తిడి, ఆందోళన నుంచి ఉపశమనం**
**ఇంటి మొక్కలతో నాణ్యమైన నిద్ర, ఆరోగ్యం**



కొందరు ఇంట్లో కొంచెం ఖాళీ స్థలం ఉన్నా దాన్ని మొక్కలతో నింపేస్తారు. పూల కుండీల్లో తమకు నచ్చిన మొక్కలను పెంచుకుంటూ, ప్రాణంగా చూసుకుంటారు. మొక్కలపై, పర్యావరణంపై ప్రేమతోనే అనుకోకండి. మొక్కలను పెంచడం వల్ల అదనంగా మనకూ ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఈ మధ్య సోషల్ మీడియాలో ఒక అంశం తెగ ట్రెండింగ్ అయింది. కూలర్ లో నీళ్లు పోస్తున్న ఫొటోను పెట్టి.. 'మొక్కలకు నీళ్లు పోస్తే ఈ అవస్థ తప్పేదిగా' అంటూ క్యాప్షన్ పెట్టారు. ఇది చాలా మందిని ఆలోచింపచేసింది. ఇందులో నిజంగా ఎంతో అర్థం ఉండడంతో తెగ షేర్ కూడా అయింది. అవును నిజమే, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటికి నీళ్లు పోసి, అవి చెట్లుగా మారితే బతికి ఉన్నంత కాలం అవి మనకు నీడను ఇవ్వడమే కాదు. ఎంతో కాలుష్యాన్ని తగ్గిస్తాయి. వేడి నుంచి ఉపశమనాన్ని, పర్యావరణ కాలుష్యం నుంచి రక్షణనిచ్చే చెట్లకు ప్రాధాన్యం ఇవ్వడం చాలా అవసరం.

**వాయు నాణ్యత**

ఇంట్లో ఎయిర్ ప్యూరిఫయర్ అవసరం నేడు ఎంతో ఉంది. దీనికి కారణం వాయు, పారిశ్రామిక కాలుష్యం అధికం కావడమే. ఇంట్లో ఒక ప్యూరిఫయర్ ఉంటే ఎంత మేలు చేస్తుందో తెలియదు కానీ, ఒక్క చెట్టు ఉంటే అంతకంటే ఎక్కువ మేలు చేస్తుందని చెప్పొచ్చు. మొక్కలు సహజంగానే గాలిని ఫిల్టర్ చేసే సాధనాలు. గాల్లోంచి హాని కారకాలను తొలగిస్తాయి. ఇంట్లోని కుండీల్లో పెంచుకునే స్పైడర్ ప్లాంట్స్, పీస్ లిల్లీస్ తదితర మొక్కలు హానికారక టాక్సిన్లను తొలగిస్తాయి. ఇంట్లో గాలి నాణ్యతను పెంచుతాయి.

**ఒత్తిడి, ఆందోళన నుంచి ఉపశమనం**

ఇంట్లో మొక్కలతో మరో ప్రయోజనం మనలో ఒత్తిడి తగ్గుతుంది.

ఆందోళన కూడా ఉపశమిస్తుంది. ఎందుకంటే మొక్కల నుంచి స్వచ్ఛమైన ఆక్సిజన్ విడుదల అవుతుంది. అది మనసుకు ఉల్లాసాన్నిస్తుంది. మొక్కలు చుట్టూ ఉంటే మరింత సమర్థవంతంగా పనిచేస్తారని, జ్ఞాపకశక్తికి చురుగ్గా మారుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. మెదడుపై మొక్కలు చూపించే సానుకుల ఫలితాలే దీనికి కారణం.

**వ్యాధి నిరోధక శక్తి**

ఇంట్లో పెంచుకునే మొక్కలతో వ్యాధి నిరోధక శక్తి బలపడుతుందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. మొక్కలు ఫైటోసైడ్స్ ను విడుదల చేస్తాయి. బ్యాక్టీరియా, వైరస్ పై పోరాడడంలో సాయపడే సహజ రసాయనం ఫైటోసైడ్స్.

**నాణ్యమైన నిద్ర**

మొక్కలు మన నిద్ర నాణ్యతను కూడా పెంచుతాయి. ఎందుకంటే మొక్కల నుంచి మనకు చక్కని ఆక్సిజన్ అందడం వల్ల నిద్ర నాణ్యత మెరుగు పడుతుంది. ఒత్తిళ్లు కూడా తగ్గుతాయి. కనుక మంచి నిద్ర సాధ్యపడుతుంది.

# ముంబై ఇండియన్స్ హెడ్ కోచ్ ఎవరు? ద్రవిడ్, గిల్‌క్రిస్ట్, మోర్గాన్‌కు నో ఛాన్స్!



ఐపీఎల్ 2026లో ఎదురైన దారుణ వైఫల్యం (9వ స్థానం) తర్వాత ఐదుసార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ , హెడ్ కోచ్ మహేల జయవర్ధనే పరస్పర అంగీకారంతో విడిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ముంబై ఇండియన్స్‌కు తదుపరి ప్రధాన కోచ్‌గా ఎవరు వ్యవహరిస్తారనే అంశం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది.

**రేసు నుంచి తప్పుకున్న రాహుల్ ద్రవిడ్:**
టీమిండియాను 2024 టీ20 ప్రపంచ కప్ విజేతగా నిలిపిన రాహుల్ ద్రవిడ్ ముంబై ఇండియన్స్ కోచ్ రేసులో ఉన్నారనే ప్రచారాన్ని ప్రముఖ క్రికెట్ మీడియా సంస్థ క్రిక్‌బజ్ ఖండించింది.

కుటుంబానికి ప్రాధాన్యం: ద్రవిడ్ ప్రస్తుతం తన కుటుంబానికి, ప్రత్యేకించి తన కుమారులు (సమిత్, అన్వయ్) క్రికెట్ కెరీర్‌పై దృష్టి పెట్టాలని చూస్తున్నారు. 2026 సీజన్‌కు ముందే రాజస్థాన్ రాయల్స్ కోచ్ పదవి నుంచి తప్పుకున్న ద్రవిడ్‌కు ఐపీఎల్ లీగ్ నుంచి భారీ ఆఫర్లు వచ్చినప్పటికీ, ఆయన ఐపీఎల్ 2027 సీజన్‌లో కోచింగ్ బాధ్యతలు చేపట్టడానికి ఆసక్తిగా లేరని స్పష్టమైంది.

ఇదే బాటలో ఆస్ట్రేలియా దిగ్గజం ఆడమ్ గిల్‌క్రిస్ట్, ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ కూడా తాము అందుబాటులో లేమని ఐపీఎల్ ఫ్రాంచైజీలకు తెగేసి చెప్పారు.

**ముంబై ఇండియన్స్ కోచ్ రేసులో ఉన్నది వీళ్లే:**
మైఖేల్ హస్సీ : చెన్నై సూపర్ కింగ్స్ (జూఖ) బ్యాటింగ్ కోచ్ పదవి నుంచి తప్పుకున్న హస్సీ, ఐపీఎల్ ఫ్రాంచైజీలతో చర్చలు జరుపుతున్నారు. ఆయన ముంబై ఇండియన్స్ రేసులో ప్రధానంగా ఉండే అవకాశం ఉంది.

ఆడ్రియన్ బిరెల్ : సౌతాఫ్రికాకు చెందిన ఈ సీనియర్ కోచ్ ప్రస్తుతం ఫ్రాంచైజీ క్రికెట్‌లో హాట్ కేక్‌లుగా మారారు. ూూ20 లీగ్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టుకు ఏకంగా 3 టైటిళ్లు, 4 ఫైనల్స్ అందించారు.

ఆరోన్ ఫించ్ : ఆస్ట్రేలియా టీ20 ప్రపంచ కప్ విజేత కెప్టెన్ ఆరోన్ ఫించ్ కూడా కొన్ని ఐపీఎల్ జట్లతో చర్చలు జరిపినట్లు తెలుస్తోంది.

**కొత్త కోచ్ నిర్ణయంపైనే సపోర్ట్ స్టాఫ్ భవితవ్యం:**
ముంబై ఇండియన్స్ యాజమాన్యం తమ నూతన హెడ్ కోచ్ ఎంపిక కోసం త్వరలోనే ఇంటర్వ్యూలు ప్రారంభించనుంది.

కొత్తగా వచ్చే హెడ్ కోచ్‌కే ప్రస్తుత సపోర్ట్ స్టాఫ్ అయిన లసిత్ మలింగ, పారస్ మాంబ్రే (బౌలింగ్ కోచ్‌లు), కీరన్ పొలార్డ్ (బ్యాటింగ్ కోచ్), కార్ల్ హాప్‌కిన్సన్ (ఫీల్డింగ్ కోచ్)లను కొనసాగించాలా వద్దా అనే నిర్ణయాధికారాన్ని ఫ్రాంచైజీ వదిలేసింది.

# బుమ్రా ఇన్.. ఐదుగురు ఔట్! న్యూజిలాండ్ సిరీస్‌కు భారత టెస్ట్ జట్టులో భారీ మార్పులు



న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా నవంబర్ 19వ తేదీ నుంచి ప్రారంభం కానున్న రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ కోసం భారత జాతీయ ఎంపిక కమిటీ బీసీసీఐ ద్వారా 16 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. గత ఆగస్టులో శ్రీలంకతో జరిగిన టెస్టు సిరీస్‌తో పోలిస్తే, ఈ పర్యటన కోసం టీమిండియాలో ఏకంగా 5 కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. అందరి దృష్టిని ఆకర్షించిన ప్రధాన అంశం జస్‌ప్రీత్ బుమ్రా పునరాగమనం, మోకాలి గాయం కారణంగా లంక సిరీస్‌కు దూరమైన బుమ్రా, ఇప్పుడు పూర్తి ఫిట్‌నెస్ సాధించి కివీస్ గడ్డపై భారత పేస్ దళానికి నాయకత్వం వహించబోతున్నాడు.

**బౌలింగ్ విభాగంలో కీలక మార్పులు:**
న్యూజిలాండ్ వేగవంతమైన పిచ్‌లను దృష్టిలో పెట్టుకుని సెలెక్టర్లు ఐదుగురు ఫాస్ట్ బౌలర్లకు జట్టులో చోటు కల్పించగా, ముగ్గురు స్పిన్నర్లను మాత్రమే ఎంపిక చేశారు.

ఆకాశ్ దీప్ రీ-ఎంట్రీ: వెన్ను గాయం కారణంగా దాదాపు ఏడాది కాలంగా టెస్టులకు దూరంగా ఉన్న ఆకాశ్ దీప్ మళ్లీ టెస్టు జట్టులోకి వచ్చాడు.

అన్షుల్ కంబోజ్ కమ్‌బ్యాక్: ఇంగ్లాండ్‌పై మాంచెస్టర్ టెస్టులో ఆడిన తర్వాత జట్టుకు దూరమైన అన్షుల్ కంబోజ్ మళ్లీ సెలెక్టర్ల పిలుపునందుకున్నాడు.

సాయి సుదర్శన్, సుందర్ రీ-ఎంట్రీ: గాయాల కారణంగా శ్రీలంక టూర్ కు దూరమైన సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్‌లు తిరిగి తుది జట్టు రేసులోకి వచ్చారు.

**జట్టు నుంచి వైదొలిగిన ఐదుగురు ఆటగాళ్లు:**
శ్రీలంక సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన స్పిన్నర్ మానవ్ సుతార్ కు కివీస్ కండిషన్స్ దృష్ట్యా చోటు దక్కలేదు. అలాగే సర్ఫరాజ్ ఖాన్, సారాంశ్ జైన్, గుర్నూర్ బ్రార్, ఆకిబ్ నబీలను ఈ పర్యటనకు పక్కనపెట్టారు.

**ఇన్** : జస్‌ప్రీత్ బుమ్రా, ఆకాశ్ దీప్, సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్, అన్షుల్ కంబోజ్.

**ఔట్** : మానవ్ సుతార్, ఆకిబ్ నబీ, గుర్నూర్ బ్రార్, సర్ఫరాజ్ ఖాన్, సారాంశ్ జైన్.

**భారత టెస్టు జట్టు :**
శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), దేవదత్ పడిక్కల్, రిషభ్ పంత్ (ఫిట్‌నెస్‌కు లోబడి), ధృవ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, అన్షుల్ కంబోజ్, జస్‌ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ (ఫిట్‌నెస్‌కు లోబడి), ఆకాశ్ దీప్, సాయి సుదర్శన్, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్.

# బెంగళూరులో వర్షం.. IND vs WI మ్యాచ్ టాస్ ఆలస్యం!



భారత్ వర్సెస్ వెస్టిండీస్ జట్ల మధ్య బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియం వేదికగా జరగాల్సిన ఐదో టీ20 (సిరీస్ డిసైడర్) మ్యాచ్‌కు వర్షం పెద్ద అడ్డంకిగా మారింది. చిన్నస్వామి పరిసర ప్రాంతాల్లో డ్రిజ్లింగ్ (చినుకులు) పడుతుండటంతో నిర్ణీత సమయానికి జరగాల్సిన టాస్ అధికారికంగా ఆలస్యం పడిపోయింది. ఆటకు వరుణుడు అంతరాయం కలిగిస్తుండటంతో క్రికెట్ అభిమానులు తీవ్ర ఉత్కంఠకు గురవుతున్నారు.

టాస్ జాప్యం: భారీ వర్షం కారణంగా టాస్ వేయడాన్ని గ్రౌండ్ అంపైర్లు వాయిదా వేశారు.

పిచ్‌పై కవర్లు: మైదానంలో ఇంకా చినుకులు పడుతుండటంతో పిచ్, రన్-అప్‌లతో సహా మొత్తం ప్రధాన వికెట్ ప్రాంతాన్ని కవర్లతో పూర్తిగా కప్పి ఉంచారు.

వార్మప్స్ నిలిపివేత: వర్షం తగ్గకపోవడంతో ఇరు జట్ల ఆటగాళ్లు ఇప్పటివరకు ఎలాంటి వార్మప్ డ్రిల్స్ లేదా ప్రాక్టీస్ సెషన్లను ప్రారంభించలేదు.

డ్రైనేజీ వ్యవస్థపైనే ఆశలు: చిన్నస్వామి స్టేడియంలో ప్రపంచ స్థాయి సబ్-ఎయిర్ డ్రైనేజీ వ్యవస్థ (ాబఎ-ంబతీటుఎవ ఐతీఖఅఖుస్త్రవ ాఎర్వఎ) ఉంది. వర్షం పూర్తిగా తగ్గితే కేవలం 15 నుంచి 20 నిమిషాల్లోనే మైదానాన్ని ఆటకు సిద్ధం చేసే అవకాశం ఉంది.

ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఇప్పటి వరకు చెరో రెండు విజయాలతో భారత్, వెస్టిండీస్ జట్లు 2--2తో సమంగా నిలిచాయి.

డిసైడర్ రికార్డు: టీమిండియాకు సిరీస్ డిసైడర్ మ్యాచ్‌లలో అదిరిపోయే ట్రాక్ రికార్డు ఉంది. ఒత్తిడిలో చెలరేగి ఆడి సిరీస్ కైవసం చేసుకోవడం టీమిండియాకు అలవాటే!

షాయ్ హోప్ డేంజర్: వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ ఈ సిరీస్‌లో పరుగుల సునామీ సృష్టిస్తూ భారత జట్టుకు ప్రధాన ముప్పుగా మారాడు. అతడు ఇప్పటి వరకు రెండు సెంచరీలని నమోదు చేసుకున్నాడు. కాగా హోప్ ని త్వరగా ఔట్ చేయడంపైనే మ్యాచ్ ఫలితం ఆధారపడి ఉంది.

# మౌని రాయ్ కొత్త లుక్ చూసాక గుండె గల్లంతే!



అందాల నటి మౌనీ రాయ్ నిరంతరం తన ఇన్ స్టా పోస్టులతో యువహృదయాలను కొల్లగొడుతున్న సంగతి తెలిసిందే. తన తాజా ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌తో సోషల్ మీడియాలో మరోసారి హల్‌చల్ చేశారు. ౕూ స్టోరియన్..బిసో.. బిసోవ్ ఎక్స్ అనే క్యాప్షన్‌తో మౌని షేర్ చేసిన ఫోటో క్షణాల్లోనే వైరల్‌గా మారింది. ఆకర్షణీయమైన లుక్‌తో ఉన్న ఈ ఫోటోను చూసి అభిమానులు, నెటిజన్లు లైకులు, గుండె గుర్తు ఎమోజీలతో కామెంట్ సెక్షన్‌ను ముంచెత్తారు. ఈ పోస్ట్‌కు ఆమె తోటి సెలబ్రిటీల నుంచి కూడా విశేష స్పందన లభించింది. ప్రముఖ నటులు అర్జున్ బిజ్లానీ, అనుషా దండేకర్, అషీమా వర్ధన్, ప్రముఖ స్టైలిస్ట్ అనుసోరు వంటి పరిశ్రమ స్నేహితులు ఫైర్, హార్ట్ ఎమోజీలను పోస్ట్ చేస్తూ ఆమె స్టైలింగ్- అందాన్ని ప్రశంసించారు. తోటి నటీనటులు, టెలివిజన్ ప్రముఖులు చూపిన ఈ ఆప్యాయత సోషల్ మీడియాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది .మౌనీ రాయ్ అభిమానులు, ఫ్యాన్ పేజీలు ఆమెను ఎంతగానో అభినందిస్తూ కామెంట్లు చేశారు. చాలామంది -రాకుమారి (షెహజాదీ)-, -డిస్నీ ప్రిన్సెస్-.. -దివా- అని అభివర్ణించారు. మౌని కేశాలంకరణ, దుస్తుల ఎంపికను మెచ్చుకుంటూ నెటిజన్లు ఆమెను ఫ్యాషన్ ఐకాన్‌గా అభివర్ణించారు. ఈ పోస్ట్ తో మౌని రాయ్ కు ఉన్న అంతర్జాతీయ, ప్రాంతీయ ప్రజాదరణ మరోసారి నిరూపితమైంది. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన శుభాకాంక్షలతో పాటు, సొంత రాష్ట్రమైన పశ్చిమ బెంగాల్‌కు చెందిన అభిమానులు --సుభో శారదీయ-- అని బెంగాలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ కామెంట్లు చేశారు. భాషలు, సరిహద్దులతో సంబంధం లేకుండా మౌనీకి ఉన్న క్రేజ్‌కు ఇది నిదర్శనంగా నిలిచింది. మొత్తానికి ఒక్క పోస్ట్‌తో సోషల్ మీడియా వేదికగా ఈ స్థాయి స్పందన రావడం మౌనీ రాయ్ డిజిటల్ ఇంపాక్ట్ కి, స్టార్ డమ్‌కు అద్దం పడుతోంది. వెండితెరపైనే కాకుండా, సోషల్ మీడియాలోనూ తన విలక్షణమైన స్టైల్‌తో మిలియన్ల మంది అభిమానులను ఆకట్టుకుంటూ ఇంటర్నెట్ సెన్సేషన్‌గా కొనసాగుతున్నారు.





Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965